
ఆంధ్ర సచిత్ర వారపత్రిక



15-3-61

25
నయాపైసలు

ANDHRA SACHITRA VĀRA PATRIKA



ఏకాంతము

చిత్రకారుడు : రాజు.



ఆంధ్రసచిత్ర వారపత్రిక

తెలుగు వెలుగులు

1—3—61 తేదీ సంచికలో "తెలుగువెలుగులు" శీర్షిక చాలా బాగున్నది. రచయితకు నా అభివందనములు. "శ్రీ వేంకటరత్నం తెలుగుతనం గుబాళించే లలితకళా విస్తరణకు మహాయత్నం" అన్న వాక్యం మరువరానిది. రచయిత పేరు తెలుపుతారని ఆశిస్తున్నాను.

జి. ప్రసన్నకుమార్ (బొబ్బిలి)

* * *

"సిరిగా మోగా ఉన్నవా రుంటారా ?" అని పాత సామెత. కాని అట్టి ధీరరత్నాలు ఉంటారు వెంకటరత్నంగారి వంటివారు. అని వారిని గూర్చి "తెలుగు వెలుగులు లో ముచ్చటిస్తూ తాము వ్రాసిన మాటలకు, నా హృదయపూర్వక అభినందనలు

ఎం. జగన్నాథరావు (మెదక్).

* * *

మీరు ప్రచురించే తెలుగు వెలుగులు శీర్షిక చాల బాగుంటున్నది. ఈ వారం (22—2—61) శ్రీ దేవులపల్లి రామానుజరావును గూర్చి తెలుగు వెలుగులలో చదివి చాల ఆనందించితిని.

ఎన్. హన్మంతప్ప (నిజామాబాదు)

* * *

22—2—61 తేది ఆంధ్ర సచిత్ర వార పత్రికలో 'తెలుగు వెలుగులు అను శీర్షికలో శ్రీ దేవులపల్లి రామానుజరావుగారిని గూర్చి ప్రకటించినందుకు సంపాదకులకు మా ధన్యవాదములు. దేశభక్తుల, సాహిత్యవరుల, కళాకారుల సమగ్ర స్వరూపాన్ని ప్రజలముందుంచినందులకు తెలుగువాడు నక్షత్రంలా మెరుస్తుంది. మీరు చరిత్రాంశములు కూడ మనసులో ఉంచుకొని (జన్మస్థలము, కాలము మొదలగునవి) చేర్పగలరని ఆశిస్తున్నాము.

వై. శంకరనారాయణ (తిరుపతి)

కవితా కింకిణి

అప్పుడప్పుడు ప్రచురించు కవితాకింకిణి బాగుంటున్నది. కాని అది ప్రతివార పత్రికలోనూ ప్రచురించబడుటలేదు. నా వరకు నేను కవితాకింకిణి చదువవలె నను ఆశతో వారపత్రిక కొనటం కొన్నింటిలో అది లేకపోవటం అసంతృప్తి కలుగజేయుచున్నది. ముక్కోటి ఆంధ్రులలో ఎవరో ఒకరు బహుమతి పొందదగిన కవిత ప్రతివారము ప్రచురించుటకు పంపలేకున్నారా ? కనుక ప్రతివారము తప్పక కవితా కింకిణిలో బహుమతి పొందిన కవితను ప్రచురించ గోరుచున్నాను.

అంబటిపూడి చంద్రశేఖరం (మూర్పుగూడా

మన పత్రికలో వారము విడిచి వారము ప్రచురింపబడు కవితాకింకిణి బహుముఖమై విప్పారుచున్నది. ఈ శీర్షికకు కేవలము పద్యములే గాక గేయములు కూడ పంపవచ్చునా ? పంపినచో కవితాకింకిణి పోటీకి స్వీకరింతురా ?

ఈవూరు శ్రీనివాసులురెడ్డి (మద్రాసు).

పంపవచ్చు

* * *

ముఖచిత్రం

ఈసారైనా కొత్తరకం ముఖచిత్రం, నూతనంగా ఉంటుందని ఆశించిన మాకు 1—3—61 తేదీ పత్రిక చూడగానే నైరాశ్యం కలిగింది. పైగా దానికి సంబంధించిన వ్యాసంలో పాశ్చాత్య దేశాలతో పోలిక తెచ్చి ఈ పద్ధతి హర్షించని వారిని విమర్శించారు. భారతదేశంలో కూడా రాష్ట్రపతి బిరుదు పొందినవారూ, లోక్‌సభకు నామినేటు అయినవారూ, అఖండ గౌరవం పొందినవారూ వెండితెర నటకుల్లో ఉన్నారు. కాని ఆంధ్రుల అభిమాన వారపత్రిక ముఖ చిత్రానికి నిత్య దర్శనమిచ్చే సినిమా తారలకంటె తగినవారు లేరా ?

కొత్తూరి వెంకటరామశర్మ (విశాఖపట్నం).

* * *

1—3—61తేదీ వెలువడిన పత్రిక చూడగానే నేను చాలా సంతోషించాను. ఈ వారం మీ పత్రిక ద్వారా "ముఖచిత్రం" అనే శీర్షికతో నా అభిమానతార శ్రీమతి అంజలీదేవిగారిని పరిచయం చేసినందుకు హృదయపూర్వక అభివందనములు.

శ్రీమతి అంజలీదేవిగారు సమర్థనీయమైన నటనాకౌశల్యంతో ముక్కోటి ఆంధ్రులకు అభిమాన తారగా నాటినుంచి నేటి వరకు ఉన్నత స్థానాన్ని అందుకొన్నారు.

ఆర్. కామేశ్వరరావు (విజయవాడ)

* * *

కార్టూనులు

ఆంధ్ర సచిత్ర వారపత్రిక తెరవగానే ముందుగా దర్శన మిస్తాయి పూమెన్‌గారి వ్యంగ్య చిత్రాలు. ఇవి అంత విశిష్టస్థానాన్ని ఆక్రమించటానికి ఒక ప్రత్యేక కారణం లేకపోలేదు. నిజంగా ఈ వ్యంగ్య చిత్రాలు పత్రికకు ఒక విశేషాకర్షణ. మామూలు వార్తల్ని వ్యంగ్యంగా చిత్రీకరించడంలో వారికి వారే సాటి అనిపిస్తుంది.

ఎం. శ్రీనివాసరావు (విజయవాడ—2)

* * *

ఈమధ్య పత్రికలో శ్రీ శంకర్‌గారి 'ఎప్పుడూ యింతే'' చాలా చప్పనయింది. ఎవరో ఏదో అన్నారని చెప్పి వాక్స్వాతంత్ర్యం గల శంకర్‌గారిలా దిగజార్చేస్తారనుకోలేదు. మళ్లీ పూర్వపు సొగసు తీసుకువస్తారని ఆశిస్తున్నాము.

బి. వేంకటకవులు (విజయనగరము)

* * * *

ఈ వారం (1—3—61) పత్రికలోని 'ఎప్పుడూ యింతే' కార్టూన్ అంత వాస్తవికంగా లేదు. ఎంత గయ్యాళి భార్య అయినా తన భర్త మీద అధికారం చెలాయించొచ్చు కాని ఇంటికొచ్చిన అతిథి పట్ల ఆవిధంగా ప్రవర్తిస్తుందంటె అంత నమ్మశక్యంకాదు. పోతే 47 వ పేజీలోని కార్టూన్ చాలా బాగుంది. న్యూలేక చచ్చాం. చివరిపేజీలోని బహుమతి పొందిన కార్టూన్‌లో నా కేమీ గొప్ప విశేషం కనపడలేదు.

పి. విద్యాపతిశాస్త్రి (నాగపూర్)



ఉత్తరాలు

కథలు

22—2—61 తేదీ పత్రికలోని 'శిక్ష' అనే కథ నన్నెంతో ఆకర్షించింది. కథ చివరి వరకు నిర్దోషి బాధపడుతూ చెప్పిన ట్లనిపించినా, చివరిలో అతనే దోషిగా నిర్ణయించటంలో సూర్య ప్రకాశరావుగారు బహు నేర్పును చూపించారు. చివరకు పశ్చాత్తాపంతో 'దోషి' తన శిక్షను తానే నిర్ణయించుకుంటాడు. రచయితకు నా ధన్యవాదాలు. జగం (అవనిగడ్డ).

1—3—61 తేదీ ఆంధ్రసచిత్ర వారపత్రికలో కుమారి కల్యాణిగారు వ్రాసిన మల్లెపందిర కథ చదివినాను. ఆ కథ చదువుచున్నంతసేపు నా బాల్యంలో జరిగినసంగతులు జ్ఞప్తికి తెప్పించిన కళ్యాణిగారికి నా హృదయపూర్వకఅభివందనములు అర్పించుచున్నాను.

పి. ఎస్. రావు (ఏలూరు)

* * *

1—3—61 తేదీపత్రికలో "వసంత"కథ చాలా బాగుంది. ఈ కథలో సుందర్రావుకు, రఘునాథరావుకు జరిగిన సంభాషణ భలే నవ్వు పుట్టిస్తుంది. ఈ కథ రాసిన "శ్రీ మృదంగ" గారికి నా నమస్కృతులు.

తాళ్ల రామకృష్ణారెడ్డి (ఆకివీడు)

* * *

22—2—61తేదీ వారపత్రికలో వాకాటిపాండు రంగారావుగారి 'స్వాప్తనదీనం' కథలో వసుంధర హారతి పళ్లెంలో బేడకాసు వేసింది. అర్ధరూపాయి పడవేసి ఆ బేడకాసే తీసుకున్నాడు విష్ణుకుమార్. ఇంకా బేడకాసులు చెల్లుతున్నాయా ?

బొమ్మిసెట్టి లక్ష్మణస్వామి (భట్టిప్రోలు)

* * *

నా కథ "అంతేనా ?" పై విమర్శ చదివాను.

పూజ్యులయిన నా మాతామహుని అల్లుడూ నాకు తండ్రి అయిన జానకిరామయ్యగారి అక్కగారు, నా మాతామహుని బావమరిది అయిన తుర్లపాటి పద్మనాభరావుగారి ధర్మపత్ని ఆ పద్మనాభరావుగారి ఏకైక సోదరి నాకు మాతామహి.

వరసలు వూహించుకోండి.

నా మాతామహుని తండ్రిగారయిన కీ. శే. చిన్నకోటలక్ష్మీ నరసింహం పంతులుగారు, నా పితామహుడయిన వెలగలేటి రామకృష్ణయ్య పంతులుగారు వైదికాచారాలకు కాణాచి అనిపించుకొన్న కృష్ణా జిల్లాలోని అతిప్రాచీన ఆరువేల నియోగి కుటుంబానికి చెందినవారు. సంప్రదాయాలను తు. చ. తప్పకుండా అనుసరించినవారు.

అతిపూర్వమే సంబంధాలు లేని యింటితో సంబంధాలు చేసుకొనేటప్పుడు తెలుగునాట పెద్దలు తమ పూర్వబాంధవ్యాలను అంతగా పట్టించుకోరని తెలుసుకో గోరుతున్నాను.

నా కథను అంత శ్రద్ధగా చదివిన పాఠకులకు నా అభినందనలు. హావిస్ (విజయవాడ—1.) ★

ఆంధ్రసచిత్ర వారపత్రిక

★

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితము
1908

★

సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

★

సంపుటము 55
సంచిక 27

15-3-61
బుధవారం

శార్వరి ఫాల్గుణ బహుళ చతుర్దశి

★

విడిప్రతి వెల 25 న. పై.
సంవత్సర చందా 13-0-0

★

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టివీధి,
మదరాసు-1.

విషయానుక్రమణిక

ముఖచిత్రం:
'జలజ సుందరి'
చిత్రకారుడు:—కేతిసీడి భాస్కరరావు (విజయనగరం)

వచ్చే సంచికలో...

తెలుగు వెలుగులు శీర్షిక ముగింపు వ్యాసం—

సరికొత్త పోటీ ప్రకటన!!

కథకాని కథ

కథకాని కథల పోటీకి రచనలు పంపేవారు కొంతమంది తమ రచనలు కేవలం చిన్న చీటీముక్కలమీద వ్రాసి పంక్తిలో పంక్తిని ఇరికిస్తున్నారు. ఇలాంటివి పరిశీలించటం కష్టం కాబట్టి, రచనలు పంపేవారు రచనకుతగ్గసైజు కాగితంమీద పంక్తికీ పంక్తికీ మధ్య బాగా ఖాళీవదలుతూ వ్రాయాలని కోరుతున్నాము. కాగితాలకు ఒక వైపునే వ్రాయడం కూడా అవసరం.

—సంపాదకుడు

బడ్జెట్ ప్రతిపాదనలు; ప్రజలు





తెలుగు వెలుగులు 75

హైదరాబాద్ రాష్ట్రంలో ఖద్దరంటేనే అధికారులకు నిద్దురపట్టని కాలమది. ఆయన పాతికేళ్ల ప్రాయంలోనే బొంబాయి విశ్వవిద్యాలయంలో న్యాయవాది పట్టా (ఎల్. ఎల్. బి.) పుచ్చుకుని, హైదరాబాద్ నగరంలో వకాలత్ ప్రారంభించబోయారు. రెసిడెన్సీకోర్టువారికి ఆయన ఖద్దరు దుస్తులు బద్ధశత్రువులయ్యాయి. 'నీకు కోర్టులో అడుగు పెట్టడానికి అనుమతి లేదు' అన్నారు. ఏడాదిన్నర తర్వాత గాని ఆ ఆంక్ష తొలగలేదు.

పది సంవత్సరాలు గడిచాయి. మహామేధావిగా, న్యాయశాస్త్ర నిష్ణాతుడుగా, ప్రతివాది భయంకరుడుగా, ప్రజాహితంకరుడుగా, జాతీయవాదిగా, బహుభాషావేదిగా, రాష్ట్ర మంతటా ఆయన కీర్తి చంద్రికలు విస్తరించాయి. ఇలాటి వాడిని ఉపేక్షించరాదు; ఉపేక్ష చూపించి లొంగదీసుకోడం అసాధ్యం అని నిజాం ప్రభుత్వం, పాచిక వేసింది — కార్యనిర్వాహకవర్గ సభ్యత్వం (మంత్రిత్వము) ఎర చూపింది. కాని పాచిక పారలేదు. "నాకెందుకు మీ కొలువు? ప్రజలను మరింత నిలువు దోపిడీ చేయడానికా?" అన్నారు ఆయన. ప్రభుత్వం విస్తుపోయింది. దగావద్దానని నిఘావేసి పట్టింది.

మరి పదిసంవత్సరాలు గడిచాయి. రాష్ట్రంలో రాజకీయోద్యమం పరోక్షంగా వేయి రూపాలలో వ్యాపించింది. ఆయన పెక్కుసార్లు అరెస్టయ్యారు. శ్రీ శంకరరావ్‌దేవ్ అధ్యక్షతన రాజకీయ మహాసభ నడిపించారు. దానితో ఆయన గుండెలుతీసినబంటని స్థిరమయింది. ప్రజల హృదయాలు పొంగాయి.

సర్ మీర్జా ఇస్మాయిల్ ముఖ్యమంత్రిగా వచ్చినప్పుడు ఆయన ప్రతిభను వెంటనే పసిగట్టారు. న్యాయమూర్తి పదవినో, న్యాయశాఖామాత్యత్వాన్నో స్వీకరించమని అభ్యర్థించారు. "నేను కాంగ్రెసువాణ్ని. కాంగ్రెస్ పెద్దల హుకుమయితే, అన్నిటికీ తయ్యార్!" అని సమాధాన మిచ్చారు ఆయన. మనస్వి అయిన మీర్జా మనసులోనే మెచ్చుకొన్నారు.

భారతదేశం స్వతంత్రమైంది. దేశం నాలుగంచులా విజయఘోషలు వినిపిస్తుండగా హైదరాబాద్ రాష్ట్రంలో "ఆజాద్ హైదరాబాద్" అన్న శ్రుతితో కొందరు దేశద్రోహులు దురంతాలు ప్రారంభించారు. మహామహా నాయకమ్మన్యులే, వారి వారి రాష్ట్రాలకు పదివేల సాకులతో పరారీ చిత్తగించారు. ఆయన మాత్రం వెక్కువెదరని మొక్కవోనితనంలో ప్రజలకు పెట్టని కోట అయి, గుండె దిటవు కల్పించారు. "పెట్టినవాడు గట్టివాడు" అని కోట్లనోళ్ల కొనియాడబడినారు. కనుకనే, ఆయన స్టేట్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ రామచంద్రతీర్థతో కేదింది పోటీ కాంగ్రెస్ పెట్టించి నడిపినా, ప్రజలు ఆయనను ఈసడించుకోలేదు సరికదా, తమ ప్రథమ ముఖ్యమంత్రిగా ఎన్నుకొన్నారు.

ఆయనే శ్రీ బూర్గుల రామకృష్ణ రావుగారు. ఆయన ఆంధ్ర రాజకీయ కురువృద్ధులలో ఒకరు. ధౌరంధర్యంలో యుగంధరుని, ప్రాజ్ఞతలో అప్పయ మంత్రిని, చతురతలో తిమ్మరుసును తలపిస్తారు. పరిపాలనదక్షతలో తానాయన వంటివారికి దీటవుతారు.

ఆయన భాషాపాండిత్యం మన దేశ రాజనీతిజ్ఞులలో అరుదంటే అతిశయోక్తి కాదు. హైదరాబాద్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు శాసనసభలో ఎవరు ఏ భాషలో ప్రశ్నిస్తే, ఆ భాషలో సమాధానం చెబుతూ "ఇంతింతై వటు డింతయై" లాగ చూస్తూ, చూస్తూ ఉండగానే, త్రివిక్రము లయ్యేవారు. ఆయనది కీచుగొంతు కయినా, వాగ్ధాటి, అంత ఆకర్షణీయం కాకపోయినా తొణకని, బెణకని గాంభీర్యం, హేతుబద్ధమైన విషయోపన్యాసం ప్రత్యర్థులను నిరాస్త్రం చేసేవి.

ప్రజలతో, ప్రజల పోరాటాలతో ఇంత సన్నిహితత్వం ఉన్నా, ఆయన ఎప్పుడూ అతివాది కారు, మితవాదే. ఈ మితవాదిత్వమే ఆయనకు సర్వాదయుక్తత్వమైన సరసతను సంతరించింది. ఆ సరసత నిర్మల దృష్టిని కలిగించింది. ఏ రంగానికి ఆ రంగం వింగడించుకుని రాజకీయ రంగంలో ప్రత్యర్థులైనా సాహిత్యరంగంలో చేసిన కృషిని నిష్పక్షపాతతతో తూచి చెప్పే ఔదార్యం అలవడింది.

ఆయన "దున్నరా మా యన్న దున్నరా బాబూ! దున్నపోతులు గట్టి దున్నరా బాబూ!" అని కర్షకకోటి ప్రబోధగేయాలు పాడి, ఆంధ్ర సరస్వతికి 'సారస్వత ముక్తావళి' సమర్పించి, 'పంచామృతం' నివేదించారు.

పెక్కేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న గౌరవమూ ఆయనకే దక్కింది. "కథకళి కవి మరాళ, కమ్యూనిస్టు ప్రభు కేరళ" లయి, ఉత్తరప్రదేశ్‌కు పెత్తందా రయారు.

కాని, పెక్కు భాషలు పుక్కిట బట్టిన బూర్గులవారు, తా మొకప్పుడు ఉద్యమించిన ఉర్దూ, ఫారసీ, అరబ్బీ సారస్వత చరిత్రలను పూర్తిచేసి, ఆంధ్రావళికి అర్పించవలసి ఉంది. షష్ట్యబ్దాల అనుభవం పండి, వివేకం పండారిన తమ జీవితంలో ముందు తరాల వారికి పలు రంగాలలో వెలుగు బాటలు తీర్చవలసి ఉంది.



అనుకోకుండా నిన్న మా రామాన్ని కలుసుకున్నాను. చీఫ్ కోర్టులో కేసు వచ్చేస్తుందని జూనియర్ కృష్ణ మూర్తి వచ్చి చెబితే పరిగెత్తుతూ రామాన్ని చూసి ఆగిపోయేను. రామం నాతోటి మాట్లాడతాడో లేదో అనిపించినా ''ఏం రామం ఎప్పుడొచ్చావు'' అన్నాను. రామం నన్ను చూసి చిన్నగానవ్వి ''అబ్బే యివాళే, క్లయింట్లతో వచ్చేను. క్రిమినల్ అప్పీలులే'' అని వెనక హడావడి పడుతున్న కృష్ణ మూర్తిని చూసి ''బెంచి కేసు వుందల్లేవుంది. పోయిరా తరువాత చూస్తాను'' అన్నాడు, ''ఫర్వా లేదులే నిన్ను చూసి చాలా రోజు లయింది, పద పోయి కాఫీ తాగుదాం—కృష్ణమూర్తీ నీవు పోయి నాకు వంట్లో బాగా లేదని చెప్పి వాయిదా తీసుకో'' అని చెప్పి రామంతో యింటికొచ్చాను.

రామం కనబడితేఎన్నో మాట్లాడాలని అనుకొన్నాను. కాని నా బాధ, అణువు అణువునూదహిస్తున్న నా వేదన ఎలాచెప్పను. విశాల ఎక్కడుంది? అని అడుగుదామనుకున్నాను. కాని ఎలా అడగను. ఏ ముఖంతో?

రామం వెళుతానని లేచాడు. ''పద విడిచిపెట్టి వస్తాను'' అన్నాను కారు తాళాలు బయటికి తీస్తూ. ''కారెందుకులే అయినా ఆ వీధుల్లో నీ కారు పడుతుందో లేదో'' మాటల్లో వెటకారానికి మనస్సు చివుక్కుమంది. ''పోనీలే పద నడిచేవెళదాము'' అన్నాను. ఏవి మాట్లాడాలని అనుకున్నానో అవి తప్ప మిగిలినవన్నీ మాట్లాడుతూరామం దిగిన యిల్లు చేరాము. మేడమీద ఎవరోస్నేహితుడి రూములో వుంటున్నానుఅన్నాడు. రామాన్ని మర్నాడు తప్పకుండా రమ్మనిచెప్పి వెను తిరిగాను.

ఎవరో పాప పరికిణీ తొక్కాడుతూ, కాకర పువ్వొత్తులు కాలుస్తున్నది. చూడగానేమా చిట్టి జ్ఞాపకానికొచ్చింది. బ్రతికివుంటే మా చిట్టి యిలా వుండేదా? చూస్తూ నిలుచుండిపోయాను. నా మనసులో బాధ నా ముఖం[illegible]బింబించిందో

"ఎందుకలాఉన్నావు. రేపు దీపావళికి నీకు టపాకాయలు, కొత్తగుడ్డలు ఎవరూ కొనలేదా?" అన్నది పాప. లేదన్నట్లుగా తల ఊపా డతడు. గిరున లోపలికి వెళ్ళి, ఏదో పొట్లం తెచ్చి "ఇంద ఇప్పుడు నవ్వుతూవుండు" అని అతని చేతిలో పెట్టింది పాప. నీళ్లుతిరిగినకళ్ళతో చిరునవ్వునవ్వి అ త డు ఇంటికెళ్ళి పోయాడు.

ఏమో పాప ఆట మానేసి నా వైపు చూస్తూ నిలుచుంది. దగ్గరగా వెళ్లాను. "ఎందుకలా వున్నావు. రేపు దీపావళికి నీకు టపాకాయలు, కొత్త గుడ్డలు ఎవ్వరూ కొనలేదా? అంది." తలూపాను. లోపలకెళ్లి ఏదో పొట్లంతెచ్చి "యింద. యిప్పుడు నవ్వుతూ వుండు" అని నా చేతిలో పెట్టింది. నీళ్ళు తిరిగిన కళ్లతో చిరునవ్వు నవ్వి వేగంగా యింటి కొచ్చేసేను.


ఆఫీసు రూములో జూనియర్లు పని చూసు కుంటున్నారు. రేపు దీపావళి. కోర్టు లేదు కదా? ఇంటికి వెళ్లమన్నాను. నా వైపు ఆశ్చర్యంగా చూసి వెళ్లిపోయారు. కృష్ణమూర్తి మాత్రం "ఏమిసార్ రేపు రాజమండ్రి సెకండప్పీలు వస్తుంది చద వరా" అన్నాడు. చదవనన్నాను. అతనూ వెళ్లి పోయాడు.

మేడమీది గదిలోకి వెళ్లి కూర్చున్నాను. దూరంగా వెలుగుతున్న మతాబాల వెలుగునీడలు నా గదిలో దోబూచులాడుతున్నాయి. నాజీవితంలో నీడలుపోయి వెలుగంటూ మళ్లీ వస్తుందా? ఏమో ....

పాప! యిచ్చిన కానుక నా చేతిలో అల్లానే వుంది. పిచ్చిపాప. తలచుకొంటే నగంవూరు కొనివ్వగలను. అసలు పాప యిచ్చినదేమిటి? పొట్లం విప్పబుద్ధి కాలేదు. విప్పి దాని విలువ పోగొట్టుకోదలచలేదు. పెద్ద లాయరుగాకాక, నాకు, నాకై యిచ్చిన కానుక, యెవ్వరైనా యిచ్చి ఎన్నేళ్లయింది. పాప కానుక ఖరీదైన బుద్ధభగవానుని విగ్రహం టేబిల్ పైనించి తీసేసి అక్కడ పెట్టాను.

నాయరొచ్చి దీపం వెలిగించి భోజనానికి రమ్మ న్నాడు. వద్దన్నాను. రామంరాక నలువుతున్న కురువు మీద కారం జల్లినట్లయింది. మనస్సు వద్దన్నా వెనక్కి పరిగెత్తుతూంది.

కాలేజీలో లా చదువు తున్నప్పుడు నేను, రామం వో గదిలో వుండేవాళ్లం. వో రోజు రామం "స్టేషనుకు పదరా మా చెల్లాయి వస్తుంది. క్వీన్ మేరీస్‌లో సీటు వచ్చిందట" అన్నాడు. అదీ నేను విశాలను మొదటిసారి చూడటం. ఆ తరువాత రామంతో కలిసి యించుమించు రోజూ చూస్తుండే వాడిని. ఆ రోజుల్లో విశాల ఎంత అందంగా వుండేది. ఆ కళ్లల్లో ఎంత వెలుగు. ఎప్పుడూ నవ్వుతూ, అల్లరి చేస్తూ చాలా చలాకీగావుండేది. రామం వో రోజు "ఏరా మా విశ్శిని చేసుకుంటావా? దాని కిష్ట మేట" అంటే ఆశ్చర్యపోయేను. విశాలకు నే తగుదునా అని. ఏ కోటీశ్వరుడో, నవ మన్మధుడో విశాలకు తగిన మొగుడని నా విశ్వాసం. పువ్వుల



తివాచీమీద నడవాల్సిన విశాల నన్ను చేసుకుంటా నంటే కాదనే బుద్ధిహీనుడ్ని మాత్రం కాను. సరే అన్నాను.

మైలాపూర్‌లో వో యిరుకు సందులో లాయ రుగా బోర్డు తగిలించటం విశాలతో కాపురం పెట్టడం ఒకేసారి జరిగింది. ఆ రోజులు ఎంత మధురమయినవి. వెన్నెల రాత్రిళ్ళ, సముద్రపు ఒడ్డున, అలలమీద వెన్నెలకట్టినవంతెనచూస్తూ, పిచ్చిమాటలు మాట్లాడుతూ, చెట్టా పట్టా లేసుకుని యిసుకలో నడిచిపోయేవాళ్లం. కోర్టు నుంచి వచ్చేటప్పుడు అణా మల్లె పువ్వులు తెస్తే యెంత సంబరపడేది విశాల. మొట్టమొదట ఫీజు వచ్చినరోజు వో పర్వదినం. రోజులు సెలయేటి అలలులా గడిచిపోయేవి. నాన్న డబ్బు పంపించటం ఆపివేసి నీ కాళ్లమీద నీవు నిలబడు అని వ్రాస్తే నేను కుంగిపోతే విశాల ఎంత వోదార్చింది. పని లేదని బాధ పడితే విశాలచిరునవ్వులు బాధను మాయం చేసేవి. మా పెళ్లయి సంవత్సరమయిన రోజున, నేను ఆకుపచ్చ జరీ బోర్డరు చీర తెచ్చి యిస్తే విశాల ఆనందం ఏమని చెప్పను. నాన్న డబ్బు పంపించక, ప్రాక్టీసు సరిగ్గాలేక డబ్బుకు చాల యిబ్బంది పడేవాళ్లం. కాని విశాల ఎప్పుడూ సంతోషంగా వుండేది. నవ్వుతూ పాడుతూ చలా కీగా తిరిగేది. బియ్యం లేకపోతే రొట్టెలు, అవీ లేకపోతే బీచిలో వేరుసెనగ కాయలు తిని నీళ్ళు తాగి ఏవో పిండి వంటలు తిన్నట్లు సంతోషించే వాళ్లము. అణా, బేడా కూడబెట్టి సినిమాకివెళ్లి రాత్రంతా సినిమా ఘట్టాలే మాట్లాడుతూ నిద్రపోయే వాళ్లం. సినిమాలో ఏడుపు ఘట్టాలువస్తే మా విశాల చేతి గుడ్డ తడిసిపోయేది. నేను ఎగతాళి చేస్తే బుంగమూతి పెట్టేది. లైబ్రరీనుంచి పుస్తకాలు తెచ్చుకొని యిద్దరం చదివి వాటిని గురించి రోజులతరబడి వాదించుకొనే వాళ్లం. జేబులో దమ్మిడీ లేకపోతే బీచికిపోయి తిరిగే వాళ్లం. విశాల అనేది కదా "మెడ్రాసులో దమ్మిడీ లేక పోయినా ఎంటర్‌టెయిన్‌మెంట్ కావాలంటే బీచికి వెళ్లితే సరి" అని.

కాని రాను రాను నా పని ఎక్కువయింది. ప్రాక్టీసు రావడం మొదలెట్టింది. విశాలకు నేను యిచ్చే బహుమతులు పెద్దవయినవి. కాని వాటిలో ప్రేమ కరువయింది. మా యిద్దరి మధ్యా దాటలేని అగాధం ఏర్పడింది. రాత్రింబగళ్ళు ఫస్టప్పీలు, సెకండప్పీళ్లతో సతమతమవుతూ, విశాలకు దూరంగా జరిగాను. సినిమాకి పోదామని విశాలన్న రోజు ఎవరో క్లయింట్లు వచ్చేవారు. వారితోపడి విశాల మాట మరిచిపోయేవాడిని. బీచి షికార్లు, వెన్నెలరాత్రుల విహారాలు మాకు కరువయినవి. కాని హోదా పెరిగింది. పెద్ద పెద్దవాళ్ళ నాకోసం వస్తున్నారు. రెండు చేతులా సంపాదిస్తున్నాను. అప్పుడే మా చిట్టి పుట్టింది. మేము పెద్ద యింట్లోకి మారాము. కారు కొన్నాను. కాని నేను చిట్టిని సరిగ్గా చూడలేకపోయాను. విశాలకు చిట్టి లోక మయింది. నాకు కోర్టు లోకమయింది. చిట్టిబోసి నవ్వులకు, తప్పటడుగులకు నేను నోచుకోలేదు. నా కళ్లకు ఫీజు లెంతమైకము కమ్మేసినాయంటే నేను విశాల మొఖంమీద విచార చిహ్నలయినా గుర్తించలేదు.

మా చిట్టికి ఉన్నట్లుండి జ్వరం వచ్చింది. డాక్టరును పిలిచి చూపించమని విశాల చెబితే పిలుచుకు రమ్మని క్లర్కుకు చెప్పి నేను కోర్టుకు వెళ్లాను. ఎక్కువగా ఉంది జాగ్రత్త అని చెప్పా డుట, డాక్టరు. విశాల చిట్టికి యెక్కువగావుంది మర్నాడు కోర్టుకి వెళ్లవద్దన్నది. కాని మర్నాడు కోర్టుకి వెళ్లాను. ముఖ్యమయిన కేసు. కాని అంతకన్న ముఖ్యము మా చిట్టిఅని నాకు అప్పటికి తెలియదు. మా చిట్టి నేను కోర్టులో వున్నప్పుడు పోయింది. విశాలను ఎలా చూడను. ఎలా వోదార్చను. దొంగలా వచ్చాను యింటికి. విశాల ఏమీ అనలేదు. స్తబ్ధ రాలిలా నుంచుంది. మళ్లీ నా పనిలో నేను మునిగి పోయేను. నెల రోజులు పోనిచ్చి రవ్వల నెక్లెస్ కొని విశాలకిచ్చాను. తీసుకుని క్రింద పె[illegible]ంది. విశాల కళ్లల్లో నీళ్లు తిరగడం కనిపించింది. లోపల కెళ్లిపోయింది. నేను ఏమి చేశానో నాకు బోధపడ లేదు మొదట్లో. మరునాడు విశాల యింట్లోలేదు. జాబు మాత్రం వుంది. "మీకు డబ్బు, పని, హోదా వీటికంటె కొన్ని ముఖ్యమయినవి వున్నవని తెలిసిన రోజున వస్తాను." తనే తిరిగి వచ్చేస్తుం దని మొదట ఉపేక్ష చేసేను. ఇన్నేళ్ళ కాపురం చేసినా మా విశాలసంగతి నాకు తెలియలేదు. తరువాత తెగ వెదికాను. రామం దగ్గరకు వెళ్లాను. తిట్టాడు. కాని ఎక్కడుందో చెప్పలేదు. ఇంటికి తిరిగివస్తే యిల్లు బావురుమనివుంది. చిట్టి ఫొటో చూస్తే గుండెలు తీగలు సాచి లాగివదిలిన ట్లయింది. రోజురోజుకు విశాల నాకు ఎంత ముఖ్యమో బోధపడంది. నా కళ్లకు కట్టిన పొరలు విడిపోయినవి. విశాల నన్ను ఎప్పటికైనా క్షమిస్తుందా! నా అహంకారంతో విశాల అమా యకహృదయాన్ని ఎంతగా గాయపరిచానో. గుండెల్లో కుంపటి. జీవితం మోడువారిపోయినట్ల యింది. పనిలో యిదివరకు వుత్సాహములేదు. కాని అలా కొయ్యబొమ్మలా పని చేసుకుపోతున్నాను. ఎన్నో విధాల విశాలను మరచిపోదామనుకొన్నాను. కాని విశాలవెళ్ళిపోయేముందు పెట్టిన దైన్య మొగం నన్ను వెన్నంటి విశ్రాంతి లేకుండా చేస్తూంది. నేను విశాల కిచ్చిన బహుమతులనయినా విశాల

తీసుకుపోలేదు, ఒక్క ఆకు పచ్చ చీర తప్ప. ఎక్కడుంది విశాల ? ఏమి చేస్తున్నది. నేను అన్నము తక్కువతింటే కొట్టుకపోయే విశాల, జ్వరం వస్తే రోజుల తరబడి నిద్రాహారాలు లేకుండా నా ప్రక్కన కూర్చొని గంటల వారీగా మందులిస్తూ, వేయి దేముళ్లకు మ్రొక్కుకొనే విశాల నన్ను విడిచి ఎలా వుండగలిగింది. నా ప్రేమ డబ్బు తెరల క్రింద, హోదా పరదాల క్రింద అణగారిపోతూవుంటే, వెలికితెచ్చి, వెలిగించి వెళ్లిపోయిందా విశాల?

రామాన్ని నేను ఎందు కడగలేకపోయాను విశాల ఎక్కడుందని. రామం దగ్గరకువెళ్లి అడుగుదామనుకున్నానే? అలాటిది రామమే నా దగ్గరకు వచ్చినప్పుడు ఎందుకడగలేదు. నా అహం అడ్డు వచ్చిందా? అయినా యింకెక్కడిది అహం. పోనీ రేపు వచ్చినప్పుడు అడుగుదామనుకొన్నాను. కాని అడుగగలనా? ఏమో?

కళ్లంబడి నీళ్లు కారుతూంటే అలా కూర్చుండిపోయేను. నాయరొచ్చి నా స్థితిచూసి ఆగిపోయేడు. "ఏం నాయర్" అన్నాను. "భోంచేయలేదని కాఫీ కలిపినాను. త్రాగండి బాబూ పన్నెండయింది పండుకొండి" అని ఆర్డరు జారీచేసి వెళ్లిపోయేడు. పిచ్చినాయర్. నేనంటె ఎంత అపేక్ష? కాని నేను పిచ్చివాణ్ణని, మాణిక్యాన్ని చేతులారా జారవిడుచుకొనే మూర్ఖుడనని నాయర్‌కు తెలుసు. విశాలతోటి, యింటి వెలుగు పోయిందని నాయర్ ఉద్దేశం. తలూపి నాయర్‌ని పంపేశాను.

రామం ప్రొద్దున్నేవచ్చేడు. "ఇవాళ సాయంత్రం వూరికి పోతున్నాను. చెప్పి పోదామని వచ్చాను" అన్నాడు. డ్రాయింగ్‌రూము వదిలి మేడమీది గదిలోకి తీసుకొచ్చి కూర్చోపెట్టేను విశాలగురించి అడుగుదామని. కాని నా కంఠం రుద్ధమయింది. కళ్లల్లో నయగారా నిలిచింది. మాట్లాడకుండా కూర్చున్నాను. రామమే ఏదో మాట్లాడాడు. మా క్లాస్‌మేట్స్ ఎక్కడున్నారో చెప్పాడు. "నీ ప్రాక్టీసు ఎట్లా వుంది" అన్నాను. "ఏదోలే" అన్నాడు. నా టేబుల్‌మీద పాప పొట్టంచూసి ఏదో అడగబోయి మానేసేడు. పోతానని లేచాడు రామం. మౌనంగా విడిచిపెట్టవద్దామని లేచాను. "నీవు వుండులే, నేను వేరే పనిమీద వెళుతున్నాను" అని వెళ్లిపోయేడు.

నాయరొచ్చి "బాబూ దీపావళి తలంటు పోసుకోరా" అన్నాడు. విశాల వున్నట్లయితే దీపావళికి తలంటుపోసుకోకుండా వుంచేదికాదు. అది నాయర్‌కు తెలుసు. ఇవాళ ఆ అలవాటు మానడం యిష్టంలేక తలంటు పోసుకొచ్చి కూర్చున్నాను. దీపావళి అంటే పూర్వ జ్ఞాపకాలువచ్చి మళ్లీ మనస్సు బాధపడింది. మొట్టమొదటి దీపావళినాడు దీపావళి కాంతిలో వెలుగుతున్న మా విశాల ముఖం నా కళ్ల ముందు నిలిచింది. చంటిపాపలా ఎగురుతూ, కాకర పువ్వొత్తులు కాలుస్తూంటే, మా విశాల మొఖంమీద వెలుగు నీడలు దోబూచులాడుతుంటే, దేదీప్యమానంగా వెలుగుతున్న విశాలను చూస్తూ, అలా ఎన్ని గంటలు కూర్చుండి పోలేదు. మళ్లీ అలాటి దీపావళి వస్తుందా! లేక జ్ఞాపకాలు మాత్రం మిగులుతాయా?...నా ఆలోచనలను పాడు చేస్తూ నాయరొచ్చాడు.

"బాబూ ఎవరోపిల్లవాడు మీకు జాబు తెచ్చాడు. రామంబాబు పంపించారంట" రామం యిప్పుడేగదా వెళ్లింది. మళ్లీ జాబు ఏమిటి చెప్మా అనుకొంటూ జాబు విప్పాను.

"బావా" ఆశ్చర్య పోయేను. రామం నన్ను ఎప్పుడూ యిలా సంబోధించలేదు. మళ్లీ వెటకారమా అనిపించింది.కాని రామం వ్రాసిన జాబు యిది. "బావా నిన్న కోర్టులో నీవు నన్ను చూసినప్పుడ నీకు ముఖ్యమయిన కేసుందని నాకు తెలుసు. ఆ కేసు నీకు యెంత ముఖ్యమో కూడా నాకు తెలియక పోలేదు. అందువల్ల నీవు నా వెంట వచ్చేస్తే నేను ఆశ్చర్యపోయేను. ఇదివరకు మధువేనా అని పించింది. చిట్టి సంగతి జ్ఞాపకంచేసి నిన్ను కలత పరచదలచలేదు. కాని అప్పటి నీ ప్రవర్తనకు యిప్పటికీ ఎంత భేదం. నీవు యిప్పటికైనా మనుష్యుల విలువలు తెలుసుకొన్నందుకు చాలా సంతోషమేసింది. నిన్న నన్ను విడిచిపెట్టి వచ్చేటప్పుడు పాపతో నీవు మాట్లాడడం నేను మేడమీద గదిలోనుంచి చూసేను. ఆ పాప యిచ్చిన పొట్లం నీవు గుండెల కదుముకొని పోవడమూచూసేను. పాపకు నీవు గొప్పవాడివి,హోదా గల వాడివి అని తెలియదు. నీవు బాధపడుతున్నావని, నీకు సంతోషం కలిగించాలని ఆ అమాయక హృదయానికి తట్టినట్లుంది. నీవు కావాలంటే ఆ పాపకు ఏమయినా కొనివ్వ గలవు. కాని నిజంగా ఆ పాప బహుమానం విలువ తిరిగి యివ్వగలవా? ఇది నీకు బోధ పడిందనటానికి నిదర్శనం యివ్వాళ నీ గదిలో చూసేను. నీలో పూర్తిగా మార్పు వచ్చిందని తెలిసింది. విశాల ఈ రోజుకోసరం యెన్ని రోజులనుంచో ఎదురు చూస్తున్నది. ఇవ్వాళ నేను ఎక్స్‌ప్రెస్‌కి వెళుతున్నాను. నీవు నా వెంట వస్తే విశాల దగ్గరకు తీసుకువెళ్తాను. విశాలను నీవు క్షమార్పణ అడగ నక్కరలేదు. నీవు వెళ్లి నిలుచుంటేచాలు విశాల నీ వెంబడి వచ్చేస్తుంది.

ఇట్లు,
రామం."

నా జీవితంలో చీకటి తొలగిపోయి వెలుగు వచ్చేసిందా? కళ్లంబడి నీళ్లు ధారలు కట్టేనయి. నాయరును పిలిచి ప్రయాణానికి పెట్టె సర్దమన్నాను. ★

ఒకానొక పండితుడు మరణ శయ్యామీద ఉండగా ఆతని బంధువులలో ఒకరు "మామా, చిరకాలం జీవించావు. అన్ని కోరికలూ తీరాయి, ఇప్పుడైనా సన్యాసాశ్రమం పుచ్చుకొనరాదా?" అని ప్రశ్నించాడు.

ఆ పండితుడు ఆసక్తితో లేచి ఇలా అన్నాడు: "తీసుకొనడానికి నాకు ఏలాంటి అభ్యంతరమూ లేదురా నాయనా.కాని పథ్యం ఏమిటి?"

తటవర్తి ప్రసాదరావు(హైద్రాబాద్)

హరివంశము

సాందీపని పర్వము—6

కృతశౌచులైన కుమారులు వారి వారి తల్లులకు దక్షిణ పార్శ్వంలో ఆసీనులైనారు. తండ్రి, తల్లి, కుమారుడు—ఈ వరుసలో పెండ్లిపీటల మీదఅంతా కూర్చున్నారు. వసుదేవుడు తన ఇద్దరు కుమారులకు ఈ ఉపనయం చేస్తున్నాడు. ఆయన బహు భార్యలు కలవాడు. ఇప్పుడు రోహిణి యందు తనకు కల్గిన కుమారునకు, దేవకియందు తనకు పుట్టిన పుత్రునకు ఉపనయనం జరుగుతున్నది. ఈ ఇద్దరు భార్యలను ఈ పీటలమీద ఎట్లా కూర్చోపెట్టాలి? కుమారులను ఎట్లా కూర్చోపెట్టాలి? తండ్రి ఒక్కడు. తల్లులు వేరు వేరు. కుమారులు ఇద్దరు. ధర్మశాస్త్రం ఏమి చెప్పుతున్నది? "కృతశౌచకుమారం పత్నీ దక్షిణత ఉపవేశ్యం" అంటున్నది. ఇక్కడ ఆచార్యుడైన తండ్రి, తన పత్నులతో వడక పెండ్లిపీటలమీద కూర్చుండి, ఆ పత్నులకు దక్షిణముగా కుమారులను కూర్చుండబెట్టవలయునుకదా? ఇక్కడ ధర్మసందేహము వచ్చినది. గర్గుడు బ్రహ్మస్థానములోవుండి, ఆ సందేహమును తీర్చినాడు. ముందు వసుదేవుని కూర్చుండనియమించి, ఆ తరువాత రోహిణిని, ఆ తరువాత దేవకిని కూర్చుండమని వారికి దక్షిణముగా బలరామ, శ్రీకృష్ణదేవులను కూర్చుండ నియమించినాడు. ఉపనయముహూర్తమునకు వచ్చిన పండితులు ఆయన ఆ తీర్పరి తనమును మెచ్చుకున్నారు. ఆ వెంటనే ఉపనయనాంగ తంత్రములు ప్రారంభమైనవి. "ఉపనయనాంగత్వేన ఆదే రక్షణార్థం రక్షా బంధనము" తదంగ షోడ షోపచార పూజాలను" గర్గుడు ప్రారంభము చేసినాడు. రక్షాబంధన దేవతలను ఆవాహనముచేసి, వారికి నమోవాకములు చెప్పించి, ఆ దేవతలకు ధ్యానావాహనాది షోడశోపచార పూజలు చేయించి "విశ్వేత్తాత ఇతి" విధివత్ ఈ రక్షా బంధనం జరిపించినాడు. రక్షాబంధన కాలంలో సుర్యాది నవగ్రహ అనుకూల్య ఫలసిద్ధి కొరకు కొన్ని తంత్రములు నడిపించినాడు. ఇట్లా యదు కుమారుల ఉపనయనాంగ తంత్రములు ప్రారంభమైనవి.

వసుదేవునకు ఇది అంతా ఏదో యజ్ఞం చేస్తున్నట్లు వుంది. తాను ఆచార్యుడు, తన బిడ్డలు తన శిష్యులు. తాను వారికి ఇప్పుడు బ్రహ్మోపదేశమును గాయిత్రమంత్రోపదేశమునుచేస్తాడు. వేదవాత తన్ను అనుగ్రహిస్తున్నది. ఆయన ఒక్కసారి తలఎత్తి సదస్సు వంక చూచాడు. సర్వ ఋషులు సదస్సులోవున్నారు. వారిలో కొందరిని తాను ఆహ్వానించినాడు. కొందరిని పని తొందరలో మరిచి పోయినాడు. బాదరాయణులను పిలుచుకునిరాగా వసుదేవుడు అంధకుని పంపినాడు. వారు ఇంకను రాలేదు. వసుదేవునకు ఏమో అనిపించినది. అంధకుడు పారాశర్యుని తెచ్చునా? తనకు నమ్మకమున్నది. రామకృష్ణుల ఉపనయనమేమి? పారాశర్యులు రాకపోవుటయేమి? ఉపనయనాంగ తంత్రములలో ఒక విశేషమున్నది. ఇచ్చట తంత్రములన్నిటిని తండ్రి, తాను ఆచార్యుడై నడిపించవలసి వుంటుంది. వశిష్ఠ అయినవాడు బ్రహ్మమాత్రుడు. ఆయన నడిపింపుతంత్రము తక్కువ. వసుదేవుని ఈ అన్యథా మనస్కతను రోహిణి గుర్తించినది. ఆమెయు సదస్సును తిలకించినది. తరువాత భర్తనుచూచి

"స్వామి మీ మనసు నాకు తెలిసినది? వ్యాసభగవానులు ఇంకను రాలేదేమియని మీరు విచారించుచున్నారు. ప్రభువు ముహూర్తమువేళకు వచ్చును. అంధకుని పంపితిరిగదా? ఆయన భగవంతునితప్ప వెంటబెట్టుకుని వచ్చు—ఎక్కడిబదరీ వనము? ఎక్కడి మధుర. వారు రావద్దా? మరియు ప్రభువుకు ఒక్క పనియా? ఆయన బహుధా వ్యాపృతులు" అన్నది. గర్గుడును. దేవకియు రామకృష్ణులను, ఆమె మాటలువిని మందహాసముచేసినారు. గర్గుడు తొందర చేసినాడు. ముహూర్తము కావుటకుముందు బహు కార్యములు నడువవలసి వున్నవి. కర్మణః పుణ్యాహవాచనము జరుగవలసివున్నది. లౌకికాగ్ని ప్రతిష్ఠ జరుగవలసివున్నది. యజ్ఞోపవీతధారణము పూర్తికావలసియున్నది. తరువాత నాందీ సమరాధనము అచ్చట కొంత ఆలస్యము గూడా జరుగును. తర్వాత తిరిగి వపా సంస్కారము, వటువులచే వస్త్రధారణము, మేఖలాధారణము, కృష్ణాజినధారణము ఇన్ని వున్నవి. తరువాతగాని ముహూర్తముకాదు. ఇన్ని తంత్రములు యధావిధి నడువవలసి వుండుచో కాలహరణము ఎంతమాత్రము సరికాదు. గర్గుడు యధావిధిగా నంతయు జరుగవలయుననువాడు ఆయన తొందరపెట్టెను. "ఉపనయనాంగత్వేన కర్మణః పుణ్యాహవాచనము జరిపించెను. ఉపనయనాంగత్వేన లౌకికాగ్ని ప్రతిష్ఠాపనను జరిపించెను. ఇచ్చట మెచ్చటను వసుదేవుడు "మమ" అనుకొనవలసిన పనియేలేదు. సర్వశ్రౌత స్మార్త ములలో ఆయన విధి. అందువలన ఆయన స్వయంగా తన బిడ్డలకు "శ్రౌత స్మార్త నిత్యనైమిత్తిక కార్యకర్మానుష్ఠానఫలసిద్ధ్యర్థం, ఉపనయశ్రౌనాంగ భూత పరమ పవిత్ర యజ్ఞోపవీతధారణం" చేయించినాడు. తదంగ షోడ శోపచార పూజలను చేయించి, భార్యలుచేత పుత్రకులచేత చేయించి యజ్ఞోపవీత దేవతలకు ధ్యా నా వా హ నా ది షోడ శోపచార పూజలుచేసి, చేయించి, ధృవాద్యైరిత్యాది మంత్రములతో బ్రాహ్మణ స్పర్శచేత ఆ యజ్ఞోపవీతములు మరియు పవిత్రములగునట్లు చూచి కుమారుల చేత యజ్ఞోపవీతములు వేయుటకు పూనిక వహించినాడు. యజ్ఞోపవీత దారణ సమయమురాగా, ఆచార్యుడుగా తాను ముందు "ధృవాద్యౌ ధృవాపృథివీ" అన్న మంత్రమును ఉదాత్తనుదాత్త స్వరితయుక్తముగా నోట అని నాడు. గర్గుడు మొదలుగాగల బ్రాహ్మణవర్గము గూడా ఆయనతో అప్పుడు కంటములు కలిపి :

"ధృవాద్యౌ ధృవాపృథివీ। ధృవం విశ్వ మిదం జగత్ । ఇహై వైధిమా వ్యథిష్ఠాః। పర్వత ఇవా విచాలితః। ఇంద్రఇవేహధృవస్తిష్ఠ। ఇహరాష్ట్రముధారయ। అభితిష్ఠపృతన్యతః। అధరే నంతుశత్రవః।"

ఇంతవరకు మంత్రమును పఠించినారు. అంతలో వేఘ గంభీర నిర్ఘోషమును పోలిన కంటమొకదు ఆ మంత్ర పటనముతో కంఠమును కలిపినది. ఆ కంఠము ఎంత మధురము? ఎంత గంభీరము ? ఆ కంఠములో ఏమి ఆనందము తబకలాడుచున్నది? వేదము మూర్తిదాల్చి ఆకంటనాద మున మ్రోగుచున్నట్లు వున్నది. రోహిణి అన్నది: "స్వామి! ప్రభువు, భగ వంతులు, వ్యాసులు వచ్చినారు. వసుదేవుడు సమాధిగతుడు! ఆయనకు ఆ మా ౦ విన్పించినదో? వ్యాసభగవాముని కంఠమునుండి వచ్చుచున్నదివ్య నాద ము ౦ ఆయన మునిగిపోయెనో! వసుదేవుడు మరి ఉచ్చైః స్వరమున మంత్ర పఠనమును కావించెను. ఆ స్వరము రమ్యాతిరమ్యమై వ్యాసభగవానుని కంట స్వరమును పోలి ఉదాత్తమై, దివ్యమై, వేదమే దిగివచ్చి నాదరూపము మూర్తమై, అచ్చట వాయు తరంగ పరివ్యాప్తమై వెల్గిపోవుచున్నట్లుండెను.

"ఇంద్ర ఇవవృత్రహోతిష్ఠ। ఆపః క్షేత్రాణి సంజయన్। ఇంద్రయేణమదీ ధరత్। ధృవం ధృవేణ హవిష।తస్మైదేవా అధిబ్రవన్। అయశ్చ బ్రహ్మణ స్పతిః"

యదుకుమారులు ఎడమ భుజములమీదుగా కుడివైపునకు సవ్య ముగా యజ్ఞోపవీతములు ధరించినారు. సదస్సులోని బ్రాహ్మణులు, క్షత్రి యులు వారిపై అక్షతలు వేసినారు. భగవంతుడైన వ్యాసుడు అప్పుడువచ్చి సభలో ఆసీనుడైనాడు. సభ అంతయు ఆయనకు వినమిత శిరస్కమై నమస్క రించింది. బాదరాయణుడు ఆ సభను చూచుటయేలేదు. ఆయన దృష్టి యంతయు శ్రీ కృష్ణదేవునిపై లగ్నమైయున్నది. పంచశిఖలతో, పసుపు బట్టలను, లోపలకౌపీనముపైన గూడ కట్టుటలో విచిత్రమైన అలం కారముగా వున్నది ఆ మూర్తి. ఆ మూర్తిని ఆ వ్యాసుడు కన్నులతో త్రాగు చున్నట్లు చూచినాడు. అంతలో గర్గుడు "ఆచార్యవట్వోః ఆయుర్వర్చోయ శోవలాభివృద్ధ్యర్థం, నాంది శోభన దేవతా ముద్దిశ్య, నాందేశోభన ప్రీత్యర్థం యావచ్ఛక్తి బ్రాహ్మణ సమారాధనం" అంటూ ఆవలి కార్యక్రమాన్ని సూచించి నాడు. ముహూర్తము ముందు వున్నదని ఆయన తొందర.

నంది ముఖములో వ్యయమంతయు వటువుల మేనమామలదే. దేవకి సోదరులే ఆ వ్యయమును భరించినారు. షడ్రసోపేతముగ పాకములు చేయగా మహాసనాధిపతులను పురమాయించినారు. వారిది పేరుగాని, పెత్తనమంతయు రోహిణిది. ఆవిడ మెనుములు విసిరిన పిండితో గారెలు చేయించినది. అప్పడ ములు, వడియములు ముఖ్యమని చెప్పినది. నంది ముఖము వేళకు వంటలన్ని సిద్ధమైనవి. క్షత్రియ వటువులు స్నానములు ముగించుకొని, మడి బట్టలు కట్టుకొని, బంతులుతీర్చి కూర్చున్నారు. నూతన వటువులకు యదు కుమా రులకు ఆ బంతులలోనే విస్తళ్ళు వేసినారు. గర్గునితోపాటు, వ్యాసుడును నంది ముఖము సమారాధన జరుగుచున్న చోటికి వచ్చినాడు. అక్కడకు ఆయన చూపు నూత్న వటువులమీద, నూత్నవటువులలో శ్రీ కృష్ణునిమీద వడ్డనలు పూర్తిఅయినవి. గర్గుడు ముహూర్తము సమీపించుచున్నదని అందరిని తొందర చేసినాడు. వచ్చిన చుట్టములలో ముహూర్తము పూర్తియగుదాక ఆగలేనివారు గూడా అప్పుడే భోజనములకు కూర్చుండిరి. రోహిణి వడ్డన చేయుచు వారిని చూచి అన్నది : అప్పుడే వేళ అయినదా! నంది ముఖముకదా అని ఏవో వంట కములు చేయించినాము. కొంచెము ఆగిన బాగుండెదికదా! వారు ఆగలేదు. గర్గుడు ఎవ్వరిని ఆగనీయలేదు. వడ్డనలు పూర్తి కాగానే "స్వస్త్యయనం తార్క్ష్య మరిష్ట నేమిం" అంటూ వటువులచేత ప్రార్థన చేయించినాడు. అప్పుడు బాదరాయణుడు అందుకొని, "అనేననాం శోభన దేవతా బ్రాహ్మణ సమారాధనేన భగవాన్ సర్వాత్మకః శ్రీ మహావిష్ణు స్సుప్రీతో వరదోభవతు" అన్నాడు. శ్రీ కృష్ణదేవుని వంక చూచినాడు. చూచి ఆయన మందహాసము చేయుగా, తానును మందహాసము చేసినాడు.

"వసుదేవ! ఇక సంప్రోక్షణము చేయడమే ఆలస్యము."

వ్యాసుడు ఈ మాట అనగా వసుదేవుడు "భగవాన్! మీ ఆజ్ఞ" అంటు సంప్రోక్షణము చేసినాడు. శర్కరా విమిశ్రితమైన పయస్సును తెచ్చి రామ కృష్ణుల చేతులలో వడ్డించినాడు. ఉద్ధవుని తండ్రియు, సాత్యకి తండ్రియు అటులనే చేసినారు. వటువులకు అప్పుడు ఆపోశనములు వడ్డించినారు. భోజ నములు ఆరంభమైనవి. ఆరంభమైనదిమొదలు గర్గుని తొందరే తొందర. ఆయన రోహిణితో అన్నాడు : 'తల్లీ! పిల్లలు కడుపు నిండగా భోజనము చేయరాదు" అన్నాడు.

రోహిణి అన్నది : "అన్నియు బాగుగానే వున్నవి. వటువులకు అంగ వస్త్రములు పసుపులో తడిపి ఆరవేయించినాను. అవి ఇప్పించినారు కారు.

గర్గుడు తన తొందరను తాను నిందించుకున్నాడు.

బాదరాయణులు అన్నారు : కార్యములపట్ల ఇట్లు జరుగుట సహ జము. భోజనానంతరము వటువులను సంభావన చేయవచ్చును. ★

పారిజాత శివార్చన

మనము మన దేహస్థితి

నాలుక - నోరు

డా॥ గాలి బాలసుందరరావు

"ముఖం మనోభావాలను సూచించే సూచిక" అని, ఇంగ్లీషులో ఒక ప్రసిద్ధ వాక్యం ఉన్నది. సాధారణ మానవులలో ఈ అభిప్రాయం సరి అయినదే కూడా. కాని మహా గంభీరులయినవారు, తమ మనోభావములను తమలోనే ఉంచుకుని ముఖంలో కనపడకుండా చేయగలరు. నటనా నైపుణ్యం ఉన్నవారు, ఏ భావమునూ సరిగా ప్రదర్శించకపోగా, వ్యతిరేక భావములు కూడా ప్రదర్శింపగవచ్చును. కాని నాలుకకు అటువంటి శక్తి లేదు. కొన్ని పరిస్థితులలో నాలుక స్వరూపం స్వభావములు అంతో కొంతో మారిపోతవి. శరీర స్థితిని, నాలుకకంటే వివరంగా ఏ ఉపాంగమూ వెల్లడించదంటే అతిశయోక్తి లేదు. ఆరోగ్య స్థితిలో నాలుక స్వరూప స్వభావాలనూ, అనారోగ్య స్థితిలో దాని స్వరూప స్వభావాలలో కలిగే మార్పులనూ, ప్రతివారూ తెలుసుకోడం అవసరమూ, సాధ్యమూ కూడా. కంటిలో పసుపుదనం చూచి, కామెర్లు వచ్చినవని అనుమానించినట్లే నాలుక స్థితినిబట్టి అనేక వ్యాధి విశేషములను, వాటి అంకురావస్థలోనే కనిపెట్టవచ్చును. అనుమానం కలగంగానే వెంటనే వైద్య సహాయంపొంది, వ్యాధి ముదిరిపోకముందే అటావిసి, ఆరోగ్యాన్ని పొందవచ్చును. ఇంతేకాదు. ఆహారంలోఉండే అనేక లోపాలవల్ల వచ్చే వ్యాధులూ కొన్ని ఔషధములు వికటించినప్పుడు ఏర్పడే వ్యాధులూ, శరీరపరిశుభ్రతలో లోపాలవల్ల ఏర్పడే వ్యాధులూ, మున్ముందుగా నాలుకలో మార్పులు కలిగిస్తవి. ఈ మార్పులు, ఆహారంలో సవరణలవల్ల, అభ్యాసములలో మార్పులవల్ల, ఆ పరిజ్ఞానంగలవారు తమంతట తామే సవరించుకోవచ్చును. కాని నాడు శీఘ్రంగా వైద్య సహాయం పొందవచ్చును.

నోరు ఒక గది వంటిది. పై దవడ ఎముక (Maxilla) క్రింది దవడ ఎముక (Mandore) పట్టములు కాగా, రెండు ప్రక్కలా బుగ్గలు ప్రక్క గోడలుగా, అంగిలి పైకప్పుగా, నాలిక, దాని క్రిందఉన్న లాలాజల గ్రంధులు తదితర నిర్మితులు, అడుగుగా ఫేరింక్సు (Pharynx) వెనుక గోడలా ఏర్పడ్డ గది గహ్వరం (Oral cavity). పెదిమలు తలుపులుగా వున్న ముఖద్వారం నోరు. 'గహ్వరం' అనే గుహముందు భాగమునకు 'బుక్కల్ కేవిటీ' (Buccal cavity) అనిపేరు. 'బుక్క' అంటే బుగ్గ. ఈ రెండు మాటలకు మధ్యన ఉన్న శబ్ద సామ్యము గమనించదగ్గది. ఇల్లాగే దంత శబ్దమునకు, పాశ్చాత్య భాషలలో డాంటే, డోంటె, డాంట్ అన్న శబ్దములు అతి సన్నిహితములు. ఇటువంటి శబ్దసన్నిహితత్వము, సామ్యము మానవ జాతి ఆది భాష ఒకటే అయి ఉంటుందా" అనే అనుమానం భాషా శాస్త్రవేత్తలకు కలిగిస్తూ ఉంటుంది. గహ్వరం వెనుక భాగమును ఫేరింక్సు (Pharynx) అంటారు.

ఇంగ్లీషులో V ఆకారంలోఉన్న క్రింది దవడ ఎముక మధ్య పల్లంవంటి నిమ్న ప్రదేశంలో నాలుక ఒద్దిగ్గా ఉంటుంది. కంఠం ముందు భాగంలో 'లారింక్స్' (Larynx) అనే శబ్దపేటికకు పైన ఉన్న హాయాయిడ్ (Hyoid) అనే శల్య ప్రభేదమును, మేండిబుల్ వెనక భాగములను అంటి ఉంటూ, నాలుక పాముపడగవలె ముందుకువంగి క్రింది దంతశ్రేణి మధ్య పడుకుని ఉంటుంది. నాలుక అంచులు ఆ దంతములను రాచుకుంటూ ఉంటవి. నాలుకలో కండరముల పోగులు (Musile-fibres) ఎన్నోఉన్నవి. అనేక నూలుపోగులుచేరి పేనితే తాడు తయారైనట్లుగా అనేక కండరములపోగులు కలిపి కండ తయారవుతుంది. ఈ కండలో ప్రతి పోగు పొడుగుగాఉండే ఒక జీవకణము. అంటే అందులో న్యూక్లియస్ (Neucleus) సైటోప్లాజం (Cytoplasm) అనే ప్రోటోప్లాజం విభేదములు రెండూ ఉంటవి. ఈ వ్యాసావళి ప్రారంభంలో జీవకణమునుగురించి విపులంగా చర్చించాము. ఈ కండపోగులలో కొన్నింటిలో కట్లపురుగు శరీరంమీద ఉన్నట్లుగా అడ్డ గీతలు ఉంటవి. మరికొన్నింటిలో ఉండవు. అవసరమైనప్పుడు పొడుగు కావడం, పొట్టి కావడం ఈ కండరముల పోగులస్వభావం. పొట్టికావడమును సంకోచము అనీ (Contraction) పొడుగు కావడమునో మామూలు స్థితికిరావడమునో 'వికోచము' అనీ (Relaxation) ఆయుర్వేద పరిభాషలో అంటారు. సందేహిస్తున్నామన్న అర్థంలో సంకోచ శబ్దం వాడబడుతున్నా, సంకోచం అన్న మాటకు ముడుచుకు పోవడమనే అర్థం. కండరంలోఉన్న అసంఖ్యాకములయిన కండపోగుల ప్రత్యేక సంకోచవికోచముల ఫలితములే కండరముయొక్క సంకోచవికోచములు. అడ్డగీతలున్న కండపోగులతో నిర్మించబడిన కండరములు (Muscles) మన యిచ్ఛ వచ్చినట్లు సంకోచములు పొందుతవి. వాటిని ఇచ్ఛాధీన కండరములు అనవచ్చును. అడ్డగీతలులేని కండ పోగులతో నిర్మించబడిన కండరములు, మన స్వాధీనంలో మన ఇచ్ఛ ననుసరించి ఉండవు. వాటిని అనిచ్ఛాధీనకండరములు అనవచ్చును.

ఈ విషయము శరీరకార్యక్రమంలో అతి ముఖ్యమైనది. ఆ విషయం సందర్భం వచ్చినప్పుడు ఇంకా విపులంగా చర్చిస్తాను. పొడువుగా, శరీర బహిర్భాగములలో ఉన్న కండరములు ఇచ్ఛాధీనములు, శరీరాంతరాళములలో ఉన్న కండరములు ప్రేగులు, గుండెకాయ, గర్భాశయమ ఇటువంటి అవయవములలో ఉన్న కండరములు—అనిచ్ఛాదీనములు. నాలుక ఇచ్ఛాదీనములయిన కండ పోగులతో నిర్మింపబడ్డ ఉపాంగము. దీనిలో కండపోగులు గుండ్రంగా నిలువుగా అనేక వరసలలో అల్లుకుని నాలుక ఎటుబడితే అటు, నోటిలో ఎక్కడికి పోవాలంటే అక్కడికి, పోవడానికి వీలు కలిగిస్తవి. ఏ కండరం సంకోచ వికోచములకయినా కారణం మెదడునుండి వచ్చే సందేశములు. ఆ సందేశము మెదడునుండి తెచ్చేవి, శరీరభాగములనుండి మెదడుకు తీసుకునిపోయేవి నరము పోగులు (Nerve fibres) అనేక కండపోగుల కూడికతో కండరం ఏర్పడ్డట్లే అనేక నరముపోగులకూడికతో నరము ఏర్పడుతుంది. అయితే కండరం పొడుగు కొన్ని అంగుళాలు ఉంటే నరముల పొడుగు శరీరం అంత పొడుగూ ఉండవచ్చు. ఇచ్ఛాదీనములు అనిచ్ఛాధీనములు అని కండరములలో ప్రభేదములు ఉన్నట్లే, వాటికి వార్తలుచేర్చే నరములు కూడా ఇచ్ఛాధీనములనీ, అనిచ్ఛాధీనములు లేక స్వచ్ఛందములు అని రెండు రకములు ఉన్నవి. ఆ విషయమూ సందర్భం వచ్చినప్పుడు ఇంకా విపులంగా చర్చిస్తాను. కండరం సంకోచవికోచములు జరగడానికి శక్తి కావాలి. ఈ శక్తి ఆహారదహనంతోగాని జరగదు. ఈ ఆహారం రక్తపరిభ్రమణంవల్ల, రక్తనాళముల ద్వారా జరుగుతుంది. అనుక్షణమూ, నాలుకలో కండపోగులు కోటానుకోట్లు సంకోచ వికోచములు చేయవలసి ఉంటుంది. గనక, నాలుకలో రక్త నాళములు నరములు అతి పుష్కలంగా ఉంటవి.

నాలుకమీద నిడువుగా ఒక గీత వుంటుంది. కొందరిలో ఇది గాడిగా ఉంటుంది. మరి కొందరిలో రేఖామాత్రంగా వుంటుంది. నాలుకలో ఒక తడికవంటి నిర్మితి నాలుకను, కుడి యెడమ భాగములుగా విభజించుతుంది. ఆ తడకపై అంచు నాలుకమీద మ్యూకస్ మెంబ్రేనును లోపలికి గుంజి

వట్టినందున నాలుకమీద గీత ఏర్పడుతుంది. నాలుకలో ఒక వైపునఉన్న రక్తనాళములకు, లింఫు నాళములకు మరి ఒక వైపునఉన్న రక్తనాళములకు లింఫునాళములకుసంబంధంనాలుక చివర భాగంలో తప్ప ఉండదు.ఈకారణంచేత నాలుకక్రిమిగ్రస్తమైనపుడు, వ్యాధిగ్రస్తమయినప్పుడు, ఆ ప్రక్కనఉండేలింపుగ్లాండులేపెద్దవి అవుతవి. ఈ ప్రక్క ఏ స్థానంలో లింపుగ్లాండులు పెద్దవి అవుతవో గమనించి, వ్యాధి స్వభావమును, స్థానమునూ వూహించడానికి ఇందువల సాధ్యమవుతుంది. పాములాంటి జంతువులలో నాలుక రెండుగా చీలిఉంటుంది. మనుష్యులలో ఈ భాగములు కలిసిపోతవి.

నాలుకలో కుడి ఎడమ భాగములున్నట్లే, ముందు భాగము, వెనుక భాగము అని రెండు భాగములున్నవి. V వంటిరేఖ ఈ భాగముల సరిహద్దును తెలియజేస్తుంది. పిండశరీరంలో వేరు వేరు భాగములనుంచి, ఈ భాగములు వృద్ధి చెందుతవి. ఆ యా భాగములలోఉండే నరములు కూడా మెదడులో వేరు వేరు ప్రదేశములలోఉన్న నర కేంద్రములకు (NerveCentres) సంబంధించిఉంటవి. ఇందువల్లనాలుకలో రుచి పోవడం మొదలయిన లక్షణము ననుబట్టి, మెదడులో ఏ భాగం చెడిందో వూహించడానికి వీలు కలుగుతుంది.

శరీరాంతరాళములన్నింటినీ మ్యూకస్ మెంబ్రేను క్రమ్మిఉన్నట్లే నాలుకను కూడా క్రమ్మిఉన్నది. అయితే నాలుకను క్రమ్మిఉండే మ్యూకస్ మెంబ్రేను తక్కిన ప్రదేశములలో ఉన్నంత మృదువుగా ఉండదు. చాలా గరుకుగా ఉంటుంది. ఈ గరుకుదనం, తీపి, చేదు, కారము, పులుపు మొదలయిన రుచి ప్రభేదములను తెలియజేయగల చిన్న చిన్న బుడిపెలు అసంఖ్యాకములుగా నాలుకమీది మ్యూకస్ మెంబ్రేనులో ఉన్నందున ఏర్పడుతుంది. ఈ బుడిపెలను రుచి మొగ్గలు (Taste Buds)అంటారు.నాలుకముందు భాగంలో ఈ మొగ్గలు చాలా చిన్నవిగా ఉంటవి. వెనుక భాగంలో చాలా పెద్దవిగా ఉంటవి. కొందరు భయస్తులు, శరీరవిజ్ఞానం లేనందున వీటిని కేన్సరువంటి వ్యాధి లక్షణములుగా భావించి భయపడతారు కూడా.

రుచిమొగ్గలు ఒక్క నాలుకలోనేకాదు. గవ్వారమును క్రమ్మిఉన్న మ్యూకస్ మెంబ్రేను అంతటా ఉన్నవి. కాని నాలుక ముందు భాగంలో చాలా అధికంగా ఉన్నవి. అందులోను, అంచుల చివరల చాలా దట్టముగా ఉంటవి.నాలుక మధ్యరేఖకు అటు ప్రక్కన ఇటు ప్రక్కనా తక్కువగా ఉంటవి. అల్లాగే నోటి వెనుక భాగములలోఉన్న మ్యూకస్ మెంబ్రేనులో కూడా రుచి మొగ్గలు అధికంగా వ్యాపించి ఉంటవి. రుచిని తెలియచేసే మొగ్గలే కాక, వేడినీ, చల్లదనాన్నీ, బాధనీ వస్తువుల స్వరూప స్వభావాలనూ తెలియజేసే నరముల అంతములు (Nerve ends)కూడా మొగ్గలలాగే నాలుక మీద ఉంటవి.జ్ఞాపకశక్తినిబట్టి, ఆ వస్తువులతో మనకున్న పరిచయాన్నిబట్టి, నోట్లో మిరియం, బటానీ, చిల్లగింజవంటి వస్తువులను, మనకు తెలియకుండా వుంచినా, వాటిని నాలుకతో తడిమి ఇందువల్లనే "ఇది ఈ వస్తువు" అని నిర్ణయించగలుగుతున్నాము. రుచిమొగ్గలు చిన్న పిల్లలలో పెద్దవారిలోకన్నా ఎక్కువగా వ్యాపించివుంటవి. వృద్ధాప్యం వచ్చినకొద్దీ ఇవి తగ్గిపోతవి. రుచికి సంబంధించిన నిర్మితులు నాలుకమీద చిన్న చిన్న బుడిపెలనుచుట్టి ఉంటవి. రుచి మొగ్గల ఆకృతులన్నీ ఒకలాగే ఉండవు. సార ఆకుమీది నూగులాంటివి కొన్ని, చిగురుటాకుల ఆకారం కలవి కొన్ని విచ్చెమొగ్గ ఆకారం కలవి కొన్ని, మ్యూకస్ మెంబ్రేను ఉపరిభాగంలో మాత్రమే ఉండేవి కొన్ని, మ్యూకస్ మెంబ్రేను అడుగు పొరలనుంచి పైకి మొలిచేవి కొన్ని. రుచి, మొగ్గ ఆకారం కూజా ఆకారం వంటిది. ఈ నిర్మితిలోఉన్న కణములు వేర్వేరు విధులను నిర్వర్తిస్తవి.

రుచి అని మనంభావించే అనుభూతి(Sensation)

వస్తు రుచి వాసనలతో కూడుకున్నప్పుడు ఎక్కువగా ఉంటుంది. ఘుమ ఘుమలాడుతూ కరిగే నేయి రుచిగా వుంటానికి కారణం వాసన. ఆ వాసన చవి చూడకుండా నేతిని మాత్రమే నాలుక మీద వేసుకుంటే దాని రుచి అంతగా తెలియదు. జంతువులలో, రుచి మొగ్గలకంటే వాసన విశేషములను ప్రభేదములను తెలియజేసే నిర్మితులు ఎక్కువగా ఉంటవి. ఈవిధంగా ఘ్రాణేంద్రియానికి జిహ్వేంద్రియానికి అత్యంత సన్నిహిత సంబంధం ఏర్పడి ఉంది.

నీటిలో కరగని వస్తువుల రుచిని, నాలుక తెలుసుకోలేదు. డిస్టిల్డ్‌వాటరు రుచి విహీనమైనది. పులుపు, ఉప్పు, చేదు, తీపి అని రుచులు నాలుగు రకములు. ఒక్కొక్క రుచిని ఒక్కొక్క రకమైన రుచి మొగ్గలు మన చేత అనుభవింపచేస్తవి. ఈ నాలుగు రుచులుకాక, లోహసంబంధమైన లవణములు నోటికి తగిలినప్పుడు అదోక మాదిరి రుచి తెలుస్తుంది.

ఆ యా వస్తువుల మూలంగానేకాక, విద్యుచ్ఛక్తిమూలంగా కూడా నోటిలో రుచిని కలిగించవచ్చును. బేటరీ పాజిటివ్‌ను నాలుకకు, నెగెటివ్‌ను శరీర భాగానికి తగిలించి కరంట్ ప్రసరింపచేస్తే నోటిలో పులుపురుచి తెలుస్తుంది. వీటినే త్రిప్పిపెడితే, చేదు రుచి తెలుస్తుంది. కొన్ని వ్యాధుల్లో నోటి రుచి పోవడమో, పోయినట్లుండడమో జరుగుతుంది. రుచి సంభవన, అనుభూతి, అతిమానసికమైంది. రుచిని నిర్ణయించే నిర్మితులు చెడినవో మనసు చెడి రుచులు తెలియడంలేదో నిర్ణయించడం చాలా అవసరమవుతుంది.

నాలుకలో అన్ని భాగములలోనూ అన్ని రుచులు సమానంగా తెలియవు. నాలుక కొనలో రుచి అధికంగా తెలుస్తుంది. నాలుక మొదటలో చాలా స్వల్పంగా తెలుస్తోంది. నాలుక వెనుక చివర భాగంలో చేదు బాగా తెలుస్తుంది. నాలుక చివరభాగం ఉప్పునూ, తీపినీ, ప్రక్క భాగములు, తీపినీ ఉప్పునూ, మధ్యప్రదేశం పులుపునూ ఎక్కువగా తెలియజేస్తవి.

కొన్ని ఔషధములు సేవించినప్పుడు కొన్ని రుచులు తెలియకుండాపోతవి. తాత్కాలికంగానో, శాశ్వతంగానో రుచి మొగ్గలు చెడినందున ఈ పరిస్థితి ఏర్పడుతుంది. కొన్ని వ్యాధులలోనూ ఇదే జరుగుతుంది.

నాలుక క్రిందిభాగంలోఉన్న మ్యూకస్ మెంబ్రేను మడతగా ఏర్పడి నాలుకను మేందిబుల్ వెనుక భాగానికి అతికి ఉంచుతుంది. ఈ మడతను "ఫ్రీనమ్‌లింగ్వే"(FraenumLingvae)అంటూ, రు. లింగ్వా(Lingva)అంటే నాలుక అని అర్థము. ఈ మ్యూకస్‌మెంబ్రేనుతో ఏర్పడ్డ మడతలు శరీరంలో చాలా చోట్ల ఉన్నవి. పురుషాంగము క్రింది భాగంలో యిటువంటి మడత వుంది. నాలుక వెనుక భాగానికి అటూ యిటూ రెండు మ్యూకస్ మెంబ్రేను మడతలు నాటక రంగంలో సైడ్ కర్టెన్లలాగా నిలబడి, తమ మధ్య టాన్సిలు అనే నిర్మితిని దాచి ఉంచుతవి.

నాలుకయొక్క ఫ్రీనమ్ నాలుక చివరకు అర అంగుళం దూరంలో అతికి ఉంటుంది. ఒక్కొక్కప్పుడు ఈ మడత నాలుక కొట్టకొనకు అతుక్కునిఉండి, నాలుకను పైకి లేవనివ్వదు. అస్థితో

మనమూ-మనదేహస్థితి

"ల" కారంవంటి శబ్దములను నాలుక ఉచ్చరించలేదు. నాలుకయొక్క 'ఫ్రీనం' నాలుక, కుక్క నాలుకలాగా బయటికి రాకుండాను, వెనక్కు పీక్కుని పోకుండానూ సరియైన స్థితిలో ఉంచుతుంది. నాలుక సరిగా ఉన్నప్పుడు, దాని చివరపై అంగిలినీ, బుగ్గలనూ, బుగ్గలకు దంతశ్రేణికి మధ్య ఉన్న ప్రదేశమునూ, తాకి, బ్రష్షులాగా శుభ్రం చేస్తుంది. పంటికీ, పంటికీ మధ్య ఇరుక్కుని ఉన్న ఆహార ఖండములను చాలవరకు నాలుక చివరతోనే తొలిగించడం జరుగుతుంది. లేరింక్సు అనే శబ్దపేటికలోనుంచి ఉద్భవించిన శబ్దం నోటిలో నాలుక స్థితినిబట్టి వివిధ రూపములు పొంది శబ్దోచ్చారణ జరుగుచున్నది. ఫ్రీనం నాలుక చివరన అతుక్కునిఉంటే ఇవేవీ సాధ్యంకావు. ముద్దు మాటలు రావడం, నోరు, దంతములు చిగుళ్ళు అతి శీఘ్రంగా క్రిమి దోషానికి గురి కావడం జరుగుతుంది. ఫ్రీనం ముందుండడం జన్మతః వచ్చేది. అయితే యిది అనివార్యమైనదికాదు. శస్త్రవైద్యులు, ఏ ప్రమాదమూ, బాధా లేకుండా ఈ మడతను కత్తిరించి, ఈ లోపాలన్నింటినీ చాలా తేలికగా సవరించగలుగుతారు. ★



గడియారపు సుడి

సి. సుబ్బారావు

కడలి కెరటాల నాల్కల నిడుపుఁ జాచి,
మన్ను మిన్నుల పెదవుల మధ్యఁ గఱచి,
చండకగుఁ గాలరాక్షసి చప్పరింప
నరుణ రుధిరమ్ము మెలమెల్లఁ గరుడుఁ గట్టి
నల్ల నల్లగ భువనరణాంగణమునఁ
బఱచుకొనిపోయెఁ, జిటికెలోఁ బవలు దాటె.
చుక్కదివిటీల పహారాల చక్కఁ గడచి,
పూర్వ పశ్చిమాచల దరీపుటములందు
ప్రొద్దు ప్రొద్దంత చేఁ జేతఁ బ్రోగుసేసి
మలచి యల్లిన స్వప్నాల మాలఁ గొనుచు
వచ్చి వరియించి నిద్ర నా వలపు దోచె!
ఏ మహాగాయకుండో అనేకగతుల
రాగచైతన్యముల మ్రోసి రసము లూడ్చి
పారవైచిన తను వేణువాద్యమైతి!
చెడని యీ గడియారఁపు సుడినిఁ బడుచు
నవధిఁ దెలియని నా జీవితాంగణమున
దిక్కుఁ దెలియక యూర్చె మరొక్కరోజు!

కవితాకింకిణి
బహుమతి పొందిన కవిత



ప్రతిక్రియ

శ్రీనివాస్

"సంసారం సాఫీగా సాగిపోవాలని, జవసత్త్వాలుడిగిన మాకు మనశ్శాంతి లభించాలని, క్షణకాలమైన మెదడుకు విశ్రాంతి నిద్దామని చూస్తున్నాను కదా—ఛీ! పాడు సంసారం..." విసురుగా వెళ్లిపోయాడు రంగారావ్.

ఇల్లు నిశ్శబ్దాన్నావహించింది. హాల్లో ఉన్న నలుగురిలో ఎవరి నోటంటా మాటా మంతీ లేదు కాసేపటిదాక.

అవును మరి! ఆనందం కోసం, సుఖం కోసం, మనశ్శాంతి కోసం అలమటించిపోయిన—పోతున్న రంగారావ్ హృదయం ఎంతగా బాధ పడిందో—ఆ పలుకుల్లో సుస్పష్టమైంది.

ఆశల్తో పెనవేసుకున్న ఆనందం అగాధంలో పడి చొచ్చుకుపోయింది.

—కారణం .... అది ఒక విచిత్ర సంఘటన ....

రంగారావ్ నడవలో పేపరు చూస్తూ కూర్చున్నాడు. సత్తెమ్మ లోపల పని చేసుకుంటోంది. సుజాత ఎక్కడో మేడమీద కాబోలు—రేడియో వింటూ కూర్చుంది. వర్మ అప్పుడే కాలేజి నుంచి వచ్చి బట్టలు మార్చుకుంటున్నాడు. తన కోసమని టిఫిన్—కాఫీ—బల్లమీద మంచి తొంగిచూస్తున్నాయి.

"అమ్మా! .... అమ్మా!!"—ఇల్లదిరిపోయేట్టు కేకలు విన్పించాయి.

రంగారావ్ పేపరొదిలి బయటికేసి చూశాడు.

గడపదాటి తలుపుల దగ్గర పడివుంది మహతి. నుదుటిమీద రక్తపు మరకలు. తెల్లటి చీరంతా రక్తమయం—పాలిపోయిన ముఖం, భయంతో వణికే పెదవులు, కళ్లల్లో నీళ్లు తిరుగుతూన్న కూతుర్ని చూసి చలించిపోయాడాయన.

తప్పతాగి తన్నాడు, ఇంట్లోంచి పొమ్మన్నాడు. పుట్టింటికి కాకుండా మరెక్కడికో వెళ్తుందేమో అని తానే స్వయంగా తీసుకొచ్చి గుమ్మం ముందు వదిలి వెళ్ళాడు. ఇది మహతి విషాదభరిత జీవిత గాథ.

లోకం దృష్టిలో నవ్వుల పాలైన కుటుంబం. మనోవ్యథతో మనశ్శాంతి లేని బ్రతుకులు.

ప్రతిక్రియ

"ఏమేవ్ .... ఇల్లారా"—ఆయన పిలుపు అందక ముందే ఇంట్లోవాళ్ళంతా వచ్చారక్కడికి.

కొన్ని నిమిషాలు నిశ్శబ్దం—మహతి సన్నగా ఏడుస్తోంది.

"మాశావా ! మీ అల్లుడి ఘనకార్యం ... " కర్కశస్వరాన దొర్లిపోతున్నాయి రంగారావ్‌గారి మాటలు.

సత్తెమ్మ కూతుర్ని లేవదీసి—"చాల్లెండి—ఇప్పటికే కడుపులో మంటలు రేగిపోతోంటే .... గోరుచుట్టు మీద రోకలిపోటు లాంటి మాటలూ—మీరూనూ"—లోపలికి తీసుకెళ్ళింది మహతిని.

వర్మ బరువుగా నిట్టూర్చి చెప్పు లేసుకొన్నాడు.

"ఎక్కడికి వెళ్తున్నారు?"- ప్రశ్నించింది సుజాత.

'వల్లికాట్లోకి.'

"ఏమిట్రా దురుసుతనం. మళ్ళా నీకేం వచ్చింది"—రంగారావ్.

'ఫలహారం చేసి వెళ్ళండి.'

జవాబు లేదు.

"ఎప్పుడూ చూస్తున్నదేగా ! అన్నయ్యకు మంచి బుద్ధి రాదు. వదినెకి ఈ జన్మలో సుఖ శాంతు లుండవ్ .... రండి .... ఫలహారం చేద్దురుగాని."

"సుజీ .... మాటలు తిన్నగా రానీ !"

'కొత్తగా కల్పించి నేనేం అన్నాను.'

"ఎక్కడికిరా ఇంతకూ ? అల్లుడింటికేనా ?"

'అవునన్నాన్నా.'

"ఏం చేస్తావేం ?"

"ఏదో ఒకటి—"

"వాడ్ని చావ బాదుతావ్. అంతేనా !"

"చావ బాదటానిక్కి బావగారు నాకంటే బల వంతులు."

"మరి ?"

"ఇచ్చి పుచ్చుకోడాలవల్ల, ఇరుపక్షాల సంసా రాల్లో కారుచిచ్చులు రగుల్కొనే దానికి కారణ మేమిటో—ఎదురు వియ్యం వల్ల జరిగే అన ర్థాల్ని అరికట్టటానికి ఉపాయం .... ఇవ్వే తెల్పింది. అమల్లో పెట్టటాని కెళ్తున్నా."

రంగారావ్ మౌనం వహించాడు.

"మొదట్లో మర్యాదగా మాట్లాడుతాను. వయంగా నచ్చజెప్పుతాను .... "

"తర్వాత బెదిరిస్తావ్. తాటాకు చప్పుళ్ళకి కుందేళ్ళు బెదరిపోవోయ్—ఏం చేసుకుంటావో చేసుకోపోవోయ్ అంటాడు వాడు. తెల్సా హూ ! ఇలా అన్నవాళ్ళే నామరూపాల్లేకుండా నాశనమై పోయారు. ఇహ నువ్వుద్ధరిస్తావ్ కాబోలు."

"ఆదర్శాలు చెప్పడం సులభం నాన్నా ! ఆచర ణలో పెట్టడమే కష్టం. అలా ఆచరించా లను కున్నవాడ్ని మీబోటివాళ్ళు నిరుత్సాహపరచి పాతా ళానికి తొక్కేస్తారు."

"అఘోరించావ్ లేవోయ్. నాకు మాత్రం మనస్సు చివుక్కు మనడంలేదూ ! తల్చుకుంటే కడుపు రగిలిపోతుంది బాధతో. నీ కొక్కడికే హృదయం ఉందనుకున్నావ్ .... అల్లుడు తాగు బోతు .... జూదరి .... వ్యభిచారని నా మొహాన్నే అనే స్తుంటే, తల దాచుకోడానికి చోటు దొరక్క చస్తుంటే—" కాసే పాగి, "ఏది చాతకాక పోయినా ఇంట్లోవాళ్ళందరూ ములుకుల్లాంటి మాట లనడం నేర్చుకొన్నారు .... " ఆ మాట లంటున్న సమయంలో సత్తెమ్మ కూతురితో హాల్లో కొచ్చింది.

ఒక్కసారి కూతురు కేసి చూశా డాయన.

తలకి గుడ్డ కట్టుకుంది. చీర మార్చుకుంది. మొహాన చెదరిన బొట్టు.

—తిరిగి కొడుకు నుద్దేశిస్తూ, "నిన్నని ఏం లాభం ! నిన్నిలా తర్ఫీదు చేసిన వారి ననాలి కాని" అన్నాడు.

"వాడికేం నే నేర్పలేదు. ఒకరు చెప్తే వాడు వినిపించుకునే రకం కాదని మీకు తెల్సుగా" అంది సత్తెమ్మ.

"ఏం జరిగిందిట"—కుర్చీలో చతికిల బడ్డాడు రంగారావ్.

"తప్ప తాగి తన్నాడు. ఇంట్లోంచి పొమ్మన్నా డుట. ఇక్కడికి రాకుండా మరెక్కడికో వెళ్తుందేమో తనే స్వయంగా దారంటా నడిపించుకుంటూ తీసి కొచ్చి గుమ్మం ముందు వదిలి పోయాడుట."

కొన్ని క్షణాలు నిశ్శబ్దం. "ఇక్కడికి రాకూడ దనే నా అభిమతం. సుఖపడ్డా, కష్టపడ్డా ఆడ దానికి అత్తిల్లే ఆధారం. కానీ వారు వెళ్ళిపొమ్మ న్నారు. అంతటితో వూరుకోక వారే నన్నిక్కడికి లాక్కొచ్చి వదిలారు"—రుద్ధ కంఠంతో అంది మహతి.

"అంతేనా ! ఇలా జరగడం ఇది ఎన్నోసారో ? ఇళ్ళా మర్నాటికల్లా అన్నయ్య రాడూ ? వచ్చి కాళ్ళా వేళ్ళా పడి తీసుకెళ్తాడులే వదినె. నీవేం కంగారు పడక."

"సుజాతా !" అరచాడు వర్మ గట్టిగా.

"ఏం ? వదిన్ను వోదార్చకూడ దంటారా ?"

"నిన్ను నోరు మూసుకోమంటున్నాను."

చాలసేపు నిశ్శబ్దం. ఈసారి రంగారావ్‌గారు నిశ్శబ్దాన్ని భంగపరిచారు.

"అయితే తెగతెంపులు చేసుకొన్నాడనేగా వాడి చేష్టకి అర్థం. సంసారం సాఫీగా సాగిపోవాలని .... జవసత్వాలుడిగిన మాకు మనశ్శాంతి లభించాలని ...... " చివాల్న లేచి రంగారావ్ విసురుగా వెళ్ళిం దప్పుడే.

అదే మహతి విషాదభరితజీవితగాధ — అదే ఆ సంసారులకి భరింపశక్యముకాని బాధ.

మన్నుని తొలిచి పారేస్తున్న కుమ్మరి పురు గులు—మనోవ్యథతో మనశ్శాంతి లేని బ్రతుకులు.

లోకం దృష్టిలో నవ్వుల పాలైన కుటుంబాలు, లౌకికం తెలిసీ, సంస్కారం అలవడ్డా, దీపాన్ని, పండనుకునే పురుగులా క్షుద్ర తత్వాల్లోకి దిగ జారిపోయిన బావగార్ని—ఎదురు వియ్యం వల్ల ఏర్పడ్డ కుటుంబకలహాల్ని అంతం చేయట మెలాగా—అని ఆలోచిస్తూ బయటి కెళ్ళి పోయాడు వర్మ.

"హు ! రోజూ చచ్చేవాళ్ళకి ఎవళ్ళేడుస్తారు. ఎప్పుడూ చూస్తుండేదేగా .... ప్రతి చిన్న విష యానికి బాధపడే తత్వం ఈయనగారిది. ఇవ్వే ళంతా ఇహ ఏకాదశి ఉపవాసం—శివరాత్రి జాగ రణో ఈయనగార్కి. ఇలా వచ్చేవాళ్ళు రాత్రి ఏ పదింటికో వస్తే ఆయనకేబాధా ఉండదు కదా"—తనలో తా ననుకున్నట్లున్నా, సుజాత మాటలు తల్లీ కూతు ళ్ళిద్దరికీ విన్పించాయి.

"అవు నొదినా ! బండి విరిగిన వాడే వెర్రి వాడు" అంది మహతి.

"నిన్నేం అనలేదమ్మా ! మీ అన్నయ్య ఫలహారం చెయ్యకుండా వెళ్తుంటే .... "

"బాధపడుతున్నావ్ కదూ. మరి నా మొహాన్నే మీ అన్నయ్య నంత చులకన చెయ్యడం బావుంది. నీ కన్నయ్యని చనువుంటే మాత్రం—ఆయన నాకు భర్త."

రోగి—మారిచ్చే మందు

చాలా రోజులుగా తింటు న్నాను. కాని జ్వరం మాత్రం తగ్గడం లేదు. కాస్త చెమట పట్టేటందు ఇద్దరూ, మీకు పుణ్యాం ఉంటుంది.

డాక్టర్—సరే, ఇప్పుడే వెళ్ళి బిల్లు పంపిస్తాను.

కోయిల్‌కర్ బన్సీలాల్
(నిజామాబాదు)

"మా అన్నయ్యని నేనేం తీసి పారేయలేదు" అంది సుజాత కటువుగా.

"మా వారెపుడూ ఒకర్ని యాచించింది లేదు. భర్త తన భార్యని తీసుకెళ్లడానికి కాళ్లా వేళ్లా పడ నక్కరలేదు. ఆయనకు నామీద సర్వాధికారాలున్నప్పుడు ఏమైనా చేసుకుంటాడు. నా బతుకే నవ్వులపాలటు. ఇహ ఇక్కడికి రావటానికి వేళ పాళా ఎందుకు ?" మహతి సన్నగా ఏడ్చింది.

దాంతో సత్తెమ్మ లేచింది కోడలి మీదికి. "అక్కడ ఇంట్లోంచి పొమ్మంటే—ఇక్కడికి రాక ఎక్కడి కెళ్తాం దనుకున్నావ్. చావు బతుకుల్లో వుంటే ఇంట్లోకి రావటానికి సమయా సమయాలు కావా లేమిటి ? నీ సంసారం సుఖంగా ఉందని పొగరెక్కి పోతున్నావ్. నీ అహంభావమే నిన్ను నాశనం చేస్తుంది చూడు."

"అవు నత్తయ్యా. ఇక్కడి కొచ్చి ఆయన మనసు పాడుచేసి మా సంసారం నాశనం చేయడానికే పుట్టిం దీ మహతి. అత్తిల్లు వదిలిపెట్టి అనాథ శరణాలయా ల్లేకపోలేదు."

"ఆ .... ఆ.... ఏమె సుజీ ! దండించేవాళ్లు లేక నోటి కొచ్చిందల్లా వాగుతున్నావ్ ?"

"మరి నోరుండేది ఎందు కనుకున్నా రత్తయ్యా?"

"ఛీ. నీ వల్లనే దీని సంసారం అధోగతి పాలైంది. వద్దండీ ఎదురు వియ్యం అచ్చిరాదని చెత్తి, నోరూ బాదుకున్నా ఆయన వింటేనా, కాదు కూడదంటూ మూడు ముళ్లు వేయించారు. నీ పెళ్లిలో ఏ ముహూర్తాన పోట్లాడుకున్నామో...? తర్వాత ఏదో మాటాడబోయింది.

మహతి ఓ చావుకేక వేసి వెల్లకిలా పడింది. కాళ్లు, చేతులు కర్రల్లా బిగుసుకు పోయాయి. గుడ్లు బయటికి పొడుచుకు వచ్చాయి.

రంగారావ్ గబగబా వచ్చాడు ఆ కేక విని. సత్తెమ్మ గొల్లు మంది. సుజాత బిత్తర చూపులు చూస్తూ మేడమీదికి పరుగెత్తింది.

"ఏం ఫర్వాలేదు. మూర్ఛపోయింది లేవే .... డాక్టర్ .... డాక్టర్" అంటూ తన గదిలో కెళ్లి ఫోన్ చేశాడు.

మూడు రోజులు గడిచాయి. మహతిని తీసుకు పోవడానికి సారథి రాలేదు.

మహతి సహజంగా బక్కపలచగా ఉంటుంది. సారథి తాగొచ్చి తన్నే తన్నులకి, తిన్న అన్నం వంట బట్టక సగమై పోయింది. పైగా ఈ మనో వ్యథతో పూర్తిగా మారిపోయింది — చీపురుపుల్ల లాగు. రెండేళ్ల క్రితం పెళ్లికూతురుగా పీటల మీద కూర్చున్న మహతికీ—ఇప్పటి మహతికీ ఎంతో తేడా. చెల్లెల్ని చూస్తుంటే .... వర్మ గుండెల్లో ఆరిపోని మంటలకు వాయువు తోడై నట్టు సుజాత ఎత్తి పొడుపులు—ఏమీ పట్టించు కోక తన గది వదలిరాక లోలోపలే కృంగిపోతున్న తండ్రి బాధని బాయటికి చెప్పుకోలేక దిగ మింగడం దుస్సాధ్యం కాగా .... రెండు గోడల మధ్య క్రుంగిపోతున్న తల్లి—అందరూ స్మృతి పథంలో మెదలుతున్నారు. ఉదయం కాలేజి కెళ్తుంటే తన కుటుంబాన్ని, మహతిని గూర్చి మాటాడుకుంటూ సారథిని నిందిస్తున్న చుట్టు

పక్కల వారి మాటలు చెవుల్లో ఇంకా గింగుర్లాడు తున్నాయి.

రాత్రంతా వర్మకి నిద్ర పట్టింది కాదు. మర్నాడు బారెడు పొద్దెక్కాక లేచాడు.

"అత్తగా రింటికి వెళ్లదాయె .... అన్న య్యొచ్చి తీసుకుపోడాయె—ఇరువైనాలు గ్గంటలు ఏడుస్తూ కూర్చుంటే ఎలా గనుకుందో ? ఇంట్లో ఇంత పాచిపని పెట్టుకుని ఏ స్త్రీ మాత్రం అలా ఉండగా నే చూడలేదబ్బా—పనిచేస్తే 'ఫిట్సు' వస్తాయన్న సాకు బాగా దొరికింది. చివర కామె తిన్న కంచం కూడా నేనే కడగాలి. హు. ఒకర్నని ఏం లాభం ? ఈ ఇల్లే సగం అరిష్టానికి మూలం. ఇంట్లో మనుషుల రాతలు సరేసరి."

—ఆ అంటున్నది సుజాతని వర్మకి బాగా తెల్సు. చిన్నప్పట్నుంచి ఇద్దరూ కలిసి మెలిసి చదువుకొన్నవాళ్లు. స్కూల్ ఫైనల్తో ఆగి పోయింది సుజాత. తను మాత్రం చదువు సాగించాడు. ప్రేమలేఖలు రోజు కొకటి వస్తుండేవి. తనకి బుద్ధి తెల్సింది మొదలు సుజాతని పల్లెత్తు మాటనలేదు.

ఎంచాత అనలేక పోతున్నాడు ? నిజానికి అస్త మానం ఒకర్ని ఆడిపోసుకోడం తప్పుకదా ! మరి తనెందుకు దండించలేక పోతున్నాడు. ప్రేమించా డనా ? చెల్లాయిని మాత్రం ప్రేమించలేదూ ? చెల్లాయి కోసం తనేమైనా చెయ్యగలడు. ఆమె సంసారం బాగుపడాలంటే .... బాగుపడాలంటే తను సుజాతను దండిస్తే .... పరిస్థితుల్లో మార్పులు రాకపోతాయా ? వస్తాయ్—చక్క బడుతాయ్ సంసారాలు—అబ్బా ! ఇన్నాళ్ల కీ ఆలోచన తట్టింది !

"సుజీ—సుజాతా" ఇంటి పైకప్పు అదిరి పోయేలా అరిచాడు.

"ఎందు కలా గొంతు చించుకుంటూరు"—ఓ నిమిషం తర్వాత వచ్చింది సుజాత.

"నీ గొంతుకంటే నాదేం పెద్దది కాదు."

"ఏం కావాలి మీకు? మీరు బాత్ రూంలో కెళ్లండి ... నే టవల్, సోపు పట్టుకొస్తాను". మారి పోయిన కంఠస్వరంలో తియ్యదనం—ఆ చూపుల్లో ఎంత చల్లదనం — క్షణం ముందున్న కాఠిన్యం—కోపం—కరిగిపోయాయి. ఆ స్థానే అనురాగం పెల్లుబికి వచ్చింది వర్మకి. చిరునవ్వు పెదాలమీద పరుగెత్తింది.

"కాఫీ రెడీగా ఉంచు .... వస్తున్నా"—స్నానం చేస్తుంటే మళ్లా తను చేయా లనుకున్న ఘన కార్యం—మనః ఫలకంమీద నిలచింది. ఛా. తనొట్టి చవట. నాన్నగా రన్న దాంట్లో ఎంతో యథార్థ ముంది. తను బలహీనుడు. మనస్సు చంచలం. క్షణిక సుఖాలకి లొంగిపోయే ఉద్రేకి తను. బుర్ర వేడెక్కి పోతోంది—పైగా వేన్నీళ్ల స్నానం—నిస్సహాయుడికి కోపం జాస్తి—చేతిలోని చెంబుని విసరి కొట్టాడు. బాత్ రూంలోంచి బయట పడ్డాడు.

వంట గదిలో సత్తెమ్మ కట్టెల్ని పొయ్యి లోకి ఎగదోస్తూ కూర్చుంది. ఆమెకి చేరువలో మహతి తలొంచుకు ఉంది. ఉప్మా సాసర్లో పెట్టి, ఫ్లాస్కులోని కాఫీ గ్లాసులో పోస్తూ,

ప్రతిక్రియ

"అడుపడుచు అన్నమానం కన్నీళ్ళు కారుస్తోంటే ఈ యింటి కెంత దరిద్రమో మీ కేం తెలు సత్తయ్య" అంది సుజాత.

"నా విషయం పట్టించుకోవద్దని నీ కెన్ని సార్లు చెప్పాను వదినా! నా కర్మ ఎలా కాలిందో అలాగే జరుగుతుంది."

"సుజీ"—కోపంతో వణికిపోయాడు వర్మ.

"కాకపోతే ఏమిటండీ? ఎపుడూ ఏడుస్తూ కూర్చోవద్దని చెప్పడం కూడా తప్పేనా! రేడియో, కేరమ్స్, సినిమాలు, ఎన్నో ఉన్నాయికదా, కాస్త మనోవ్యధని మర్చిపొమ్మని, మనస్సుకి విశ్రాంతి కల్గించుకోమని చెప్తున్నా. పరోపకారం చెయ్యబోతే—"

"నీ కెవరిచ్చారీ పెత్తనం—మహతి విషయం చూసుకోడానికి ఇంట్లో మరెవ్వరూ లేరా? నువ్వేనా పెత్తందారువి?"

"ఎవరూ పట్టించుకోకపోతే—"

"నోర్ముయ్."

"ఏం తప్పు చెయ్యిందీ ఎందు కలా కసురుకుంటారు. రామరావు! ఏమంటూ ఇంట్లో అడుగెట్టిందో ఈవిడ—అప్పట్నుంచి మీ మనసు పాడై పోయింది."

తనని లొంగదీసుకోడానికి ప్రయత్నం—స్త్రీ నిజంగా సమయస్ఫూర్తిలో గట్టిది. నిగ్రహం కూడదీసుకున్నాడు వర్మ. "అది మనసు బాగో లేక కుమిలిపోతూంటే సినిమా కెళ్లమని సలహా యివ్వటం ఎత్తిపొడవడం కాదూ? దాని స్థానే నువ్వుంటే ఆ బాధ నీ కర్థమై ఉండేది."

"మహతిలా నేనేం తెలివితక్కువదాన్ని కాదు. మొగుడు తప్ప తాగి తన్నడాని కొస్తే—సరాసరి పోలీసుల్ని పిలిచి జైల్లో పడేస్తాను."

"పోలీసులా? జైలా? వద్దు—ఆయన్ని బాధించకండి. ఆయన కా శిక్ష విధించకండి. నన్నేమి యిష్టం వచ్చినట్టు .... హిం .... సిం ... చం .... డి" స్పృహతప్పి పోయింది మహతికి.

వెల్లకిలా పడడంతో కుడిచెయ్యి తిన్నగా పొయ్యిలో కెళ్లింది. అంతా నిశ్చేష్టులై పోయారు. కొన్ని క్షణాలకి తమాయించుకుని వర్మ మహతి చేతిని లాగాడు. చర్మమంతా కాలిపోయింది. సత్తెమ్మ బావురుమంది. ఎక్కడో ఉన్న రంగారావ్ పరుగెత్తు కొచ్చాడు—

"మళ్ళా ఏం కొంప మునిగిందే"—అంటూ.

అప్పటికి పూర్తిగా వర్మని అజ్ఞాతశక్తి ఆవహించింది. తనేం చేస్తున్నాడో—ఏమో అతనికేం తెలియదు. అతని చెయ్యి సుజాత చెంపని చరిచింది. శక్తి ఉన్నంత వరకూ బాదాడు. ఆఖరికి రంగారావు అడ్డుపడి కొడుకుని అవతలి గదిలోకి లాక్కెళ్ళాడు.

అటు కూతురి సంసారం, ఇటు కొడుకు సంసారం—సర్వ నాశనం. ఇంటి యజమాని మనోవ్యథకి ఇంతకంటే మరేం అవసరం లేదు. ఇంత

కంటె ఘోరమైన సంఘటన జరగ నక్కరలేదు. తలను రెండు చేతులతో పట్టుకొని నేలమీద చతికిల పడ్డాడు. మొత్తానికి రంగారావు, సత్తెమ్మల గుండెలు బాధలకి అలవాటు పడ్డాయి కాబట్టి—అసంఘటనలకు మతి చలించి వీధులపాలు కాలేదు.

"నువ్వూ ఇంతగా దిగజారి పోతున్నావ్రా." కొడుకుతో ఆ మాట అంటున్న సమయంలో రంగారావు కళ్ళు చెమ్మగిల్లాయి. అదాయన జీవితంలో మొదటిసారిగా జరిగింది.

జవాబు చెప్పకుండా డాక్టర్‌కోస మంటూ బయటికి నడిచాడు వర్మ. మరో పదిహేను నిమిషాల్లో రిక్షాలో డాక్టర్ని తీసుకొచ్చాడు. ఓ ఖాళీ గుర్రబ్బండి కూడా పక్కనే నిల్చింది.

"అదెందుకు ?"—రంగారావ్ ఆశ్చర్యపోతూ అడిగాడు. కొడుకు వినిపించుకోలేదు.

"సుజాతా ! నీ బట్టలవీ తీసుకో—"

మవునంగా ఏడుస్తున్న సుజాత కా మాటలు పిడుగులు పడ్డట్టయింది. గుండెలు గుభేలుమన్నాయి.

"ఎందుకండీ ?"

"ఎదురు ప్రశ్నించావా .... చితగ్గొట్టాను."

....

"ముందు పెట్టే బెడ్డు సర్దుకో."

....

"ఊఁ—నీకే చెప్పేంట."

"మనిద్దరివా ?"

"కాదు—నీవే." తన జీవితంలో భర్త రౌద్రాకారం తొలిసారిగా చూసిన సుజాత భయంతో కంపించిపోక ఏం చేస్తుంది ? నోరు మెదపటానికి నిజంగా ఆమెకి ధైర్యం చాలింది కాదు.

పది నిమిషాల్లో తన సామాన్లు సర్దుకుంది.

"అయిందా ?"

"ఊ."

'పదా'—అతను ముందు, ఆమె వెనక నడిచారు మేడమెట్లు దగ్గర రంగారావ్, సత్తెమ్మలు నిలబడ్డారు. వారికి కాస్త దూరంలో డాక్టర్ మహతిచేతికి కట్టు కట్టుతున్నాడు.

"అత్తయ్యా." చేతిలోని సూట్‌కేసు జారిపోయింది. కన్నీళ్ళు కట్టలు తెంచుకు ప్రవహించాయి.

సత్తెమ్మ కోడల్ని లేవదీసింది.

"ఎక్కడికిరా కోడల్ని పంపుతున్నావ్ ?"

"బావ మహతిని చావ బాదితే ఆమె ఎక్కడికెళ్ళిందో అక్కడికే !"

"ఆలోచించి చేస్తున్నావా ?"

"ఆ."

"నలుగురూ నవ్విపోతుంది చాలకా—"

"ఎవ రా నల్గురు ? వెధవలు. నవ్వుతారు. ఇనుప ముక్కని ఎర్రగా కాల్చి వరుస బెట్టి సమ్మెట పోట్లు వేస్తే కాని మనం చెప్పినట్లు వినదు వాన్న. నా ఆశయం నెరవేరితే—ఈ బాధలు, ఈ సమస్యలు, అన్నీ త్వరలో తీరిపోతాయి. దయచేసి నా కార్యానికి భంగం కల్గించకండి" అన్నాడు. కాసేపాగి—"పదా. ఏనాడు లేంది అత్తయ్యమీద ఇంత ప్రేమ ఎలాగొచ్చిందేం ? ఏడ్చి మొత్తుకున్నా నీకు సహాయం చేసేవా రెవ్వరూ లే రిక్కడ" —సుజాత నుద్దేశిస్తూ.

బండి కదలబోతున్నసమయంలో — సుజాత జాలిగా, దీనాతి దీనంగా భర్తకేసి చూసింది.

"నే నొద్దా మీకు ?"

"అక్కర్లేదు."

"ఎప్పటికీ ఇంతేనా ?"

"అవసరం వస్తే స్వీకరిస్తాను."

బండి కుదుపులకి సుజాత కన్నీళ్ళు జారి పడ్డాయి కింద. వాటిని తుడుచుకుంటూంటే వర్మ అన్నాడు మెల్లగా "మీ అన్నయ్య మా చెల్లాయిని వీధులెంటా నడిపించు కొచ్చాడు. కానీ నేను నిన్ను బళ్ళో పంపుతున్నాను. మీవాళ్ళెవరైనా అడుగుతే అన్ని విషయాలతో పాటు ఇదికూడా చెప్పు .... మర్చిపోకేం" అని.

* * *

రాత్రి సుమారు పన్నెండు గంటలు—తూలుతూ వచ్చాడు సారధి. తలుపు తట్టాడు. తెరచింది సుజాత. చెల్లెల్ని చూసి చిత్తయిపోయాడు. సగం నిషా వదిలింది.

"రా అన్నయ్యా"—ఆ మాటలతో ప్రకృతిలో పడ్డాడు.

"ఎప్పు డొచ్చావ్ ?"

"ఉదయం."

"వర్మ వూళ్ళో లేడా ఏమిటి ?"

—అత నలా ప్రశ్నించటానికి కారణం లేక పోలేదు. ముసుపు ఎప్పుడైనా వర్మ వూర్లో లేకపోతే సుజాత తల్లిగా రింటి కెళ్ళేది. అత్తగారింటికి, తల్లిగా రింటికి మధ్య దూరం .... మూడు వీధులు మాత్రమే. వర్మ తిరిగొచ్చాడని ఎవరైనా కబురంపుతే తిరిగి వెళ్ళేది.


"ఉన్నారు. ఎక్కడికీ వెళ్ళలేదు."

"మరెందు కొచ్చావ్ ?"

"ఈ అర్ధరాత్రిపూట మాట లెందుకు ? తెల్లారి అన్ని విషయాలు మాటాడుకుందాం." తలుపేసి తన గదిలో కెళ్ళింది.

తెల్లారాక తల్లి ద్వారా అంతా తెల్సుకున్నాడు సారధి. తన భార్య మొద్దు స్వరూపం. తన అవసరా లేమిటో దానికి తెలియవ్. తను మాటాడుతుంటే అడ్డు ప్రశ్న లేస్తుంది. తన కనవసరంగా కోపం తెప్పిస్తుంది. తను రెచ్చిపోయి చావ బాదుతాడు. కానీ సుజాత కేం ? తెలివిగలది. సమయస్ఫూర్తిలో గొప్పది. అలాంటి ఉత్తమ ఇల్లాల్ని చావ బాదుతాడా ? వాడు మనిషైతే కదూ—అనుకున్నాడు.

వాస్తవానికి సుజాతంటే భయభక్తు లున్నాయి సారధికి. తను బతికుండగా ఆమె మీద ఈగ కూడా వాలనివ్వడు. కానీ నేడు వూహించని విధంగా ఆమె దర్శన మిచ్చింది. కళ్ళు ఏడ్చి ఏడ్చి వాచిపోయాయి. బుగ్గలమీద వాత లింకా మాసిపోలేదు. మోహాన బొట్టు లేని చెల్లాయి రూపాన్ని తల్చుకున్నప్పుడల్లా అతని నరనరాల్లో కోపావేశాలకి అవధు ల్లేకపోతున్నాయి. కర్తవ్యం కోసం ఆలోచిస్తోంది మనస్సు. చెల్లాయికి జరిగిన పరాభవాన్ని తల్చుకుని నిట్టూరుస్తోంది హృదయం. ప్రతిక్రియ చేయడానికి అత్తగారింటి కెళ్ళాలంటే అభిమానం అడ్డుపడుతోంది. ఉద్రేకంతో పొంగు లెత్తుతూన్న రక్తం—ఒక



ప్రతిక్రియ

నిశ్చయానికి రాలేకపోతున్న ఆలోచనలు బుర్రని వేడెక్కిస్తున్నాయి.

ఉదయం పదివ్వరయింది. సరాసరి కాలేజి కెళ్ళాడు సారథి. 'స్టాప్ రూం' లో సిగరెట్టు కాలుస్తూ ఎవరితోనో మాటాడుతోన్న వర్మ బావని చూసి ఆశ్చర్యచకితు డయ్యాడు. క్షణం సేపు బుర్ర పనిచేయటం మానుకుంది.

'ఇల్లా రావోయ్ వర్మ'—పిల్చాడు సారథి.

తాగొచ్చాడేమోనని భయపడ్డాడు వర్మ. తన బావగారు ఎలాంటి వ్యక్తయిందీ కాలేజీ విద్యార్థుల కంతా తెల్సు. తన గౌరవాన్ని కాపాడమని కోటి దేవుళ్ళకు మొక్కుకున్నాడు, తప్పనిసరిగా లేచి వెళ్ళాడు.

'క్లాసు లేదా ?'

'ఉంటే ఇక్కడెందు కుంటాను ?'

'అయితే కాంటీన్ కెళ్దాం రా.'

కాంటీన్‌లో వో మూల కూర్చున్నా రిద్దరూ.

'కాఫీ తీసుకుందామా ? ఊ—'అడిగాడు సారథి.

'నే నిప్పుడే తాగాను. నువ్వు తీసుకో.'

'అవున్లే—పశువులకి కాఫీ సహించదు.'

'కొన్ని పశువులకి కాఫీ కంటే సారాయి బహు ఇష్టం.'

'వర్మా !'

'కాకపోతే ఏమిటోయ్ నువ్వనేది ?''

'మనిషైతే అలా సుజీని కొట్టాడా ?'

'మనిషి కానివాడితో వియ్యం పొందినవా రేమవుతారో ? చూడు బావ. మా చెల్లాయి కాబట్టి నువ్వు పెట్టే హింసలకి వోర్చుకుంటూ జీవచ్ఛవంలా బతుక తోంది. మరొకరైతే విడాకులిచ్చి మరో పెళ్ళి హాయిగా చేసుకొనేవారు.'

'పోనీ అదే చేయించలేకపోయావ్ ?'

'చెప్పేవాడు చేసి చూపెడితే తక్కినవారు తప్పక వాడ్ని అనుసరిస్తారు.'

'అంటే.'

'ముందు సుజీతో తెగతెంపులు చేసుకుంటాను.'

'ఇక్కడ నీ ఆటలు సాగనిస్తా ననుకున్నావా ?'

'నువ్వు సాగనిచ్చే దేమిటి ? కోర్టువాళ్ళు అంతా చేసుకుపోతారు. నాల్గక్షరాలు రాసి పడేస్తే.'

కోపం మటు మాయమైంది. రక్తం చల్లబడింది. కొన్ని క్షణాలు నోరు మెదపలేకపోయాడు సారథి.

'అది నీకేం చేసిందని దాన్ని అన్యాయంలో ముంచటం'—చివర కన్నా డలా.

'మా చెల్లాయి నీ కేం చేసిందని—దాన్నలా చిత్రవధ చేస్తున్నావ్.'

'కోర్టు కెక్కితే నల్గురూ నవ్విపోతార్రా వర్మా.'

'ఇప్పుడు మాత్రం నవ్వటం లేదనా నీ ఉద్దేశం. ఇంతవరకూ నిన్ను గూర్చి అందరూ చెప్పుకుంటున్నారు. ఇహ నేనా పని చేసింతర్వాత నుంచి నన్నూ నల్గురూ అనుకుంటారు. ఒకర్ని మించినవా రొకరిని లోకం దృష్టిలో పడ్తాం. ఏం? ఇందులో తప్పేముంది ?'

కొన్ని నిముషాలు నిశ్శబ్దం. "లేదా మర్యాదగా నీవు మసల్తూ, మహతిని బాధించకుండా ఉంటానని మాటిచ్చి—అన్నమాట నిలబెట్టుకున్నాడు నేను సుజీని తప్పక స్వీకరిస్తాను" అన్నాడు వర్మ మళ్ళా.

"నీ నిశ్చయానికి తిరుగు లేదంటావా ?"

"మనుషుల మనస్తత్వాలు మారిపోతే నా నిశ్చయానికి మార్పురాక మానదు."

'అంతేనా.'

'అంతే.'

వస్తుతః వర్మ పిరికివాడని సారథికి తెల్సు. కానీ వాడిలో ఆ మొండి ధైర్యం ఎవరు నూరిపోశారో వూహించలేకపోయాడు. సాయంకాలం కాలేజీ వదిలాక నాలుగు తన్ని వదిలిపెడ్తే దారిలోకి వస్తాడన్న ఆశతో లేచిపోయాడు సారథి.

'నిండా మునిగిన వానికి చలేమిటి ?'—అన్న సారథి మాటలు విన్పించాయి. ఆ మరుక్షణమే అతను కనుమరు గయాడు. వర్మ బరువుగా నిట్టూర్చి, 'తమదాకా వస్తే కానీ తెలియ దన్నారు పెద్దలు' గొణిగాడు.

సారథి అన్నంత పని చేశాడు. కాలేజీ వాతావరణం దాటాక రోడ్డుమీద నిండిన విద్యార్థుల మధ్యలో వెళ్తున్న వర్మని తల చిట్లిపోయేట్టు కొట్టాడు—వెనుక నుంచి.

'బాటనీ లెక్చరర్—వర్మగారు—పడిపోయార్—ఎవరో రెండు వేడి ఇడ్లీలు చెట్నీ తినిపించారహోయ్'' పిల్లల కేకలు అస్పష్టంగా విన బడ్డాయి వర్మకి. తర్వాత తెలివి తప్పిపోయాడు.

సైకిల్ రిక్షాలో ఇల్లు చేర్చారు వర్మని. ఎవరు కొట్టారో విద్యార్థుల కెవ్వరికీ తెలియదు. అందులో వర్మంటే ప్రతి ఒక్కడికీ భయభక్తులున్నాయి. ఆయన క్లాసులో గోల చేయడానికూడా బెదరుతారు. వాళ్ళే డాక్టర్ని తీసుకొచ్చారు. కట్టు కట్టి, విశ్రాంతి చాలా అవసరమంటూ వెళ్ళా డాయన.

ఇంట్లోవాళ్ళ కంగారుకి దరిదాపుల్లేవు. రంగారావు కేం పాలుపోక కుర్చీలో చతికిల పడ్డాడు. సత్తెమ్మ వర్మకి చేరువలో నేలమీద కూర్చొని విసురుతోంది. మధ్యమధ్య నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ తనలో తా నేదో గొణుక్కుంటూంది. మహతి ఎండిన మోడులా—శిలాప్రతిమలా నిల్చుని అంతా గమనిస్తోంది.

అన్నా—వదినెల దాంపత్యం చూసి అందరూ సంబరపడేవాళ్ళు. అలాంటిది తనొచ్చి ఇద్దరి మధ్య పోట్లాటలు పెట్టింది. చినికి చినికి వర్షమైంది. ఆఖరికి ఇంట్లోంచి వెళ్ళగొట్టాడు వదినెని. దీని కంతా కారకు లెవరు ?

కాలేజీ పిల్ల లెవరూ కొట్టలేదుట. మరి, ఆయన చేసిఉంటా డీ పని. కాకపోతే అన్నయ్యన్ని కొట్టడానికి తగిన కారణం ఉండొద్దూ ? ముమ్మా

టికీ తన భర్త చేసిన పనే యిది. ఆయన్నలా ప్రేరేపించటానికి కారణం—అన్నయ్య దెబ్బలు తినటానికి కారకు లెవరు ?

అన్ని విధాలా అమ్మ, నాన్నలకి మనశ్శాంతి లేకపోవటానికి కారకు లెవరు ? వాళ్ల మనస్సుల్ని పాడుచేసే పరిస్థితులకి కారకు లెవరు ? క్షణానికో విషమ పరిస్థితిని తెచ్చిపెట్టేవా రెవరు ?

తనే—తనే నిజంగా. మరి తన వల్ల వీళ్లకేం లాభం. కోరి కష్టాల్ని, దుఃఖాల్ని తెచ్చుకోడమేనా ? భర్త త్యజించిన భార్యకి ఆశ్రయ మిచ్చి తమ సంసారాల్ని బుగ్గిపాలు చేసుకుంటా రెందుకు ? తన కోసమా ? తనని కాపాడినందువల్ల వీళ్లకి మంచంటూ లభించలేదేం ? తను పుట్టకనే ఉంటే— తనుండి మాత్రం—తనేం సుఖ పడుతోంది—తనీ సంసారులకి సుఖశాంతుల్ని అందించలేదా ? తనకేం చాతకాదా ? తనేం చెయ్య లేదా ? .... తన చాత కాదగ్గ కార్యం ఒక్కటే—దానివల్ల సుఖ శాంతులతో అందరూ హాయిగా ఉండగలరు. తనకోసం అందరూ త్యాగం చేస్తున్నప్పుడు—తనందరి కోసం త్యాగం చేయుటం సమంజసం కాదా ? దైవం కూడా తనని క్షమించవచ్చు .... తనా పని చేస్తే .... అలా దొర్లిపోతున్న ఆలోచనలతో అవతలి గదిలో కెళ్లింది మహతి.

'నాకు తెల్సు. ఇదంతా అల్లుడి గాడి పనే. ఎప్పుడైతే సుజాతని ఇంట్లోంచి తరిమేశాడో—అప్పుడే అనుకున్నాను .... వీడికి తగ్గ శాస్తి జరుగుతుందిలే అని—అనుకున్నట్టే అయింది. అయినా వాడి చేష్టలకి హద్దంటూ ఉండాలా లేదా ? పోలీసుల కప్పగించి వో నెల కృష్ణజన్మ స్థానానికి పంపాలి వెధవని. ఎట్లాగూ నలుగురి నోళ్లలో నాని పోతున్నామంటా—ఇహ అల్లుణ్ణి కోర్టులో చూసి తృప్తి పడ్తాను.'

'ఛీ. ఏం మాట లండీ అవి. అల్లుడో—గిల్లుడో మనకేం తెలుసు కొట్టింది.' సత్తెమ్మ అంది.

'మంచికి మంచి, మోసానికి మోసం, దగాకి దగా అంతే ! నువ్విలా అన్తమానం నన్నే పని చేయకుండా చవటని చేస్తున్నావ్. చూడు. అన్నంత పని చేస్తాను. నేను ప్లీడర్నని వాడికి తెలియదేమో. వాడు కొట్టించాడని సాక్ష్యం క్షణంలో సృష్టించగల్ను.' రుసరుసలాడుతూ పచార్లు చేస్తున్నాడు రంగారావ్.

వర్మకి బాగా తెల్సు—సారథి మనుషులే కొట్టారని. కానీ ఎందుచేతో నిజం చెప్పలేక పోతున్నాడు. మాట కోసమైనా నాన్న అన్నంతపని చేస్తాడని కూడా తెల్సు. పౌరుషాలు, పగలు మనుషుల కెక్కణ్నుంచి వస్తాయో, ఎలా ఉద్భవిస్తాయో—పాడు మనస్సు అహర్నిశం క్షుద్ర తత్వాల్లోకి దిగజారి పోతుంది. కానీ ఉన్నతమైన ఆశయాల వైపు తొంగిచూడదేం ?

'నాన్నగారు ! బావ కాదు నన్ను కొట్టింది.'

'కాదా ! నువ్వు చూశావా ?'

'చూశాను.'

'ఎవరు ?'

'విద్యార్థులు.'

'నిజంగా ?'

'నిజం.'

క్షణం నిశ్శబ్దం. ఉన్నట్టుండి దావు కేకలు విన్పించాయి లోపలనుంచి. యాంత్రికంగా రంగారావ్, సత్తెమ్మలు పరుగెత్తారు. బాత్ రూంలోంచి కేకలు విన్పిస్తున్నాయి. లోపల గొళ్లెం పెట్టబడింది. కాలుతో రెండు తన్ను తన్నాడు. పెళ్ళున విరుచుకుపడ్డాయి తలుపులు. గప్పున పొగ—మంటలు లేచాయి. మంటల మధ్య మహతి కాలిపోతోంది. దిక్కు తోచక ఎగురుతోంది. కూతుర్నా స్థితిలో చూసిన సత్తెమ్మ మూర్ఛపోయింది.

దిగ్భ్రాంతుడై క్షణకాలం మైలు రాయిలా నిల్చుండి పోయాడు రంగారావ్. బెడ్‌రూంలోంచి చేతి కొచ్చిన వస్త్రి పట్టుకొచ్చి కూతురు వంటికి చుట్టబెట్టాడు. నేలమీద దొర్లాడింది మహతి.

ఈలోగా నెమ్మదిగా నడుచుకుంటూ అక్కడికొచ్చాడు వర్మ. 'ఏం జరిగింది' అంటూ, లోపల దృశ్యాన్ని చూసి విచలితు డయ్యాడు. శరీర మంతా భయంతో వణికిపోయింది. కాళ్లలో శక్తి లేక చతికిల పడ్డాడు.

'నా శ్రాద్ధం జరిగిందోయ్. ఛీ. నిర్భాగ్యపు సంసారం. పాడు మనుష్యులు. చీడపురుగులు. అమ్మాయిని చూస్తుండు. డాక్టర్‌కి ఫోన్‌చేసి వస్తాను' దాదాపు పరుగెత్తాడు రంగారావు.

చెల్లాయి వో వేపు 'అబ్బా—మంటలు—వళ్లంతా మంట'' అని రోదిస్తోంది. మరోవైపు సత్తెమ్మ తెలివితప్పి పడివుండటం చూసి నీరు కారిపోయాడు. ఆ గదిలోని దృశ్యాన్ని, ఆ వ్యక్తుల బాధల్ని, దుఃఖాల్ని వర్ణించ దుస్తరం.

ఏంబులెన్స్‌లో మహతిని హాస్పిటల్ చేర్చారు. మహతి ఆత్మహత్యచేసుకోబోయిందన్న వార్త క్రమంగా చుట్టుపక్కల ప్రాకి సారథి చెవిన కూడా పడింది. వార్త విని నివ్వెరపోయారు సుజాత—వాళ్ల అమ్మా నాన్నలు. ఆమె ఆత్మహత్యకి ఎందుకు పాల్పడిందో సారథికి బుర్ర బద్దలు కొట్టుకున్నా బోధపడింది కాదు. చచ్చి ఏం సాధించా లనుకుంది అన్న ప్రశ్న రాకెట్‌లా దూసుకు పోతోం దతని మనస్సులో. అందరూ తమకి తెలియకుండానే హాస్పిటల్ చేరారు.

తెల్లవారు జామున నాల్గు గంటల సమయం—కళ్లు తెరచిన మహతి చూపులకి .... రంగారావ్, సత్తెమ్మ, వర్మ, సుజాత, తన అత్త మామలు .... వరుసగా కన్పించారు.

'మహతి ! ఇటు చూడు' వో రుద్ధకంఠం పిల్చింది. చూపులు మళ్లించింది. తన భర్త ఎదుటున్నాడు. కన్నీళ్లు కారుస్తున్నాడు. కృంగిపోతున్నాడు బాధతో. దుఃఖం పెల్లుబికి వస్తోంది. ఆపుకోడానికి పెదాల్ని బిగపట్టుకుంటున్నాడు. తర్వాత మహతి మరేం గమనించలేక పోయింది. తల తిరిగి పోతోంది. కళ్లు మూసుకుంది. తెరచింది. మళ్లా మూసుకుంది. మూల్గింది. ప్రపంచమంతా తల్లకిందులై పోతున్నట్టుంది. భర్త చెయ్యి గట్టిగా పట్టుకుంది. రాయి గుండెల మనుషులు ఒక్కోసారి దుఃఖంతో కన్నీళ్లు వదలుతూ ఏడుస్తారని తెలియ దామెకి. తన సుఖం కోసం భార్యని బైటికి గెంటించి నడి వీధిలో తల పగులగొట్టుకున్న అన్నయ్య లోపల ఎంతగా విలపిస్తున్నాడో తెలియ దామెకి. ఎత్తిపొడుపులతో బాధపెట్టి గుండెల నిండా ముళ్ళు గుచ్చిన సుజాత ఇవు డెంతగా పశ్చాత్తాప పడుతుందో తెలియ దామెకి. తల్లిదండ్రుల హృదయాల్లో తన ఈ ఆత్మహత్యాప్రయోగం ఎంతటి అశాంతిని రేకెత్తిస్తున్నదో తెలియ దామెకి. కోడల్ని నానా హింసలు పెట్టి, కొడుకుని వెనకేసుకొచ్చి—ఇప్పుడు కోడలికోసం ఎంతగా పరితపిస్తున్నారో—అత్తమామల మనోభావాల్ని తెల్సుకోలేక పోతోంది.

ఆమెకి తెల్సిందల్లా—తన ఆత్మహత్య, తన త్యాగం, పౌరుషాలతో పేచీలు పడ్డ కుటుంబాలు, విచ్చిపోయిన సంసారాలు, ఒకటి కాబోతున్నాయన్న సంతోషం. తన ఆశయం నెరవేరింది. చనిపోతూ తనో గొప్ప కార్యాన్ని సాధించగల్గింది. అన్న విషయం స్పష్టంగా తెలుసు.

డాక్టరొచ్చాడు—స్టేట్‌మెంటు కోసం. " .... బుద్ధిపూర్వకంగానే కాల్చుకున్నాను. జీవితంమీద రోత కల్గింది. ఇందులో ఎవరి పత్తిడి లేదు. నేనే—నేనే బాధ్యురాల్ని". ఆ మాటలు పల్కటానికే కాబోలు—ఆమె అంతవరకూ శక్తిని కూడగట్టుకు ఉండింది.

బ్రతకలేదు మహతి. బావురుమన్నా రంతా. చేతులు కాలింతర్వాత ఆకులు పట్టుకున్నాడు సారథి. ఈరోజు మహతి లేదు. లేవేలే దతనికి. మహతి మరణం మరో విధంగా సంభవించివుంటే సారథి మనస్సంతగా విలపించేది కాదు. విచిత్రంగా వుందతనికి కంతా. కన్నీళ్లు తుడుచుకుంటూ ఇలా అన్నాడు. "చిన్నప్పుడు తుమ్మెద కన్పిస్తే చాలు—దాని కాళ్లు విరచి, రెక్కలు తుంచి, తోకకి దారం కట్టి గాల్లో ఎగరేస్తూ ఆనందించేవాణ్ని. బుద్ధి తెలిసి కూడా చూస్తూ చూస్తూ నా భార్యని నేనే చంపుకున్నా నిపుడు. చేసిన పాపాలకి ఫలితాన్ని ఇక్కడే ఈ జన్మలోనే అనుభవించాల్సి వస్తుందని ఇవుడివుడే బోధపడ్తోంది .... ఏదిఏమైనా నే నిక తాగుడు మానేశానని మహతి కెలా తెలుస్తుంది .... మహతి కెలా తెలుస్తుంది .... ఎలా తెలుస్తుంది."

పక్కనే నిలబడ్డ నర్సు మహతి మీద తెల్లటి దుప్పటి కప్పింది. ★

బాలిక - మామయ్యా! ఒకపిల్ల ఏనుగుపాలు త్రాగితే రెండు వారాలలో బరువు ఇరవై పౌన్లు పెరిగింది.

మామయ్య- ఏడిసినట్టుంది. అలా ఎన్నటికీ జరగదు. ఇంతకీ ఎవరిపిల్ల ?

బాలిక: ఏనుగ పిల్ల మామయ్యా.

—అవధానము రామగోపాల్
(ప్రొద్దుటూరు)

జూల్స్ వెర్న్ నవల

80 రోజులలో భూప్రదక్షిణం



"ఆయుదాఅపహరణము" అనేఉదంతం వూహించు కొని డిటెక్టివ్ ఫిక్స్ కన్న కలలు, ఫాగ్‌ని సులువుగా అరెస్టు చేయవచ్చునని పెట్టుకున్న ఆశలూ ఒక్కసారిగా పాస్పార్టుతో గోష్ఠిలో తేలిపోవడంతో ఫిక్స్‌కి ఉత్సాహం తగ్గిపోయింది. తరువాత పాస్పార్టుని తరుచు కలుసుకోవడం మానేశాడు. ఫిలియాస్ ఫాగ్‌ని ఏ ఒకటి రెండుసార్లో చూశాడు. అసలు ఫాగ్ తన గదిలో తప్ప హాలులో ఉంటాడు. అయుదాతో కబుర్లు చెబుతూనో, లేదా తనకి రిపాబ్లైన పేకాట ఆడుతూనో కాలక్షేపం చేస్తాడు తప్ప డెక్‌మీదకు రానేరాడు.

పాస్పార్టు, తీరుబాటుగా శ్రద్ధగా ఆలోచించాడు, ఫిక్స్ అనే ఈ ఆసామి ఎవరా అని. ఆలోచించినకొద్దీ ఇతగాడి వరస అతనికి అంతుచిక్కటం లేదు. అంతా వింతగాఉంది. మనిషి చాలా మర్యాదస్తుడు. మంచివాడిలాగే ఉన్నాడు. కాని తాము ఏ వూరు ఏ దేశం వెళ్తే ఆ వూరు, ఆ దేశం వస్తున్నాడు. ఎందుకో తెలీదు. ముందు సూయజులో తటస్థపడ్డాడు. తరువాత 'మంగోలియా' ఓడమీద బొంబాయిలో దిగేటప్పుడు అక్కడే దిగబడతున్నానన్నాడు. మళ్ళీ చూస్తే ఇప్పుడు హాంకాంగ్‌పోయే ఓడలో ప్రత్యక్షం అయ్యాడు. అంతా అక్షరాలా ఫిలియాస్ ఫాగ్ అడుగుజాడల లోనే నడుస్తున్నాడు. ఇదంతా అనుకోకుండా యాదృచ్ఛికంగా జరగడం సాధ్యమా ? ఇందులో ఫిక్స్‌కి ఏదో పని ఉంది. ఆలోచించినకొద్దీ అనుమానాలు పెరుగుతున్నాయి. ఈ ఫిక్స్ హాంకాంగులో కూడా ఆగేలాలేడు. తమతో పాటే మళ్ళీ తయారవుతాడని అతనికి గట్టి అనుమానం పట్టుకుంది. అనుమానంకాదు. నమ్మకం కుదిరింది. కావాలంటే తాను అపురూపంగా దాచుకున్న పాత రక్షలు—కలకత్తాలో రెండు వేల పౌండ్లు ఖర్చు చేయించినవి, పందెం ఒడ్డడానికి సిద్ధంగా ఉన్నాడతను.

అయితే పాస్పార్టు అలా నూరేళ్ళు తపస్సు చేసి తల బద్దలుకొట్టుకున్నా, ఫిక్స్ అనే ఈ ఆసామి పోలీసు డిటెక్టివు అని అతనికి తట్టేఉండేదికాదు. తన యజమాని ఫిలియాస్ ఫాగ్‌ని గజదొంగగా జమకట్టి భూగోళం అంతా వెంటబడి తరుముతున్నాడని పాస్పార్టు ఎన్నటికీ పసిగట్టలేడు. ఐతే పసిగట్టేది నిజం అయినా మానినా, మనసుకి తృప్తి గలిగించేవిధంగా ఏదో ఒక కారణం కనిపెట్టి సర్దిచెప్పుకోవడం మానవనైజం. పాస్పార్టు శాయశక్తులా ఆలోచించి చివరకు ఆపనే చేశాడు. అతనికి ఆ వూహ చాలా నచ్చింది. దాని ప్రకారం ఫిక్స్ నిజంగా డిటెక్టివే. ఎటొచ్చీ అతన్ని ఫాగ్‌తో పందెం వేసిన రిఫారం క్లబ్బు సభ్యులు పంపివుండాలి. ఈ ఫాగ్ నిజంగా భూప్రదక్షిణం చేస్తున్నాడో లేదో అడ్డదారిన వెళ్ళి దగా చేస్తున్నాడో చూడడానికి విని యోగించి ఉండాలి.

"అంతే. అంతే. వాళ్ళే పంపిఉంటారు" అనుకున్నాడు ఉత్సాహంగా గర్వంగా. ఉత్తరక్షణంలో ఉత్సాహంచల్లారి కోపం ముంచుకొచ్చింది. తన యజమాని ఫాగ్ ఎంత మంచివాడు. ఎంత మర్యాదస్తుడు. అలాటి వాడిని పట్టుకుని, అతని మాట మీద గురి ఉంచకుండా, వెనకాల డిటెక్టివ్‌ను పంపిస్తారా ? ఎంత అవమానం, ఎంత అప్రతిష్ఠ ? సరే. అలాగే కానీండి. మీ రోగం కుదుర్తుందిలెండి అనుకున్నాడు నమ్మినబంటు కోపంగా.

ఫిక్స్ సంగతి తెలిసిపోయిందనుకుని సంతోషపడ్డాక, ఇది యజమానికి చెప్పాలా కూడదా అని ఆలోచన వచ్చింది. చెప్పకూడదు. చెబితే ఆయన చాలా నొచ్చుకుంటాడు. అది కాదు పద్ధతి. ఈ ఫిక్స్‌ని ముప్పుతిప్పలూ పెట్టేయ్యాలి. గంటకో రకంగా గడియకోరకంగా కథలల్లి చెప్పేసి, తను ఎక్కడా దొరక్కుండా, అసలు సంగతి కొరుకుడు పడనీకుండా ఖంగారు పెట్టేయ్యాలి అని తీర్మానించుకున్నాడు.

అక్టోబరు 30 బుధవారం మధ్యాహ్నం ఓడ మలాకా సుమత్రాలకు మధ్యఉన్న జలసంధి ప్రవేశించింది. ఎత్తైన పర్వతాలతో, అడవులతో నిండిన చిన్న చిన్న దీవులెన్నో చెల్లా చెదురుగా ఉన్నాయి. మలాకా దీవి వీటి అవతల ఉంది. మర్నాడు తెల్లవారు జామున నాలుగు గంటల వేళ 'రంగూన్' సింగపూర్ రేవులో లంగరు వేసింది—బొగ్గు వేసుకుందుకు. నిర్ణీత కాలమానం ప్రకారం చేరవలసిన వేళకన్న అర్ధరోజు ముందుగా అక్కడికి చేరింది ఓడ.

ఫిలియాస్ ఫాగ్ ఈ వైనం తన పుస్తకంలో రాసుకున్నాడు. కాస్త వ్యవధి ఉంది కాబట్టి అలా నడచి వెళ్ళివద్దామంది అయుదా. ఆమెను వెంట తీసుకుని ఓడ దిగి వెళ్ళాడు ఫాగ్.

ఫాగ్ ఏం చేసినా, చేయకపోయినా అనుమానపడి తన్నుకుంటున్న డిటెక్టివ్ ఫిక్స్, వాళ్ళకి కనబడకుండా తనూ ఓడ దిగి వెంబడించాడు ఎందు

చైనా నుంచిదని. ఏవో సామగ్రులు కొనడానికి బయలుదేరిన పాస్పార్టు ఫిక్స్ తాపత్రయం చూసి నవ్వుకున్నాడు.

సింగపూర్ బ్రహ్మాండమైన ద్వీపంకాదు. చూడడానికి కూడా గుండె కదిలిపోయేంత అద్భుతంగా బ్రహ్మాండంగా ఉండదు. అక్కడ ఆకాశాన్నంటే మహా పర్వతాలులేవు. ఆకాశాన్నంటని చిన్న కొండలు కూడా దండిగా లేవు. అయితే, ఆ దీవి అందాల దీవి. చక్కని బాటలు పరచిన తోటలాంటిది. చూడ ముచ్చటగా ఉంటుంది. ఫిలియాస్ ఫాగ్ తమ షికారుకి బగ్గీ మాట్లాడాడు. మంచి ధాటీ అయిన గుర్రాలను పూన్చారు. బగ్గీ చాలా అందంగా సొగసుగాఉంది. హాలెండ్‌నుంచి దిగుమతి అయిన బండి అది. ఫాగ్ ఆయుదాలు అందులో ఎక్కి తాటి తోపుల మధ్యగా కొంతదూరం వెళ్లారు. దేశం అంతా పచ్చటి చెట్లతో చక్కటి నీడలో చల్లగా అందంగా ఉంది. మిరియాల, లవంగాల చెట్లు పరిమళాలు గుబాళిస్తున్నాయి. యూరప్ దేశాలలో ముళ్లపొదలున్నంత విరివిగా ఇక్కడ ఇవి పెరిగాయి. ఆనందానికి అలంకారంగా కోతి చేష్టలు చేస్తున్న కోతులు దండిగా సందడిగా అటూయిటూ తిరుగుతున్నాయి. పెద్ద పులులు కూడా ఆ అడవుల్లో లేకపోలేదు. ఇంత చిన్న ద్వీపంలో పులుల్ని తిరగనిస్తే ఎలా అని, అన్నిటినీ చంపలేదా అనీ ఆశ్చర్యం కలగవచ్చు. కాని అసలు సంగతి వేరు. అవి మలాకా దీవినుంచి సముద్రానికి అడ్డపడి ఈదుకుని ఈ దీవికి వచ్చేస్తాయి.

రెండు గంటలసేపు షికారుచేసి, నాలుగూ యాదాలాపంగా చూసి, తిరిగి ఊళ్లోకి వచ్చారు ఫాగ్, ఆయుదాలు. పొట్టిగా అట్టపెట్టెలు అమర్చి పెట్టినట్టున్నాయి ఇళ్లన్నీ. ఇళ్ల చుట్టూరా తోటలు మాత్రం కన్నుల విందుగా ఉన్నాయి. మామిడి, అనాస, ఇంకా ప్రపంచంలో ఎన్ని రకాల పళ్లచెట్లున్నాయో అన్నీ ఇక్కడకు తెచ్చి పెంచుతారు.

పది గంటలకి వారిద్దరూ తిరిగి ఓడ ఎక్కారు. అంతసేపూ బండి ఖర్చులు కూడా పెట్టుకు మరీ వెంబడించిన డిటెక్టివ్ ఫిక్స్ కూడా ఉసూరుమంటూ ఓడ చేరుకున్నాడు.

పాస్పార్టు తన పనులు చూసుకుని అంతకు ముందే వచ్చి కూర్చున్నాడు. అతను మామిడి పళ్లు తెచ్చాడు. అవి మామూలు ఆపిల్ పళ్లంతే ఉన్నాయి. పైకి గోధుమ రంగు. లోపల ఎర్రటి ఎరుపు. అందులోపలి తెల్లటి గుజ్జు నోట్లో వేసుకుంటే అట్టే కరిగిపోయేలా వుంటుంది. రుచి అతి మధురం. ఆశగా తినేవాడికి తిన్నకొద్దీ చవులూరుతుంది. ఆయుదా ఆ పళ్లు ఎంతో ఇష్టంగా తింది. పాస్పార్టుకు కృతజ్ఞత తెలిపింది. అతను పొంగిపోయాడు.

పదకొండు గంటలకు 'రంగూన్' నౌక పూటుగా బొగ్గు వేసుకుని లంగరు ఎత్తేసింది. ఇక్కడినుంచి హాంకాంగ్ 1,300 మైళ్ళు. అది చైనా కోస్తాకు ఇవతలగా బ్రిటిష్ హయాంలో ఉన్న ద్వీపం. ఈ ప్రయాణం మహా అయితే ఆరు రోజుల్లో ముగించి హాంకాంగ్ చేరాలని ఫాగ్ సంకల్పం. అది సాధిస్తే నవంబరు 6 వ తేదీన హాంకాంగ్ నుంచి, జపాన్‌లో యోకహోమాకుపోయే ఓడను అందుకోవచ్చు.

'రంగూన్' బొగ్గుతోపాటు, సరుకు కూడా పూటుగా వేసుకుంది. సింగపూర్‌లో జనం కూడా చాలమంది ఎక్కారు—హిందువులు, సింహళీయులు, చైనీయులు, మలయన్‌లు, పోర్చుగీసులు. వీరిలో ఎక్కువ మంది రెండవ తరగతి ప్రయాణీకులు.

ప్రయాణం ఆరంభంలో వాతావరణం అనుకూలం గానే ఉంది. గాలి వాలుగానే వీచింది. కాని పౌర్ణమి దగ్గర పడేసరికి సముద్రానికి పోటు తగిలింది. గాలి ఉండుండి పెనుగాలి వీచసాగింది. అయితే అది ఆగ్నేయంనుంచి రావడంవల్ల ఓడ ప్రయాణానికి అనుకూలంగాఉండి ప్రయాణం మరింత చురుగ్గా సాగడానికి తోడ్పడింది. సాధ్యమైనపుడల్లా కెప్టెన్ తెరచాపలు కూడా ఎత్తిస్తూ వచ్చాడు. అటు ఆవిరి శక్తి, ఇటు గాలిబలం రెండిటినీ ఉపయోగించుకొని ఓడ ధాటీగా వేగంగా ప్రయాణం చేసింది.

అయితే ఆ సముద్రం ధాటికి ఓడ దారుఢ్యానికీ తమకూ లంగరు అందలేదు. సముద్రప్రయాణం వల్ల చాలా మందికి వచ్చే సైత్యపు జబ్బు విజృంభించింది. నిజానికి అందుకు బాధ్యత సముద్రానిది కాదు. ఓడదే. చైనా సముద్రంలో పెనిన్సులర్ కంపెనీ నడిపే నౌకలన్నీ, ఇలాగే ఉంటాయి. వాటి నిర్మాణంలోనే లోపం ఉంది. ఓడకి పూటుగా సరుకువేస్తే ఇది పీకమొయ్య మునిగిపోతుంది. అందువల్ల అది ముందుకు సాగడం—ముఖ్యంగా సముద్రం కాస్త హడావుడిగా ఉన్నప్పుడు, చాలా కష్టము. ఇంపరాట్రిస్, కాంబోజవంటి ఫ్రెంచి నౌకలకు ఇవి ఎందునా దీటుకావు. వాటికి, వాటి ఎత్తు బరువున్న నీరు ఎక్కితేగాని అవి మునగవు. పెనిన్సులర్ కంపెనీవారి రంగూన్, గోల్కొండ, కొరియా వగైరా నౌకలకు వాటి బరువులో ఆరోవంతు వేస్తే చాలు సముద్ర గర్భంలోకి దిగజారిపోతాయి.

ఇటువంటి ఓడలను, వాతావరణం బాగు లేనపుడు చాలా మెలకువతో నడపాలి. ఒక్కొక్కసారి ఇంజను శక్తిని బాగా తగ్గించివేసి బహు నెమ్మదిగా నడపాలి. 'రంగూన్' నౌక కెప్టెన్ కొంతదూరం పాటు అలాగే చేశాడు. ఈ వేగం తగ్గడంచూసి ఫిలియాస్ ఫాగ్ ఏమీ ఆవేగం చెందలేదుగాని, పాస్పార్టు మాత్రం తిక్కతో కోపంతో గంతులు వేశాడు. కెప్టెన్‌ని, ఇంజినీర్‌ని, కంపెనీవారినీ, ఇంకా అడ్డమైన వారినీ ఆడిపోసుకున్నాడు. లండన్ నగరంలోని శావిల్‌రో వీధిలో ఒక యింట్లోని గదిలో తన ఖర్చుమీద ఒక గాస్ బర్నర్ వృధాగా మండుతూఉందన్న తలపు, ఇతను ఇంత మండిపడడానికి ఒక కారణం కావచ్చును.

“హాంకాంగ్ త్వరగా చేరాలని మీరు కంగారు పడుతున్నట్టున్నారు కదూ ?” అన్నాడు డిటెక్టివ్ ఫిక్స్ ఒకరోజున.

“అవును. చాలా తొందర పడుతున్నాం” అన్నాడు పాస్పార్టు.

“మిస్టర్ ఫాగ్, యోకహామా స్టీమరును అందుకోవాలని ఆరాటపడుతున్నట్టున్నారు.అవునంటారా?”

“అవును. బోలెడు కంగారు పడుతున్నారు.”

“అంటే ఈ విడ్డూరం—ఈ భూప్రదక్షిణం నిజమేనని మీరు నమ్ముతున్నారన్నమాట.”

“అక్షరాలా. మీరు ? మీరు నమ్మరా ?”

“నేనా ? నమ్మను”

“మీరు బలే గడుసువారు” అని ఫిక్స్‌కేసిచూసి సన్నగా కన్ను గిలిపి కొంటెగా నవ్వాడు పాస్పార్టు. పాస్పార్టు చాలా గడుసుగా వాడిన “గడుసువాడు” అన్న మాట ఫిక్స్‌ని చాలా తికమకపెట్టి మతి పోగొట్టింది. తన సంగతి ఏమిటో ఈ ఫ్రెంచివాడు పసిగట్టేశాడా? అతనికి ఏమనుకుందుకూ పాలుపోలేదు తన సంగతి తెలిస్తే, ఎలా తెలిసి ఉంటుందో కూడా తట్టలేదు.

మరోసారి పాస్పార్టు మరో తమాషా మాట అనేశాడు. అతనిలోను ఫిక్స్ కార్యక్రమం తెలుసుకోవాలన్న ఆశ కుతూహలం పట్టపగ్గాలు లేకుండా ఉన్నాయి.

“ఏమిటో మనం హాంకాంగ్ చేరాక విడిపోతాం కాబోలు. మాకు మిమ్మల్నివదలి వెళ్ళక తప్పదనుకుంటాను. అవునా?” అన్నాడు.

డిటెక్టిక్ ఫిక్స్ అదరిపడ్డాడు. “ఆ....ఏమో ? అబ్బే ఏం తెలీదు ఇంకా. చెప్పలేం” అన్నాడు తొట్రుపాటు దాచుకుందుకు ప్రయత్నిస్తూ.

“మీరు గనక మా కూడా వస్తే ఎంత సంతోషిస్తామో నే చెప్పలేను” అన్నాడు పాస్పార్టు ఉత్సాహం నటించి. “పెనిన్సులర్ కంపెనీవారి ఏజంటు నడిదారిలో ఆగి దిగడిపోవడమేమిటి. మీరు అసలు బొంబాయిదాకావచ్చి ఆగిపోవాలనుకున్నారా, ఏం జరిగింది. రేపో మాపో చైనాలో కాలు మోపు

జరిగిన కథ

80 రోజులలో భూప్రదక్షిణం సాధ్యమని 20 వేల పౌన్లు పందెం వేసి సేవకుడు పాస్పార్టుతో బయలుదేరుతాడు ఫిలియాస్ ఫాగ్. బాంకు దొంగ ఫాగ్ దొరికాడని, అరెస్టుకు బొంబాయికి వారంటు పంపమనీ లండన్‌కు టెలిగ్రామ్ పంపి, ఫాగ్ వెంట సూయజునుంచి బొంబాయికి చేరతాడు డిటెక్టివ్ ఫిక్స్. కాని వారంటు చేరలేదు. బొంబాయినుంచి కలకత్తాకు రైలుబండిలో ప్రయాణం అవుతాడు ఫాగ్. గోథాల్ వద్ద బండి ఆగిపోగా గత్యంతరం లేక ఏనుగుకొని అలహాబాదు వెళ్తుతారు. దారిలో బలవంతంగా సహగమనానికి పోతూఉన్న అయోదాను రక్షించి ఆమెతో కలకత్తా చేరుకొంటాడు ఫాగ్. అక్కడ వారిని నిలపడానికి ఫిక్స్ చేసిన యత్నం విఫలమైంది. ఫాగ్ ప్రభృతులు 'రంగూన్' ఓడలో పయనం ప్రారంభించారు. ఆ ఓడలోనే ఉన్నాడు ఫిక్స్. ఫాగ్‌ను అరెస్టుచేయడానికి ఛోగట్టా సేకరించాలని పాస్పార్టును చేరదీశాడు.

80 రోజులలో భూ ప్రదక్షిణం

తున్నారు. ఏముంది అమెరికా అక్కడినుంచి ఏమంత దూరంకాదు. అమెరికానుంచి ఒక్క అడుగేస్తే యూరప్ ! ఏముంది ఇందులో'' అన్నాడు.

డిటెక్టివ్ ఫిక్స్ రెప్ప వాల్చకుండా సూటిగా చూశాడు పాస్పారు్త కేసి. వీడికి నిజంగా అంతా తెలుసా ? ఏమీ తెలీదా?.....పాస్పారు్తమాత్రం అమాయకంగా, ఆనందంగా నవ్వుతున్నాడు. ఫిక్స్ కూడా ముందర చిరునవ్వు నవ్వి,మెల్లిగా పాస్పారు్త నవ్వులో శ్రుతి కలపబోయాడు.

పాస్పారు్త అక్కడితో వూరుకోలేదు.

"అయితే మీకు ఇందులో బాగానే గిట్టుబాటవుతుందనుకుంటాను. అవునా?'' అన్నాడు.

"అటూ యిటూ కూడా ఉంటుంది. ఆటుపోటు కూడా తగుల్తాయి. ఈ వృత్తి వ్యవహారాల లాటివి. అయితే ఒకటి. ఈప్రయాణ ఖర్చులన్నీ నేను పెట్టుకోనడం లేదుగా'' అన్నాడు ఫిక్స్ ధుమ ధుమ లాడుతూ.

"ఔనౌను. అంతేమరి. అంతేమరి'' అన్నాడు పాస్పారు్త మరింత కొంటెగా నవ్వుతూ.

అయిష్టాగోష్ఠి చాలించి డిటెక్టివ్ ఫిక్స్, తన గదిలోకి వెళ్ళి ఉసూరుమని కూలబడ్డాడు. మొత్తానికి ఎలాగో అలాగ ఈ ఫ్రెంచివాడు తను డిటెక్టివునని పసిగట్టేశాడు. అక్కడితో ఆగాడా, ఆ సంగతి తన యజమాని ఫాగ్‌కు కూడా చెప్పేశాడా అని ఆలోచన ఫిక్స్‌ని తినేస్తోంది. అసలు ఈ వ్యవహారంలో పాస్పారు్త వాటా ఎంత ? అతనికి ఫాగ్ కథ అంతా తెలిసి ఉంటుందా లేక ఇద్దరూ తోడుదొంగలేనా? వాళ్ళిద్దరికీ తన సంగతి పూర్తిగా తెలిసి ఉంటుందా? తెలిస్తే వాళ్ళు కావాలనే ఆడిస్తున్నారన్నమాట. తప్పించుకుపోగలమని ధీమాగా ఉన్నారన్నమాట. ఇక తను సాధించేదేమీ ఉండదు. ఇంకేముంది. అంతా అయిపోయినట్టే అనుకున్నాడు ఫిక్స్ నిస్పృహతో. మరుక్షణంలో తిరిగి ఆశ. ఏమో ఫాగ్‌కి అసలేమీ తెలీదేమో.

ఫిక్స్‌కి ఏం చెయ్యాలో ఏం చెయ్యకూడదో కూడా తోచలేదు.

చాలాసేపు మధనపడినతరువాత, పాస్పారు్తను మంచి చేసుకుని అతనితో ఉన్నదున్నట్టు చెప్పేసి తన వేపు తిప్పుకోవాలని తీర్మానించుకున్నాడు. హాంకాంగ్ చేరేసరికి అరెస్టు వారెంటు అందకపోయి, ఫాగ్ ఇంగ్లీషు హయాందాటి అవతలికి పోయేపక్షంలో, ఇక పాస్పారు్తకు అసలు సంగతి చెప్పేస్తే సరి. వాళ్ళకి అంతా ముందే తెలిసివుండి, ఇద్దరూ తోడు దొంగలై వుంటే సరేసరి. చెడ్డ వ్యవహారం ఎలాగా చెడుతుంది. అలాకాక, పాస్పారు్త అంతవరకు ఏమీ తెలియక, ఫాగ్ దొంగ అన్న సంగతి తన ద్వారానే తెలిస్తే అప్పుడు హడలిపోయి అతన్ని వదిలేస్తాడు.

పాస్పారు్త, ఫిక్స్‌లు ఇలా ఇద్దరూ చెరో విధంగా ఆలోచిస్తూ, అనుమానిస్తూ మధన పడుతున్నారు. కథా నాయకుడు ఫిలియాస్ ఫాగ్ మటుకు నిశ్చింతగా, దర్జాగా తిని తిరుగుతున్నాడు. అతను ప్రపంచం చుట్టూ పరిభ్రమిస్తున్నాడు. అతని చుట్టూ తిరుగుతున్న ఉపగ్రహాల బెడద అతనికేమీలేదు. అవి అతని దగ్గరగా రాలేకపోతున్నాయి.

నిజానికి అతన్ని కలతపెట్టతగినది—ఖగోళ శాస్త్ర పరిభాషలో చెప్పుకోవాలంటే, ఒక తార, దగ్గరలోనే ఉంది. ఆ తార—అయుదా, ఈ పెద్ద మనిషి హృదయంలో అటువంటి అఘాయిత్యం ఏమీ చెయ్యలేకపోయింది. పాస్పారు్త ఇది గమనించి అబ్బురపడిపోయాడు. పాస్పారు్తలాటి ఫ్రెంచి వాడికి కనబడనంత సున్నితంగా సూక్ష్మంగా ఈ ఫాగ్ హృదయంలో ఆనెలతవల్ల కలల లాటివి కలిగినా, ఆ కెరటాలను, వాటి తీరు తెన్నులను పసిగట్టి పట్టుకోవడం చాలా కష్టం.

ముఖ్యంగా అనుదినం, దినంలో క్షణ క్షణం ఫాగ్‌పట్ల కృతజ్ఞతను ప్రసరించే అయుదా కళ్లను చూసినపుడల్లా ఆ కళ్ల ఇంద్రజాలం ఫాగ్‌ని ఏమీ చెయ్యలేకపోతోందే అని పాస్పారు్త ఆశ్చర్యపడేవాడు. అనుదినం, దినంలో క్షణ క్షణం ఫిలియాస్ ఫాగ్‌ది. సాహసోపేతమైన హృదయం అయితే కావచ్చు. అలాటిది ఉంటే ఉండవచ్చు. కాని ప్రేమ, శృంగారం వీటికి అందులో చోటున్నట్టులేదు. ఇతను ఆ తరహా మనిషికాడు.

ఇదేకాదు. ఈ ప్రయాణం ఎక్కడ బెడిస్తే ఏమయిపోతుందన్న బెంగ కూడా ఫాగ్‌లో ఏ కోశానా కనబడడంలేదు. అతనికి ఏ బెంగా ఉన్నట్టు లేదు.

ఉన్న బెంగలన్నీ పాస్పారు్త బుర్రలో కిటకిటలాడుతున్నాయి. ఓడ త్వరగా పోదేమన్న ఆత్రుత కొద్దీ అతను ఒక్కొక్కసారి ఇంజను గది దగ్గరకు వెళ్తాడు. ఉండుండి అది ఉధృతంగా కొట్టుకుని జోరుగా తిరగబోతుంది. ఆవిరి గొట్టాలకు బిగించిన మరకాస్త ఆ వూపుతో వూడి అవతలపడుతుంది. అది చూసి పాస్పారు్త ఎగిరి పడతాడు బక్కకోపంతో.

"ఛ ఛ. ఏదీ గట్టిగా బిగించి చావరు. ఆవిరి గట్టిగా దట్టించరు. ఈ యింగ్లీషు జనమే అంత. ఇదే గనక అమెరికన్ ఓడ అయితేనా, బిగింపు దెబ్బకి పేలిపోతేపోయిందేమోగాని, ఇంతకన్న చురుగ్గా నడుస్తుంది ఓడ'' అని అరిచేవాడు జనాంతికంగా.

(ఇంకా ఉంది)


డ్రాయింగ్ టీచరు-ఏనుగు బొమ్మ వేయండిరా పిల్లలూ.

ఒకవిద్యార్థి - పుస్తకం పట్టదండీ.

—కె. విజయకుమార్ రాజా
(రాజమండ్రి)

అతే సు..

దేవు హరిసర్వోత్తమరావు





త్రలుపు నెట్టింది. చంకను బిందె పెట్టుకుని లోపలి కడుగు పెట్టింది తను. పిన్ని వాకిలిచిమ్ముతోంది. "ఏమే యింకా నీళ్ళు పూర్తిగాలా ? యింకా యెప్పుడిటే ? గంటకో బిందె తెస్తున్నావ్ ?"

"అదికాదు పిన్నీ ! పంపుదగ్గర యివాళ ఒకటే జనం. ఒక్కళ్ళూ పట్టనిస్తేనా ? వంతొచ్చేప్పటి కాలస్యం అయింది" అన్నది తను నడచిపోతూ.

"సరే. యిక పొయ్యి రాజెయ్యి" అంది పిన్ని.

లోపలకెళ్ళి బిందెదించి గబగబా కట్టె పుల్లలు తీసుకువచ్చింది. నాలుగు పుల్లలు పొయ్యిలోనెట్టి కిరసనాయిలుపోసి వెలిగించింది తను. పొయ్యి రాజుతూంటే వూదుతూ కూచుంది. పొయ్యి మీద ఎసరెక్కించింది. గబగబా మండుతున్న పొయ్యికి ఎసరు బాగా కాగింది. బియ్యం పోసింది తను. కూచోబోతుంటే ముందు వరండాలోంచి బూట్ల అడుగుల చప్పుడు వినిపించింది.

తలయెత్తి చూచింది కిటికీలోనుండి తనూ. చిన్న చేతి సంచితో ఒక యువకుడు ప్రవేశిస్తున్నాడు. తనని అతనూ చూశాడు. సంచి అక్కడపెట్టి 'అత్తయ్యా ! అత్తయ్యా !' అంటూ వంటింటిలోకే వచ్చేస్తున్నాడు.

తను సిగ్గుపడిపోయింది. 'పిన్నికి మేనల్లుడవుతాడు గావును' అని అనుకుంది తను. అక్కడుండ కూడ దిక. అతను హాలులోనుండి చిన్న గదిలోకి వెళ్ళాడు. అక్కడతే దత్తయ్య. దొడ్లోకి గబగబా తన పాదాలు సాగిపోయినవి. వెనుదిరిగి చూస్తూ పిడకలగూడు సగ్గర కట్టెపుల్లలు సర్దుతూ, చిన్నవి దన్ను పుల్లలు ఏరుతున్నట్లు నటించింది.

అతను

> సంతోషభారంతో ఆమె గ్లాసక్కడ పెట్టబోయింది. అతను చెయ్యిజాపాడు. నెమ్మదిగా తన చెయ్యి సాగిపోయింది. అతని వ్రేళ్లు తన వ్రేళ్ళని స్పర్శించటంతో, విద్యుల్లతవలె, తలిరాకు జొంపం మాదిరిగా కంపించి వెలవెలపోయింది. ఆమెకు చిరునవ్వు వచ్చిందాసమయంలో. కాని సిగ్గుతో చచ్చిపోయింది.
>
> ఆమె హృదయంలో ఎక్కడో మారుమూల మూసివేయబడిన కవాటాలు ఒక్కసారిగా తెరుచుకున్నాయి.

"అత్తయ్యా! అత్తయ్యా!" అనే పిలుపు వంటింటిలోనుండి దొడ్లోకూడా వస్తోంది. అంటే అతను యిక్కడికూడా అనుసరించి వస్తున్నాడు. తలఎత్తింది-తను.

అంత పొడగరికాదు. సామాన్యం ఎత్తు. అందమైన నాసిక. ఎర్రనయిన వికసించిన ముఖం. ప్రయాణపు బడలిక అతని ముఖంమీద కనుపించింది చిరుచెమటల రూపంలో. ముకుళించుకుపోయింది తను. చూపులు కిందికి దించేసుకుంది.

నెమ్మదిగా అతని అడుగు వెనక్కి తిరిగింది. కాని ఆ తిరుగుడులో తిరిగి వెళ్ళాలనిలేనట్టుగా ఏదో పట్టి ఆపినట్టుగా వుందా కదలిక. అంటే తన్నే చూస్తున్నాడు. ఆ బూట్సు తడబడుతూ ఒకదానికొకటి గుద్దుకుంటున్నాయి. ముందుకు సాగుదామని ఒకటి, సాగలేక మరోటి కలిసి కదలినాయి. తొట్రుపడిందతని నడక. ఒక ప్రక్కకు తిరిగి కదలిపోయినాయి ఆ రెండు బూట్సు. అలా కదులుతుంటే వెనక్కి తిరిగి చూస్తున్నాడా తనని అనిపించింది. ఆపదధ్వని దూరమయిన ఒక క్షణంవరకు తను తలెత్తలేకపోయింది.

ప్రపంచంలో తానొక దుర్బల, నిస్సహాయ జీవి. తండ్రి చిన్నతనంలో తన రెండేళ్ళప్పుడే పోయాడు. తానొక అనాధ అయింది. తల్లి కష్టపడి పుట్టింటివారికి, అత్తింటివారికి భారం కాకుండా రెక్కలు కష్టంజేసి పోషించింది. అమ్మ శ్రమ జీవి!—అమ్మ విషయం జ్ఞాపకానికొస్తే హృదయం రోదిస్తుంది తనకు. వంటరిగ యీ ప్రపంచంలో వదలివేసి ఆరు నెల్లయింది. చనిపోతూ చివరికి నారాయణమ్మ పిన్ని చేతిలో వదిలి పెట్టింది అమ్మ. జీవితాంతం నారాయణమ్మను నమ్ముకుని ఆమెకు తన భారాన్ని వప్పగించింది అని అనుకుంటూ కళ్ళెపుల్లలు తీసుకెళ్ళి పొయ్యిలో వేసింది. పొయ్యి చిటచిటా మండింది. కూరలు కిందికి ఒలిచి, కత్తిపీట ముందేసు క్కూచుంది. వంకాయల్ని తరగటం మొదలు పెట్టింది.

కాని పిన్నికి ముఖ్యంగా అవివాహిత గా బట్టి పెద్ద భారంతో కూడిన కంటకమయిపోయింది తను. మొదట్లో తల్లిపోయిన అనాధనని ఆదరించింది. కాని రోజులు గడచినకొద్దీ ఆమెలో భారంతోబాటూ భయం ఆవేశించింది. బాధించ మొదలు పెట్టింది. యింటెడి చాకిరీచేసి అలసిపోయిన తనకు రాత్రి పన్నెండయినా విశ్రాంతి దొరక్కుండా పోయేది. తెల్లవారితే మళ్ళీ రోజు మొదలు! యింటిపనులన్నీ చేయటంలో బాధ లేదు. అన్నీ చేస్తుంది. కాని ప్రతిఫలంగా ఆమె ప్రేమ కటాక్షవీక్షణం మాత్రం కావాలి! కాని నారాయణమ్మనిర్దయ తనయందుజాలిచూపటం లేదు. పిన్ని మంచిదే. కాని మారిపోయింది! లేకపోతే తనే ఆమె కూతుర్నైతే యింతింత పనులు చేయనిస్తుందా? యింటికొచ్చిన కూతురికేనాడూ ఒక్క పనీ చెప్పకుండా అన్నీ తనే చేసుకునే దంతక్రముందు. కాని యిప్పుడు తను వచ్చింతర్వాత అన్ని బాధ్యతలు తన నెత్తిమీద పెట్టింది.' వుల్లిపాయలు తరుగుతుంటే, మనసులో మంట రగులుతుంటే కళ్ళలోనుండి నీళ్ళు కారినాయి. కళ్ళు తుడుచుకుందామనుకుంటే, కళ్ళు మరింత మండిపోయినాయి.

వచ్చిన అక్కయ్యల పిల్లలు, పాలేళ్ళకు మొదలు బావలవరకూ అందరికీ అన్నీ నవరించాలి. ఎవరికేది కావాలంటే అది చేసి పెట్టాలి. "పిల్లలేడుస్తున్నారు. కొంచెం యివాళ పాలకోవా చేసిమ్మం" టుంది—పెద్దక్కయ్య చంద్రావతి. యిక, ఆ పిల్లలు యిల్లంతా ఆగడంచేసి అన్ని వస్తువుల్నీ అటు యిటూ సర్ది పాడు చేస్తుంటారు. మళ్ళీ అవన్నీ సర్దాలి తను. అప్పుడప్పుడు చేయలేక మనసులో బాధ కలుగుతుంది. అప్పుడనుకుంటుంది తను. "అమ్మా! యీ లోకంలో యీలా నన్నొంటిగా చేయకపోతే నన్ను కూడా నీవెంట తీసుకుపోలేక పోయావూ!" అని. యీ విధంగా తనలో తాను ఏడ్చి వూరుకుంటుంది.

కాని రంగబాబాయి చాలా మంచివాడు. తనకు పెళ్లికాకపోవటం మరింత భారమయిపోయింది— అందుకే బాబాయి అప్పుడప్పుడు దిగులు పడుతుంటాడు. తానిలా భారమయినందుకు కాదుగానీ, తల్లిలేనిదై నా అన్నవాళ్ళులేని అనాధనని ఆయనకి కరుణ! తాను జీవితాంతం ఆయన ప్రేమకు కృతజ్ఞురాలు! ప్రపంచంలో అన్నిటికన్నామించిన ఆత్మశాంతిని, మహదానందాన్ని నిస్సంశయంగా సంతృప్తిని ప్రసాదిస్తుంది ప్రేమ! అని యింకా యేమేమో ఆలోచించింది తను. కూరలు తరగటం పూర్తి అయింది. వంకాయ ముక్కలు నీళ్లల్లో అటు యిటూ కదిపి నీళ్ళల్లో చేతికయిన ఉల్లిపాయకారం ఘాటుని వదలించుకుంది. కత్తిపీట కసని గుడ్డతో తుడిచివేసింది.

ముందు గదిలో పెద్దగా మాటలు వినిపిస్తూంటే వంటింటి గది కిటికీలోనుండి చూసింది. యిద్దరు పెద్దవాళ్ళు కూచుని వున్నారు. పిన్ని అక్కడేవుంది. అందులో ఒకాయన్ని తానెప్పుడో చూసింది. ఒకసారి, అమ్మ బతికివుండగా యింటికి వచ్చాడాయన. ఆయన బుర్రమీసాలు, జరీకండువా, సిల్కు లాల్చీ, గ్లాస్కో పంచె, - వుంగరాల జుత్తు అదే! ఆయనెవరూ?....అమ్మేదో చెప్పిందే? ఆ... ఆయన లక్ష్మయ్య మామయ్య!

వాళ్ళమాట లర్థం గాలేదు తనకు. ఇంతలో యిందాక తను చూసిన ఆ అబ్బాయి కూడా అక్కడకు వచ్చాడు బయటనుంచి. అతనివెంట యింకో కుర్రాడు కూడా ఉన్నా డీసారి! అతన్నిదివరలో చూచింది తను. ఎక్కడ? మొన్న చెరువు గట్టున బట్టలుతుకుతుంటే స్నానం చేయటానికి వచ్చాడు. సుశీల చెప్పింది. "రాజారావుగారి అబ్బాయి రామారావు బి. ఏ. పట్నంలో చదివాడు." అయితే రామారావు యితని స్నేహితుడన్న మాట!

ఇంతలో ఎసరు పొంగి పొయ్యిలోపడి సుయ్యిమంది. అన్నం పొంగుతుంది! గబగబా మూతతీసి కలిపింది. నాలుగు మెతుకులు గంటెతో ఎత్తి నొక్కిచూచింది. వెంటనే మసిగుడ్డ తీసుకుంది తను. నెమ్మదిగా అన్నందించి, పొయ్యిమీద తపాళ వేసింది. గట్టుమీదపెట్టి అన్నంవార్చింది. వార్చు పడిపోకుండా చిన్న రాచ్చిప్ప మూత అడ్డం పెట్టింది. తపాళలో నూనె వేసింది. తాలింపు గింజలు వేసింది. కొంచెంవేగిం తర్వాత ఉల్లిపాయ ముక్కలు వేసింది. అటు యిటు కదిపింది. వంకాయ ముక్కల్నివేసి మూత పెట్టింది తను.

పిన్ని లోపలికొచ్చి "ఒసేవ్ అమ్మాయీ! చుట్టాలొచ్చారు. యింకో నాలుగు డబ్బాలు పొయ్యిమీద పెట్టు. పులిహోర చేద్దాం" అంది. "అలాగే పిన్నీ" అంది తను.

బియ్యంకోసం గదిలోకి వచ్చింది. మంచం పక్కన బియ్యపు బస్తా వుంది. అక్కడ కిటికీ దగ్గరనుంచుని తల దువ్వుకుంటున్నాడతను! మళ్ళీ పిన్ని వెళ్ళిపోయింది. వాళ్ళు మాటలాడుకుంటుంటే. అసలెందుకు వచ్చారో? అతనెవరు? యీ వివరాలన్నీ అర్థం కాలేదు తనకి. యిప్పుడిక్కడ ముస్తాబై కురులు సవరించుకుంటున్నాడు!

నిగనిగలాడుతున్నా యతని కురులు. బూటు వేసుకునే వున్నాడు. బాబాయి యింట్లోకి వచ్చేటప్పుడు బయటే చెప్పులు వదలి లోపలికి వస్తాడు. కాని యితను బూట్సు యింట్లో కూడా వేసుకున్నాడు! చదువుకున్న వాళ్ళు గదూ!

ఇంతలో 'ప్రసాద్!' అన్న పిలుపు వినిపించింది. దువ్వెనక్కడపెట్టి 'వస్తున్నా' అంటూ సమాధానం యిచ్చి వెనక్కి తిరిగాడు. అడుగు విసురుగా పడింది. ఆగిపోయింది ఆ బూటు సందేహంతో తన్ను

దీర్ఘంగా పరిశీలించుతోందనుకుంది. తత్తరలో పాదం కదలక నిలబడిపోయింది తను.

గొంతు సవరించుకుంటూ, 'కొంచెం మంచి నీళ్ళిస్తారా ?' అని అడిగా డతను. నిజంగా గొంతెండిపోయిందనిపించింది తనకు.

తల వంగిపోయి పరుగునపోయి వంటింటిలో పడింది తను. గుండె దడదడలాడింది. అతన్ని సరిగా కూడా చూడలేకపోయింది తను. అతన్ని చూస్తే ఎందుకంత భయం తనకు ? సిగ్గు ! సిగ్గా ? ఛా ! దేనికి ? అతను అందంగా ఉన్నాడు ! వుంటే ? బియ్యానికి వెళ్ళిందిగాని అతనక్కడున్నాడని ముందుగాచూస్తే అడుగుపడేదేగాదు అని ఆలోచనల్లో మునిగిపోయింది తను. 'అతను మంచినీళ్ళడిగాడు కదూ !' అంటూ గ్లాసు తీసుకుని ముంచింది బిందెలో. ఇక తీసుకువెళ్ళివ్వాలి ! అడుగాగిపోయింది. మనస్సెందుకో ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బయిపోతోంది.

నెమ్మదిగా అడుగులు ముందుకు సాగినాయి. అడుగు ముందుకుపడుతుంటే హృదయం తల్లడిల్లుతోంది. సంతోష భారంతో గ్లాసక్కడ పెట్టబోయింది. అతను చెయ్యి జాపాడు. నెమ్మదిగా తన చెయ్యి సాగిపోయింది. అతని వ్రేళ్ళుతన వ్రేళ్ళని స్పృశించటంతోవిద్యుల్లతవలె,తలిరాకుజొంపం మాదిరిగా కంపించి వెలవెలపోయింది. నీళ్ళు క్రిందికి తుళ్ళి అతని బూటుమీద తన పాదాలమీదపడింది. ఒక ప్రక్కగా మంచాని కానుకుని ముడుచుకుపోయింది తను. చూపులు నేలమీద అతని పాదాల చెంత నిలచిపోయినాయి. అవి అటు యిటు అక్కడే కదిలినాయి. గడగడమంటూ త్రాగిన శబ్దం చెవుల్లో మారుమ్రోగింది తనకు. చిరునవ్వు వచ్చిం దాసమయంలో. కాని సిగ్గుతో చచ్చిపోయింది ! ఒకడుగు ముందుకు వేసిం దాబూటు ! తన గుండె దడదడలాడింది. మళ్ళీ నెమ్మదిగా తప్పుకుని దగ్గరగా వెళ్ళిపోయిందా పాదం శబ్దం ఎక్కువ చేయకుండా. ఆ ధ్వని తన హృదయంలో ఎక్కడో మారుమూల మూసి వేయబడి యింతవరకు తెరువబడనటువంటి కవాటాలను ఒక్క త్రోపుతోసినాయి ! ఆ కవాటాలు విరిగిపోయినా యనిపించింది !

ఆ ధ్వని విని తన పాదాలు కూడా అటు సాగిపోతుంటే వాటిని బలవంతంమీద ఆపి ఆశ్చర్యంగా వెళ్ళి పోతున్న అతని వంక చూసింది తను. అతను వెళ్తూ వెనక్కు చూశాడు. తను చూసిందతని చూపులో. కాని చూపులు కిందికి దిగిపోయినాయి తనకు. చూడలేకపోయింది !

వాళ్ళంతా వెళ్ళిపోయారు చకచకా. ఇంతలో నారాయణమ్మ పిన్ని ఆలోచనతో వెళ్తున్న వారి వంక చూస్తున్న తన వంక వింతగా చూసింది ! గబగబా గదిలోకి వెళ్ళి బియ్యంతీసి పోసుకుంది చాటలో తను. వంటింటిలోకి వెళ్ళిపోయింది. గబగబా మూతతీసి కూర కలిపింది. నెమ్మదిగా గుడ్డతో తీసి కుదిపింది. మళ్ళీ పొయ్యి బెట్టింది కూర. బియ్యం ఏరటం మొదలు బెట్టింది. పిన్ని లోపలికి వచ్చింది. గ్లాసుతో మంచినీళ్ళు ముంచుకుంది.

"వచ్చిన వాళ్ళు నీకు తెలుసుటే ?" అని అడిగింది.

"తెలీదు. ఎవరు ?"

"నీకు తెలియదుటే లక్ష్మయ్య మామయ్య ! ఆ వచ్చినబ్బాయి వాళ్ళబ్బాయి ప్రసాద్. అయితే ప్రసాద్‌ని నువ్వెప్పుడూ చూడలేదనుకుంటాను. బి. ఏ. చదివాడు పట్నంలో. రాజారావుగారి అబ్బాయి రామం యిద్దరూ కలిసి చదువుకున్నారు. మన పురుషోత్తంగారి అమ్మాయి హేమను చూట్టాని కెళ్ళారు వాళ్ళిప్పుడు" అని గ్లాసక్కడ తపేమనిపెట్టి వెళ్ళిపోయింది.

"అదృష్టవంతురాలు !" అంది తను తలవంచుకుని. ఆ మాటలో కొద్దిగా రుద్ధత వినిపించింది. మనస్సెందుకో 'అతను హేమను చూట్టానికి వెళ్ళాడు' అని చిన్న దగ్గరనుండి కృంగిపోయింది. తన కటువంటి శుభ ఘడియ ఎపుడో ? తన జీవితానికి ఎటువంటి విధి యింకా వ్రాసి పెట్టి వుందో ? తనకా అటువంటివాడు లభించేది ? అతను చదువుకున్నవాడు. విజ్ఞానంతో, వైభవంతో వెలుగుతున్నాడు. అందం ఉంది. అటువంటతనికి తనా....? హృదయం మరింత క్షోభించిపోయింది తనకి.

ఇంటి పని ముఖ్యంగా వంట యింది! యీలోగా హృదయంలో మరింత భారం పేరుకుంది. వెళ్ళిన పెళ్ళివారు ఒంటి గంటయింతర్వాత వచ్చారు. ముఖాలన్నీ ఎండకి వాడిపోయి ఉన్నాయి. వచ్చిన పెద్ద మనుషుల్ని ముందు భోజనానికి లేపింది పిన్ని. ఇక వడ్డించాలి వాళ్ళందరికీ. అతనిముందు వడ్డించటానికి తనకి చచ్చినంత పని ! 'మరి తప్పదు' అని అనుకుందప్పుడు.

అలానే అన్నీ అమర్చటం పూర్తయింది. భోంచేయటానికి కూచున్నారు. గుమ్మంలో నుంచుంది తను. పిన్ని అంది. "నే నొడ్డిస్తానులే మరచిపోయాము. అప్పడాలూ వేయించు కాస్త !"

"వేయించాను పిన్నీ !" అంది తను వంటింటిలోనుండే.

ఒక్కొక్కటే వడ్డించింది పిన్ని. వడ్డిస్తూ అడిగింది. "అన్నయ్యా ! పిల్లెలా వుంది ?" ఆ ప్రశ్న విన్నప్పుడు అతని నోటివెంటనుండి ఎటువంటి పలుకు వస్తుందా అని ఆలోచనతో తన హృదయం మరింత ఆరాట పడింది. "అతనికి నచ్చిందేమో !"

ఆయనన్నాడు. "మీ అల్లుణ్ణి నువ్వే అడగాలి. వాడు మాకేం చెప్పేట్టులేడు !"

"పోనీ, ఆ రామంతో ఏమయినా చెప్పాడేమో!" అని అంది పిన్ని.

"రామమా ? వాడొక వింత వ్యక్తి ! అంత వరకువున్న వాడుండి పెళ్ళి వాళ్ళింటి దగ్గరకెళ్ళే సరికి అమాంతంగా యేదో పనుందని చెప్పి వెళ్ళిపోయాడు. సాయంత్రం కలుసుకుంటా నన్నాడు. ఏరా చెప్పవేరా ?" అన్నాడాయన కొడుకు వైపు తిరిగి.

భోజనాలయిపోయిం తరువాత పిన్ని, అతను, ఎవరోపెద్దాయన అందరు చిన్న గదిలో కూచున్నారు. పిన్ని, ఆ పెళ్ళి పెద్ద ఎన్నో ప్రయత్నాలు చేశారు. "అసలు పిల్ల నచ్చిందా ?" అని అడిగితే మాట్లాడ లేదతను. తనప్పుడు వంటింటి కిటికీలోనుండి అన్నీ వింది. చివరికి "తర్వాత ఆలోచించి చెబుతా" నన్నాడు. పెళ్ళివారికి అట్లాగే కబురు చేయించారు. "వెళ్ళింతర్వాత ఉత్తరం వ్రాస్తామని !" అది సారాంశం !

దొడ్లోనుంచి తిరిగి చిన్న గది కెదురుగావున్న గుమ్మంలో నిలబడింది తను. అత నెదురుగా కనుపిస్తున్నాడు. తాను కనుపించదు. కాని చూశా డతను. మధ్య మధ్య ఆతృతగా తన వంకే చూస్తున్నా డతను. అతను చూస్తుంటే అలా నిలబడాలి. కాని తన పాదం ఒక్కడుగు ముందుకు వేసింది అతని వంక చూపుతోనే. కాని అడుగాగిపోయింది. అతని చూపులో రెప్పపాటుమాత్రం చూడగల్గింది తను. గుండె దడదడలాడింది. అతనేమనుకుంటున్నాడో ? "నే నందంగా వున్నానా ?" గబగబా పరువెత్తి అద్దంలో చూసుకుంది తన మొహం ! ఆ సమయంలో ఎంతో అందంగా వుందనిపించింది.

ఇంతలో పిన్ని వచ్చి "ఆకులకు సున్నం రాయమ్మాయి !" అన్నది. గబగబా ఆ కులకుసున్నం జాగ్రత్తగా రాసి చిలకలుతీసి చెక్కపొడుంకొట్టి సిద్ధం చేసింది. అలా అతనికి ఆకులు సిద్ధం చేస్తుంటే ఏదో మహదానందం అనుభవించింది తను.

తను చుట్టిన చిలకలు పిన్ని వాళ్ళందరికీ యిచ్చింది. అతను ఓ కంట తన వంక చూచి నవ్వుకుంటూ నోట్లో వేసుకున్నాడు.

లక్ష్మయ్య మామయ్య పిన్నిని చూసి, "ఆ అమ్మా యెవరు ?" అని అడిగాడు లోపలున్న తనను చూపించి. తబ్బిబ్బయింది తను. ముడుచుకుపోయింది. ఆయనడిగిన ప్రశ్నతీరులో ,చూచినతీరుతో భావాన్ని గమనించింది తను. అక్కడుండలేకపోయింది. కాని మనస్సు సంబాళించుకుంది తను. లేకపోతే "పెద్దవాళ్ళు ముందిలా వెళ్ళిపోతే అవిధేయతనుకుంటారు" అని అనుకుని ఆగిపోయింది. పిన్ని అన్ని సంగతులూ చెప్పింది.

చివరికీ ముక్కలంది. "దానికే ఏదన్నా సంబంధం చూసి, పుణ్యం కట్టుకుందూ. జన్మాంతం నీకు ఋణపడి వుంటుంది."

పిన్ని అలా అంటుంటే తానేడ్చేసింది. పిన్ని దింత మంచి మనసని. తనను గురించి ఆయ

"జహంగీర్ గుణాలలో కెల్ల ప్రధానమైనది ఏమిటో చెప్పరా, గోపీ" అనడిగారు మొఘల్ సామ్రాజ్యంగురించి పాఠం చెబుతున్న మాస్టారు.

అంతవరకు వెనుక బెంచీ మీద పడి నిద్రపోతున్న గోపీ ఉలికిపడి "జహంగీర్ చాలా తియ్యగా ఉంటుంది సార్" అన్నాడు.

—జక్కంపూడి కృష్ణమూర్తి
(వేపంగి పాలెం)

ఎంత లాలిత్వము, ఎంత మృదుత్వము, ఎంత తాజాయైన సువాసన!

కాష్మీర్ బొకె టాల్కమ్ పౌడరు వాడితే మీకు అటువంటి హాయినిస్తుంది!






మీరు వాడే ఫేసు పౌడరును మెరిసేలా చేసుకోండి. కాష్మీర్ బొకె టాల్కును కొంచెము పౌడరులో చల్లండి. కాష్మీర్ బొకెలో ఉన్న ఎక్కువ మృదువైన, మనోహరమైన తళతళ మీ పౌడరును మెరిసేలా చేస్తుంది!



పాపాయిని హాయిగా, సౌఖ్యముగా ఉండేలా చూడండి! కాష్మీర్ బొకె పౌడరు ఇతర ప్రత్యేకమైన బేబి పౌడర్లంత మెత్తగానూ ఉంటుంది. దానిని రాస్తే మీ పాపాయి పువ్వులా తాజాగా ముద్దొస్తూంటుంది. ఈ పౌడరు మీకూ మీ పాపాయికీ కూడ పనికివస్తుంది!

కాష్మీర్ బొకె టాల్కు యొక్క చల్లని పుష్పదళమువంటి స్పర్శను మీరు పూల గుత్తుల మధ్య ఉన్న చక్కని అనుభవము పొందుతారు! దానిని ఒళ్లంతా రాసుకోండి - వసంత ఋతు పూలపరిమళము వంటి సువాసనలో తేలిపోతూ ఉంటారు. స్నానము చేసిన ప్రతి సారి దానిని రాసుకోండి.



కాష్మీర్ బొకె

టాల్కమ్ పౌడరు

పురుషులు ప్రేమించే పరిమళం గలిది

వకుచెప్పి మార్గం చూపించమని అడుగుతుంటే, కన్నీరు బయటకు వెళ్ళ(గక్కలేకపోయింది తను.

"ఇందాకటినుండీ ఎవరో పొరిగింటి అమ్మాయి అనుకుంటున్నాను. లక్ష్మినర్సమ్మ కూతురా ?" అని ఊరుకుని కొంచెం ఆగి, "ఇదిగో అమ్మాయి విశాలాక్షీ ! యిలారామ్మా !" అన్నాడాయన. సంకోచంతో కంట కన్నీళ్ళెక్కడ కనుపిస్తాయో అని అడుగుపడలేకపోయింది తనకు. "పెళ్ళంటే అలా సిగ్గుపడిపోతావేమే" అన్నాడు దగ్గరగావచ్చి. అను కుంది తను ఆయన పాదాలవంక చూస్తూ. "తనేం నిలబడుతుందాయన శల్యపరీక్ష ముందు? అందం, కేవలం గుణాలతోనే పనిగాదు" అని విశ్వయింపకుందాయన తీవిని చూసి.

అతను చిన్న గదిలోనుండి పడత కుర్చీలో నుంచి ఒక ప్రక్కకు తిరిగి తన్ను గురించిన మాటలన్నీ విన్నాడు. ఒకసారి తన కళ్ళల్లోకి చూశాడు దీనంగా. కనుకప్పులు కిందికి దిగిపోయినాయి ఆ ప్రేమాభిమానానికి !

పిన్ని భోజనానికి పిలిచింది తనవి. భోంచేసింది. పప్పు రుబ్బింది. గారెలు చేసింది తను. పిన్ని వాళ్ళం దర్కీ పెట్టింది. పాలేరు రంగడిచేత కాఫీపొడుం, పంచదార తెప్పించింది. కాఫీ కాచింది తను. మధ్య అతను గారెలు తింటూ గొంతు కడ్డంపడి "మంచి నీళ్ళు, మంచినీళ్ళు" అంటూ అరిచాడు తన్ను చూసి నవ్వుకుంది తను. గబగబా మంచినీళ్ళు ముంచి అతని దగ్గర పెట్టింది. మంచినీళ్ళు త్రాగి పొలమారి నెత్తిమీద చిన్నగా గుద్దుకుని తమాయించుకుంటూ, తన వంక చూస్తుంటే తను నవ్వకుండా వుండలేకపోయింది. అతనూ చిన్నగా నవ్వాడు.

అతను నవ్వుతుంటే తన స్థితిని గుర్తించు కుంది. 'తా నొక అబల ! అనాధ ! తన సామాజిక పరిస్థితి అతనికి అనుకూలంకాదు. అతను చదువు కున్నాడు బి. యే. తనో ఐదవ తరగతి చదివింది. నిస్సహాయురాలై పరుల పంచన బ్రతుకుంది. ప్రపంచంలో నా అన్నవాళ్ళు లేని దీనురాలు....నన్ను ఎలా అతడు....? .....ఆలోచించుకుంటూ నెమ్మదిగా లోపలికెళ్ళిపోయింది.

ఆ సాయంత్రం యెక్కడికో వెళ్ళాడతను. పదకొండయిపోయింది. యింట్లో దీపాలు వెలుగు తున్నాయి. పిన్ని రోజూ ఏడింటికే నిద్రపోతుంది. అప్పుడు మంచి నిద్రలోవుంది. లక్ష్మయ్య మామయ్య భోంచేసి సుబ్బనాయుడిగారితో కబుర్లకి రచ్చ బండ దగ్గరకెళ్ళారు. తనకీ నిద్ర వస్తోంది. అతనింకా రాలేదు. అతని కోసమే కూచుంది తను !

బూట్ల శబ్దమయ్యింది. లేచిమంచుంది తను. చిన్న గదిలోకి వెళ్ళింది. 'పిన్నీ ! పిన్నీ ! వచ్చారు' అంది లేపుతూ పేరు చెప్పలేక పోయింది తను. "ఎవరే ?" అని మూల్గుతూ, మళ్ళీ జ్ఞాపకం తెచ్చుకుని, "నువ్వు పెడుదూ అన్నం" అంది కళ్ళు తెరవకుండానే. 'తనా ?' హృదయం సంకోచంతో గుంజుకుపోయింది. మనసుని నిశ్చలం చేసుకోటానికి ప్రయత్నించింది తను.

నెమ్మదిగా నీళ్ళచెంబు అక్కడ పెట్టింది, కొద్దిగ క్రింద మోత చేస్తూ. అతను బట్టలు మార్చు కుంటూ చూశాడు. చెంబు తీసుకుని దూరంగా

ప్రశ్న

బయటికి వెళ్ళాడు. చాల సేపటికిగాని లోపలికి రాలేదు. ఈసారి అతని నడకలో వుచ్ఛ్వాస నిశ్వాసల్లో మార్పు కనుపించింది తనకి. బరువుగ నిట్టూర్పు సెగలు బయటకు వస్తున్నాయి. మన స్సంతా వికలమయిపోయింది తనకు.

'తుండు !' అన్నాడు. గబగబా గదిలో చూసింది. లేదు. తొలుగుమీదలేదు. జ్ఞాపకానికి వచ్చింది. సాయంత్రం దొడ్లో ఆరేసింది. వంటింటి తలుపు తీసి దొడ్లోకి వెళ్లింది. చీకటిగా ఉంది. త్రాడు మీదనుంచి తుండు తీసింది. వెనక్కు తిరగింది. అతను ! దగ్గరగా నిలబడి వున్నా డెదురుగా ! ఆ చీకటిలో చుట్టూ ఎవరూలేరు. గుండె ఆగి పోయింది తనకు. చిగురుటాకు మాదిరి కంపించి పోయింది.

చెయి చాచి తన చేతిని పట్టుకున్నాడు. తావిక ప్రపంచంలో లేదనిపించింది. నెమ్మదిగా దగ్గరగా వచ్చాడు. అన్నాడు మంద్రంగా. "నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను. నీ కిష్టమేనా ?"

తలయెత్తి అతని కళ్ళల్లో చూసింది తను ఆశ్చర్యంగా. "ఏమిటిది ?" అని అడగబోతున్న ప్రశ్న నోటిలోనే వుండిపోయింది. విద్యుద్వేగంతో అతని చేతినుండి తన చేతిని లాక్కుని, తుండక్కడ పడేసి వంటింటిలోకి పరుగెత్తిపోయింది తను.

తర్వా తారు నెల్లకు ఆయనకూ, తనకు పెళ్ళయింది. ముత్తయిదువులు గదిలో నెట్టి తలుపు వేశారు. ఎదురుగా పూలపాన్పు ! ప్రక్కన చిన్న టేబుల్‌మీద పాలు, పళ్ళు, ఫలహారవుసామాను ఉన్నాయి. గది అంతా నిశ్శబ్దంగా ఉంది. హృదయం వివశమయిపోయింది. సాంసారిక జీవితంలో అడుగు పెడుతోంది తను. అమ్మ జ్ఞాపకాని కొచ్చింది ! మనసులో నమస్కరించింది. ఎదుట సాక్షాత్కరించి ఆశీర్వదించి పూలు చల్లినట్లయింది. కళ్ళు తెరచింది.

దగ్గరగా తీసుకుంటే కరిగిపోయింది తను. హృదయంలో కలిసిపోయింది తను. నెమ్మదిగా చెవులో అన్నారు. "విశాలా ! నిన్నే ఎందుకుకోరి, యింట్లోపోరి పెళ్ళి చేసుకున్నానో తెలుసా?" మాట్లాడలేదు తను. "ఏం ?" అని అర్థంకానట్లు చూచిం దాయనకంట్లో తను.

> న్యాయమూర్తి-ఇక నిన్ను ఉరిదీస్తారు. నీ చివరి కోరిక ఏమిటి?
>
> ముద్దాయి-దయచేసిమీరు నాస్థానం ఆక్రమించాలి.
>
> కోయిల్‌కర్ బన్సీలాల్
> (నిజామాబాదు)

చెప్పుకొచ్చారు. "ఆ సాయంత్రం నేను ఇంట్లో నుండి బయటికి వెళ్ళాను. జ్ఞాపకవ దా ? మా రామం యింటికి వెళ్ళాను. అక్కడొక దృశ్యాన్నిచూసి స్తంభించిపోయాను" అని ఆగారు.

"ఏమిటది ?" అంది తను ఆశ్చర్యంగా.

"వరండా గది తలుపులు తోసి లోపలి కెళ్ళాను. లోపలిలానే ఒకరి ఒడిలో ఒకరున్నారు. మా రామం, ఆమె !"

"ఆమె ? ఎవరండి ? అతని భార్యా ?"

"కాదు. అతని కింకా పెళ్ళికాలేదు. ఆమె ఎవరో గాదు. ఉదయం మేం చూసిన పెళ్ళికూతురు 'హేమ !' గబుక్కున లేచి ఆమె లోపలికి నా క్కను పడకుండా వెళ్ళిపోయింది. నా మనస్సు వికలమయి పోయింది ! వెనుదిరిగి విసురుగా వచ్చేస్తుంటే రామం గబగబా బయటకు వచ్చాడు. నా కాళ్ళ మీదబడ్డాడు. నేను అపుడు వళ్ళు తెలియని కోపంలో ఉన్నాను. నమిలిమింగేద్దామనిపించింది. కోపంగా చూశాను. కాని అతని చూపులో కన్నీరు చూశాను. "మే మిద్దరం ప్రేమించుకున్నాం. మన్నించవూ" అన్నాడు దీనంగా. నా మనసు కరిగి పోయింది. శాంతించాను. నా మనసు ఒరిగిపోయింది. సావధానంగా ఆలోచించాను. మనసు మార్చుకున్నాను. నవ్వుతూ "ముందుగా ఈ విషయం నాతో ఎందుకు చెప్పలేదు ?" అని అడిగాను. తరువాత వున్న విషయ మంతా చెప్పుకొచ్చి అన్నాడు. "యెలా చెప్పేది నీతో, మీ నాన్నగారు. మీరందరూ బయలుదేరు తున్న సమయంలో నాకు తెలిసింది నువొచ్చావని. నిన్ను కలుసుకుందామని వచ్చాను. నువ్వేమో యీ విషయం చెప్పావు. అంతవరకూ వాళ్ళింటివరకూ వచ్చానే గాని, లోపలికందుకనే అడుగుపెట్టలేక పోయాను. అది సమయంగాదు నీకు చెప్పటానికి అని ఊరుకున్నాను" అని అన్నాడు.

"తర్వాత నేనూ, రామం కలిసి వాళ్ళింటి కెళ్ళాం !"

"ఎవరింటికి ?" అంది తను.

"హేమా వాళ్ళింటికి. వాళ్ళనాన్నగారితో విషయం అంతా చెప్పి, 'మా అమ్మాయిని నాడికిస్తాను' అని మాట అనిపించుకుని మరీ బయట కొచ్చేసరికి రాత్రి పదకొండయిపోయింది. తర్వాత నా మనస్సు శూన్యమయిపోయింది. యింటికి వచ్చాను. నువ్వు కనిపించావు. నీలాంటి సుగుణాలు గల్గినది నాకు లభించదనుకున్నాను ! మళ్ళీ నా మనసు చిగురించింది. ఆశతో నిన్ననుసరించాను. అడిగాను. సిగ్గుతో పారిపోయావు" అని దగ్గరికి తీసుకుని, "యిప్పు డెక్కడికి పారిపోతావు. ఆరోజు పారిపోయినా, యీరోజు పారిపోవు" అన్నారు జడ కిందకులాగి.

* * *

గబుక్కున మెలకువ వచ్చింది విశాలకి. నిజంగా తన జడ ఆయన చేతిలో ఉంది. "ఏమిటండిది, ఎవరైనా చూస్తారు ?" అంది జడ లాక్కుని.

"దిగు. దిగు. రైలులో నిద్రేమిటి ? వచ్చేసింది మీ వూరు" అన్నాడు.

విశాలాక్షి దిగింది కళ్ళు నులుముకుంటూ. కల మత్తు ఆమెను నిద్రిస్తుంటే ఒడిలోవున్న పాప కూడా నవ్వాడు. ★



తండ్రి వెంటవున్నందువల్ల ఆమెతో మాట్లాడలేక, గట్టిగా ఆమెవంక చూడలేక, నానాబాధా పడుతున్నాడు రామకృష్ణ. ఆసంగతి గ్రహించిన సారథి "మరీ అంతతొందర కూడదోయ్" అన్నాడు. రామకృష్ణ ఉలిక్కిపడి బావగారివంక చూశాడు.

ఇంతకూ ఆసుందరి ఎవరు?

'మీ అత్తగారిది అమృత హస్తమోయ్ సారథీ! ఏం చేసినా చవులూరించేలా ఉంటుంది'' అన్నాడు శాస్త్రిగారు.

సారథి నవ్వాడు.

అంతా—సారథి, మాలతి, రామకృష్ణ, శాస్త్రిగారు భోజనాలు చేస్తున్నారు. ఆరోజున శాస్త్రిగారికి అమిత ప్రియమయిన గోంగూర పులుసు చేశారేమో—పైగా భోజన ప్రియుడు కూడా ఆయన—లొట్టలు వేసుకుంటూ తింటున్నాడాయన.

సారథి యాదృచ్ఛికంగా బావమరిది వంక చూశాడు. రామకృష్ణ మొహంలో ఉత్సాహం లేదు. అల్లరికి మారు పేరని పేరు తెచ్చుకున్న అతగాడు బుద్ధావతారంలా కూచుని భోంచేస్తున్నాడు. నాన్నగారి ముందు వినయం ఏమో అని అనుమానించడానికి ఆస్కారం లేదు. నరదాల్ని తొక్కి పారేసే మదపు ఏనుగు కాదు శాస్త్రిగారు. పైగా ఆయనకి కొడుకంటే చాలా అపేక్ష కూడాను.

"ముఖ్యంగా ఈ గోంగూర పులుసు ఉంది చూశావూ ? ప్రాణం లేచొచ్చేలా ఉందనుకో అల్లుడూ! దీనితోటి ఎంత అన్నమయినా లాగించెయ్యొచ్చు" అంటున్నాడు శాస్త్రిగారు.

"పెద్దవా రయ్యారు కదా ?" అన్నాడు సారథి మామూలుగా. శాస్త్రిగారు అల్లుడి వంక అనుమానంగా చూశాడు. సారథి మాటల్లో అంతర్లీనంగా ఏదో 'ధ్వని' కనబడ్డ దాయనకి.

"చాదస్తపు మాటల నేనా ?"

నవ్వుతో పొలమారింది మాలతికి. సారథి నవ్వు దాచుకుంటూ "అబ్బే! అదేం కాదండి" అన్నాడు బలవంతాన.

"కుర్రాళ్ళోయ్ మీరు! అంటారు మీరు''





పిక్నిక్

అన్నాడు శాస్త్రిగారు గంభీరంగా.

భోజనాలు ముగిశాయి. చేతులు కడుక్కుని శాస్త్రిగారు కొడుకూ, అల్లుడితో హాల్లోకి వచ్చాడు. సారథి క్రీగంట బావమరిదిని గమనిస్తూనే ఉన్నాడు. అతని ముఖంలో అడపాదడపా ఏదో కదలిక కనబడినా అది కులాసాతనానికి కొండ గుర్తులా ఏమాత్రం లేదు. ఏమిటతని బాధ ?

"నే వెళ్ళి పడుకుంటానోయ్" అన్నాడు శాస్త్రిగారు గుంభనగా. కొత్తగా పెళ్ళిఅయిన అల్లుడూ కూతురూ మరి. వాళ్ల మధ్య తా నెందుకు ? అన్న ధోరణి వా డాయన.

"అలాగే" అన్నాడు సారథి తన గదిలోకి దారితీస్తూ.

మాలతి ఆకులకు సున్నం రాస్తూ కూర్చుని ఉంది కుర్చీలో. సారథి మంచం మీద కూర్చుని "ఏమిటోయ్ మీ అన్నయ్య దివాలా మొహం పెట్టాడు ?" అన్నాడు.

"ఏమో" అన్నది మాలతి తల తిప్పకుండా.

"వో యబ్బ ! అంతా గుట్టే కాబోలు."

"ఏం ? మీ రహస్యాలు ఎవరికేనా చెబుతారా ? .... అయినా నాకు తెలీదు" అన్నది మాలతి.

'అయితే ఏదో కథ ఉందన్నమాట ? .... ఏమిటది ?"

"పిల్చి మీరే అడగండి" అంటూ కట్టిన చిలక అందించింది మాలతి. నోటితో అందుకున్నా డతను.

"నువ్వు చాలా అందంగా ఉంటావ్ సుమా ?" అన్నాడు సారథి తొణక్కుండా భార్యవంక చూస్తూ.

"ములగచెట్టు ఎక్కించ నక్కర్లేదు. అడగదల్చుకుంటే వాడినే అడగండి. లేకపోతే మానెయ్యండి" అన్నది మాలతి తన చిలక నోట్లో వేసుకుని పొందాను బల్లమీద పెడుతూ.

"అది కాదోయ్..." నవ్వాపుకుంటూ ఏదో చెప్పబోయాడు సారథి. మాలతి చివాలున గుమ్మం దగ్గరకు వెళ్ళి హాల్లో కూర్చున్న అన్నయ్యను కేక వేసింది. రామకృష్ణ వచ్చాడు.

"కూర్చోండి బావగారూ" అన్నాడు సారథి కుర్చీ చూపించి. రామకృష్ణ కూర్చున్నాడు.

"ఇందాకటినుంచీ మీ అన్నయ్యేదోలా ఉన్నాడెందుకు చెప్పమని పేపుకు తింటున్నార్రా" అన్నది మాలతి మంచం అటు చివర కూర్చుంటూ.

రామకృష్ణ మొహంలో రంగులు మారాయి. వయస్సులో మాలతి కన్నా పెద్దవా డయినా చిన్న పిల్లాడిలా ఉంటా డతను. అతని వాలకం చూసి జాలీ, నవ్వూ కలిగాయి సారథికి.

"ఏం బావగారూ ?" అన్నాడు సారథి సంగతేమిటో చెప్పమన్నట్టు.

స్వతహాగా చాలా రిజర్వుడుగా ఉండే మనిషి విజయసారథి. అయితే అతను పెసిమిస్టు, కుళ్ళుబోతూ కాదు. అతని కలుపుగోలుతనానికి సరిహద్దు లున్నాయి. బావమరిది దాదాపు తన వయస్సువాడు అయినా అతనంటే పెద్దరికంతో కూడిన ప్రేమ అతనికి. రామకృష్ణ అమాయకుడు. ఢక్కా ముక్కలు తిన్నవాడు కాడు తనకు మల్లే. స్వల్ప విషయాలను గురించి అతను గిల

పిక్నిక్

గిలలాడి పోతుంటాడు. ఇప్పటి విషయమూ అలాంటిదే అయివుంటుంది.

"ఆరుస్తారా ? తీరుస్తారా ?" అన్నాడు రామకృష్ణ బుంగమూతి మినహాగా.

"అసలు విషయం ఏమిటో చెబుతే ఏమయినా చెయ్యొచ్చు .... ఎవర్నన్నా ప్రేమించలేదు గదా ?" అన్నాడు సారథి వోరకంట మాలతి వంక చూస్తూ.

మాలతి చర్రున "ఏం మా అన్నయ్య అందుకు తగడా ?" అన్నది.

"అని ఎవరన్నారోయ్ ? .... ఆ లలనామణి ఎవరో తెలిస్తే ఆ కాస్త జరిపించెయ్యొచ్చు గదా అని మా తాపత్రయం" అన్నాడు సారథి చిరునవ్వుతో.

"అవును బావగారూ" అన్నాడు రామకృష్ణ.

"శేష్ ! అయితే ఆలస్యం దేనికి ? శుభలేఖలు అచ్చు వేయించనా మరి ?" అన్నాడు సారథి హుషారుగా.

"వోడ దాటిన ఎల్లయ్యలంతా ఇలాగే మాట్లాడారు" అన్నాడు రామకృష్ణ రూక్షంగా.

"అంతకన్నా ఏమన వంటావయ్యా ...! కొంపదీసి ఏదన్నా టెక్నికల్ అబ్జెక్షనా ? కులం, గోత్రం లాంటివి తభావతు లొచ్చాయా ?"

మరొకళ్ళెవరయినా అలా మాట్లాడి ఉంటే తన్ని పాతేసి ఉండేవాడు రామకృష్ణ. సారథి సొంత బావ. పైగా అతను చాలా తెలివిగలవాడనీ, చక్కని మనసు కలవాడనీ రామకృష్ణ నమ్మకం. అందుకేగా తన చెల్లెలు కోరి చేసుకుం దాతడిని ? .... ప్రస్తుత చిక్కు సమస్య అతని సహాయంతో పరిష్కారం కాగల అవకాశా లున్నాయి. పోట్లాడి లాభంలేదు. పడ్డవా డెప్పుడూ చెడ్డవాడు కాదు.

"అవన్నీ సరిగ్గానే ఉన్నాయి" అన్నా డతను చివరికి.

"మరి ఏమిటి సమస్య ? కట్నమా ?"

> అద్దెకు ఉన్న ఓకుటుంబరావు గృహయజమానితో ఇలా అన్నాడు: "ఏమండీ, ఈ ఇంటికప్పు చూశారా? వర్షం కురిస్తే ఇల్లంతా చెరువై పోతుంది. ఇలా ఎన్నాళ్ళండీ?"
> "ఎన్నాళ్ళు కురుస్తుందో నేనేమి చెప్పగలను? నేనేమైనా జ్యోతిష్కుణ్ణా?" అన్నాడు ఆగృహయజమాని.
> ఎగ్గోని అవనిజ (గుత్తి)

"కొంతవరకూ అది కూడా ననుకోండి .... వాళ్ల నాన్నగారు నాటకాల్లో వేషాలు వేస్తాడు. ఆ అమ్మాయికి తల్లి లేదు. 'అత్తగారు లేని సంబంధం ఏమిటోయ్ అప్పలసామీ' అన్నాడు నానోసారి" అన్నాడు రామకృష్ణ టూకీగా.

శాస్త్రిగారు నాటకాల్లోనూ, సినిమాల్లోనూ వేషాలు వేసేవాళ్లంటే అసహ్యించుకుంటాడు.

"అయితే మీ నాన్నగారు ఒప్పుకో రంటావా ?"

"నే అనడం కాదు. ఆయనే అంటాడు."

"అత్తయ్యగారు ?"

"ఆవిడదే వుంది ? అంతా ఆయనగా రిష్టం" అన్నాడు రామకృష్ణ. సారథి, మాలతి వంక చూశాడు. ఆ అమ్మాయి ముఖంలో ఏలాంటి భావమూ వ్యక్తం కావడంలేదు.

"పాకు తెలీ కడుగుతాను బావగారూ ! నా కేం కట్నం ఇచ్చారండీ మీరు ? .... పైగా గయ్యాళి గంప లాంటి ఈ కాళిని అంటగట్టారు" అన్నాడు.

"అనదలుచుకుంటే మేమూ అనగలం" అన్నది మాలతి ఉక్రోషంగా.

"అను చూద్దాం" అన్నాడు సారథి ఛాలెంజి చేస్తున్నట్టు.

"రహస్యంగా బొమ్మలు గీసుకుని, పాటలు రాసుకునీ, ఇళ్లకి పిలిచి ఇండైరక్టుగా చెప్పించి అవస్థ పడుతూంటే దయతల్చాడు మా నాన్న. అంతేగాని ...... "

"అంతేగాని .... ?"

"ఏం లేదులెండి" అన్న దామె విసురుగా

చెల్లెలూ, బావా ప్రణయ యుద్ధాలు చేసుకుంటుంటే చూసి గంతులేసే స్థితిలో లేని రామకృష్ణ "ఆపండయ్యా సొద !" అన్నాడు విసుగ్గా.

"అయితే మీ నాన్నగారితో చెప్పి ఈ పెళ్లికి ఒప్పించమంటారా ?" అన్నాడు సారథి.

"ఆ పని చెయ్యగలరా ?" అన్నాడు రామకృష్ణ. అతని ముఖంలో వెయ్యి ఆశాదీపాలు వెలిగాయి.

"శేషుగ్గా ! అయితే నీ ప్రేమగాథ వివరాలన్నీ నాతో చెప్పాలి. అబద్ధాలు చెప్పగూడదు."

అతని ఆపద్బాంధవుడి పోజు చూసి వళ్ళు మండినా ఏమీ అనలేక వూరుకుంది మాలతి.

"వాళ్లది కాకినాడ. స్కూలు ఫైనలు పరీక్షకు వెళ్లింది. నా లాడ్జి పక్కనే వాళ్ల యిల్లు. సుందరశివరావుగారు కలుపుగోలు మనిషి కావటం మూలాన రాకపోక లేర్పడి ఆ అమ్మాయితో స్నేహం కలిసింది" అన్నాడు రామకృష్ణ.

"ఒకందుకు సంతోషమోయ్ రామకృష్ణా ! ఈ బియ్యే లలనామణుల జోలికి పోకుండా తప్పించుకున్నావు."

"మధ్యలో ఈ పిడకల వేట దేనికి ?" అన్నది మాలతి.

"రైటో బావమరిదీ ! .... ఒక్క ప్రశ్న. ఆ అమ్మాయికి నువ్వంటే ప్రేమేనా ? వాళ్ల నాన్న కీ భాగోతం తెలుసా ? ఆయన ఊహ లేమిటి ? .... లాస్ట్ అఫ్ ఆల్. ఆ అమ్మాయి పేరేమిటి ?" అన్నాడు సారథి మాలతికేసి చూడకుండా.

"నోరు విడిచి చెప్పేటంత వయస్సు ముదిరి పోలేదు. గనుక .... ఆ అమ్మాయి చేష్టల్ని బట్టి అర్థం చేసుకున్నాను. ఇహ .... "

"చేష్ట లనగా ?"

"ముక్కస్యముక్కా విడమర్చి చెప్పేటంత తెలివి తేటలు లేవు నాకు. అర్థం అయింది చెప్పాను. నమ్మగలిగితే నమ్మండి" అన్నాడు మంటగా రామకృష్ణ.

"సరే ! మిగతా ఆన్సరు."

"ఆ అమ్మాయి పేరు రాధ. సుందరశివరావు గారికీ ఇవ్వాలనే వుంది గాని .... నా వెనకాతల ఉన్న 'లప్ప'ను చూసి బెదురుతున్నట్లు అనుమానం".

"అచ్ఛా ! .... కావలసిన కార్యం నాకు వది లెయ్ ! వెళ్లి నిద్రపో !" అన్నాడు సారధి.

అయోమయంగా లేచి బయటికి పోయాడు రామకృష్ణ. ఆ తరువాత మాలతి వేపు తిరిగి "ఇహ కానియ్యి ఇంటిదానా నీ దండకం" అన్నాడు సారధి.

"మీకు మరీ వేళాకోళంగా ఉంది" అన్నది మాలతి దూరంగా జరిగి.

"పిచ్చిపిల్లా ! .... అతను నీకు అన్న అవుతే నాకు బావమరిది కాడూ ! అతన్ని అవమానించే టంత అవివేకినా నేను ?" అన్నాడు సారధి సంప్రదింపుల్లోకి దిగుతూ.

మాలతి నవ్వేసింది.

సారధి ఆమె భుజంమీద చేయి వేసి "ఎంత అమాయకురాలివి మాలతీ ?" అన్నాడు అనురాగంతో. అతనికి ఆమె అంటే అంతులేని ఆపేక్ష.

ఆమె వంక చూశాడు. ఆమెకూ రామకృష్ణకూ చాలా విషయాల్లో పోలిక లున్నాయనిపించింది. ఇద్దరు సన్నగా, పొడుగ్గా ఉంటారు. మెరిసే పెద్ద కళ్లూ, పొడుగ్గా కొనదేరి ఉండే నాసికా, నవమి చంద్రుడి వంటి నుదురూ—ఇద్దరూ అమాయకత్వానికి, నైర్మల్యానికి రూపకల్పనలా అవుపడతారు.

అందుకే వారంటే అతనికి ప్రేమ. వాత్సల్యం. అతను ఆమెను కౌగిట్లోకి తీసుకున్నాడు ....

ఆ సాయంత్రం ముగ్గురూ వాహ్యాళికి బయలుదేరి మామూలు ప్రకారం కృష్ణ ఒడ్డుకు వచ్చారు. ఇసుకల్లో కూర్చున్నాక "సంభాషణ ప్రారంభించండి బావగారూ" అన్నాడు సారధి నవ్వుతూ.

రామకృష్ణ మాట్లాడకుండా దిక్కులు చూడ సాగాడు. అక్కడక్కడా గ్రూపులుగా కూర్చుని ఉన్నారు ... కబుర్లు చెప్పుకుంటూ. ఒడ్డున ఉన్న ... వాళ్లనీ, సోడాల వాళ్లనీ కేకలు పెడుతున్నారు కొందరు.

హఠాత్తుగా రామకృష్ణ లేచి నిలబడ్డాడు. "సుందర శివరావుగారూ" అని కేకవేస్తూ పరుగెత్తాడు.

సారధి ఆతను పోయిన దిక్కు చూస్తూ "ఐలేవాడు ! .... ఇంతకీ ఆయనవునో కాదో" అన్నాడు.

"అంత తెలివిలేనివాడు కాదు లెండి !" అన్నది మాలతి.

"మొదలు ! .... సరేగాని, ఈ సమస్యా పరిష్కారానికి ఏదన్నా ఉపాయం ఆలోచించు మాలతీ."

మాలతి నవ్వి తల వంచుకుంది. రెండు క్షణాలు పోయాక "విజయ సారధులు. మీకు చెప్పగలదాన్నా ?" అన్నది.

"చెబుదూ .... చదవక."

"నాకు తెలీదు. మీరే ఆలోచించండి" అన్నది మాలతి.

సారధి బావమరిది పోయిన వంక చూశాడు. రామకృష్ణ ఒక నడివయసాయననీ పదహారు, పదిహేడేళ్ల అమ్మాయినీ వెంటబెట్టుకు వస్తున్నాడు.

"ఎక్కడికన్నా పిక్నిక్ పోదామండీ" అన్నది మాలతి తల వంచుకునే.

"ఇది పిడకల వేట కాదు కామల్సు" అన్నాడు సారధి.

"పోనీలెండి ! .... చెప్పండి ఎక్కడి కెళ్దాం" అన్న దామె తలెత్తుతూ.

వాళ్లు ముగ్గురూ వచ్చి కూర్చున్నారు. రామకృష్ణ సారధికి ఆయన్ను పరిచయం చేశాడు.

"నమస్కారం" అన్నాడు సారధి. ఆయన ప్రతి నమస్కారం చేశాడు.

"ఊరు చూద్దామని వచ్చారా ?"

"లేదు మాష్టారూ ! రేపు రాత్రికి గుంటూరులో ఉద్యోగ విజయాలు నాటకం ఉంది మాది. అమ్మాయి దుర్గగుడి చూడాలని అంటే ఎలాగూ వస్తున్నాం గదా అని తీసుకు వచ్చాను" అన్నాడాయన.

"చాలా చక్కని నాటకం అది" అన్నాడు సారధి.

"నిజమే ! కాని ఏం ప్రయోజనం మాష్టారూ? పార్సీ సంగీతాలతోటి నింపేస్తున్నారు" అన్నాడు సుందర శివరావుగారు విచారంగా.

"మీరే అలాగంటే ఎలా ? .... మార్పులు తెచ్చేందుకు ప్రయత్నించండి."

"రాఘవాచార్యులుగారు మళ్లీ జన్మెత్తాలి .... సరదాగా మీరు కూడా రండి. చూసి వద్దురు గాని."

"రావచ్చనుకోండి ! .... రేపు పిక్నిక్ ప్రోగ్రాం ఒకటి వేసుకున్నాం. ఈసారికి క్షమించండి" అన్నాడు సారధి.

మాలతి తెల్లబోయి ఆతని వంక చూసింది. అతని పెదవి చివర చిరునవ్వు లాస్యం చేస్తోంది.

"మీకు అభ్యంతరం లేకపోతే అమ్మాయిని మాతో పంపించండి. ఆమెకూ మంచి కాలక్షేపం" అన్నాడు సారధి.

"దానిష్టం" అన్నా డాయన.

"ఆహ్వానించు మాలతీ" అన్నాడు సారధి.

"రండి రాధగారూ ! సరదాగా వెళ్లొద్దాం" అన్నది మాలతి.

"ఎందుకండీ .... "నసిగిం దా అమ్మాయి.

"అదేమిటమ్మా ! నాన్నగారు వాళ్ల హడావుడిలో ఉంటారు. మేం పరాయివాళ్లం కాదు గదా ! ... రేపు సాయంత్రానికల్లా తిరిగొచ్చేస్తాము .... ఊ అను" అన్నాడు సారధి వాత్సల్యంగా.

"నాన్నగారి ఇష్టం" అన్నది రాధ.

"సో దటీజ్ సెటిల్డ్ ! .... ఊరంతా చూసేశారా ?" అన్నాడు సారధి.

Statement about ownership and other particulars about newspaper

ANDHRA SACHITRA VARA PATRIKA

1. Place of Publication: 6&7, Thambu Chetty St., Madras-1.
2. Periodicity of its publication: Every Wednesday
3. Printer's Name: Sri S. Radhakrishna
   Nationality: Indian
   Address: 6&7, Thambu Chetty Street, Madras-1
4. Publisher's Name: Sri S. Radhakrishna
   Nationality: Indian
   Address: (As above)
5. Editor's Name: Sri S. Sambhu Prasad
   Nationality: Indian
   Address: 49, Chamier's Road Adyar, Madras-28
6. Names and addresses of individuals who own the newspaper and partners or share-holders holding more than one per cent of the total capital

NAME	ADDRESSES
1. Mr. S. Sambhu Prasad	29, Chamier's Road Adyar Madras-28
2. Mrs. S. Kamakshamma	Do
3. Mr. S. Nageswara Rao	Do
4. Mr. S. Radhakrishna	6 & 7, Thambu Chetty Street Madras-1

I, S. Radhakrishna, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

(*Sd*) S. RADHAKRISHNA,

27-2-1961 Signature of Publisher

పిక్నిక్

"ఆ" అంటూ గడియారం చూసుకున్నాడాయన. "బస్సుకు వేళవుతోంది. బయలుదేరడం మంచిదేమో" అన్నాడు.

"అందరం వెళదాం పదండి" అంటూ లేచాడు సారథి. ఒడ్డెక్కిన తరువాత "అమ్మాయిని తీసుకుని ఇంటికి వెళ్ళండి. బాబాయి గారిని బస్సెక్కించి వస్తాను" అన్నాడు సారథి బామమరిదినీ, భార్యనూ ఉద్దేశించి.

"అలాగే" అన్నాడు రామకృష్ణ.

వాళ్ళు ముగ్గురూ జట్కా ఎక్కి వెళ్ళిపోయారు. సారథి సుందరశివరావుగారితో కలిసి బస్సుస్టాండుకు వచ్చాడు. గుంటూరు బస్సు బయల్దేరేందుకు ఇంకా వ్యవధి ఉంది.

"ఒక్కమాట బాబాయిగారూ" అన్నాడు సారథి.

"అడగండి" అన్నాడు సుందరశివరావుగారు.

"మీ గోత్రం ఏమిటి ?"

విస్మయంతో 'కౌండిన్యస" అన్నాడాయన.

"అమ్మాయిని రామకృష్ణ కివ్వడానికి ఏమయినా అభ్యంతరమా ?"

ఆయన తటపటాయించాడు.

"ఇంత సూటిగా అడిగేసినందుక మరోలా భావించకండి. అతనికి మీ అమ్మాయిని చేసుకోవాలని ఉంది. అతనూ యోగ్యుడు. మంచివాడు ... ఇందులో తల్లిదండ్రుల ప్రమేయం గూడా ఉంటుం దనుకోండి శాస్త్రిగారు బోళాశంకరుడు. చెప్పే విధంగా చెబుతే వినకపోడు. మీ అభిప్రాయం కూడా తెలియజేస్తే సంతోషిస్తాను."

ఆయన కనుకొలకుల్లో నీటి చుక్క నిలిచింది. ప్రపంచంలో అంతా మంచీ, ఆనందమూ తప్ప మరేమీ లేదన్న భావం కలిగిం దాయనకు. సారధిని గురించి రామకృష్ణ ద్వారా ఆయన విని ఉన్నాడు. అతని 'శక్తి' అంతదే కూడా !

"నా కభ్యంతరం ఏముంది బాబూ ? రాధ అదృష్టవంతురాలు. మీ వంటి మంచివాళ్ల మధ్య పడుతోంది" అన్నా డాయన సంబరంగా.

"నాతో అంటే అన్నారు గాని మా మావగారితోటీ రామకృష్ణతోటీ అనకం డా మాట. తామెంత గొప్పవాళ్ళమో నని బుజాలు పొంగించుకుంటారు" అన్నాడు సారథి నవ్వుతూ.

'బలేవారు" అన్నా డాయన నవ్వుతూ.

బస్సు వచ్చింది. క్యూలో నిల్చుని టికెట్ తెచ్చి బస్సెక్కించా డాయన్ను సారథి. "ఎల్లుండి కల్లా వచ్చెయ్యండి తాంబూలాలు పుచ్చుకుని మరీ వెళుదురు గాని" అన్నాడు వీడ్కోలుగా.

"అలాగే" అన్నా డాయన నవ్వుతూ.

బస్సు కదిలింది. పిక్నిక్ ఏర్పాట్లనుగురించి ఆలోచించుకుంటూ, ఇంటి దగ్గర రాధను ఎలా మాలతి వాళ్ళు పరిచయం చేశారో అనుకుంటూ ఇంటికి జేరుకున్నాడు సారథి.

* * *

ఇంటికి జేరగానే మాలతి వచ్చి పరిణామాలు చెప్పింది. ఆ అమ్మాయి సారథి వేలు విడిచిన పినతల్లి కూతురుగా పరిచయం అయిందట. రాధ

ఆశ్చర్యపోయిందిట. కాని ఎందుకో ఊరుకుందట. అన్నపూర్ణమ్మగారు ఆమెను సాదరంగానే చూస్తోం దట (!) శాస్త్రిగారు "చుట్టరికం దూర మయినా .... సారథి పోలిక లున్నాయి" అన్నాడుట.

"కాపిటల్ ! .... ఇహ రేపటి ప్రోగ్రాం తయారు చెయ్యాలి. మామయ్యగార్ని పిలు" అన్నాడు సారథి.

"ఇంత అర్ధాంతరంగా చెబితే ఆయన ఏమను కుంటాడో ?" అన్నది అనుమానంగా మాలతి.

"ఏమీ అనుకోడు గాని .... పిలు."

మాలతి తండ్రిని పిల్చుకొచ్చింది. సారథి పిక్‌నిక్ సంగతి చెప్పాడు. "మళ్ళీ నేను వైజాగ్ వెళ్ళిపోవాలి మామయ్యగారూ ! రేపు తాడేపల్లి తోటకు వెళ్ళి వద్దాం" అన్నాడు చివరికి.

"ఒక్క రోజులో చెబితే ఎలాగోయ్ ! కారూ అదీ చూసుకోవద్దూ" అన్నా డాయన.

"సాంబశివరావుగారికి ఫోనుచేసి చెప్పాను. రేపొద్దున్న ఏడున్నర కల్లా పంపిస్తా మన్నారు" అన్నాడు సారథి.

"ఇహ నేను చెప్పేదేముంది ?"

"మనందరికీ సరిపోయే వంట సామాన్లు జాగ్రత్త చేయించండి. రెండు సిరిచాపలూ, వో పేకదస్తా తెప్పించండి. టిఫిన్ ఇంటిదగ్గర చేసి బయలుదేరతాం గనక సాయంత్రానికి కావల సిన కాఫీపొడుం మాత్రం తీసుకోండి. కూరలూ అవీ ఆచార్లుగారు సప్లయి చేస్తారుగా ?" అన్నాడు గుక్క తిప్పుకోకుండా సారథి.

"ఆ" అన్నాడు శాస్త్రిగారు.

"అయితే చాపలకీ, పేకకీ రామకృష్ణను పంపించండి" అన్నాడు సారథి. "అలాగే" అని ఆయన బయటకు వెళ్ళాడు.

"మేం గనక అలా అని వుంటే చావగొట్టో, తిట్టి పోసో వుండేవా డాయన" అన్నది మాలతి.

"అల్లుడ్నోయ్ నేను" అన్నాడు సారథి ఆమె బుగ్గ మీద చిటికె వేస్తూ.

మర్నాడు అనుకున్న ప్రకారం కారులో అంతా తాడేపల్లి చేరుకున్నారు. తోటను కౌలుకు తీసు కున్న ఆచార్లు శాస్త్రిగారి ఈ ఆకస్మాత్ రాకకు ఆశ్చర్యపోయి ఆదరా బాదరా పరుగెత్తుకొచ్చాడు. విషయం తెలుసుకున్నాక తోటలో కాపలా ఉండేం దుకు వో మూలగా వేయించిన పెంకుటింటి తాళాలు తీసి కారులో సామాన్లన్నీ అందులోకి చేర్పించి, కూరలూ, పాలూ తెస్తానని వెళ్ళి పోయాడు. ఈ కార్యక్రమం జరుగుతూండగా విజయసారథి రాధతో కలిసి తోట అంతా కలయ దిరిగాడు ఏవో కబుర్లు చెబుతూ. వాళ్ళు తిరిగి వచ్చేసరికి ఆ అమ్మాయి ముఖంలో సిగ్గూ, ఆనందమూ వెలుగుతూండటం గమనించాడు శాస్త్రిగారు.

మామిడిచెట్లు నీడన చాపలు పరిపించి పేక తీశాడు సారథి. అన్నపూర్ణమ్మగారు స్నానం కానిచ్చి వచ్చి కూర్చుంది

ఆచార్లుగారు ఓ బుట్టలో వంకాయలు, బంగాళా దుంపలూ, వో కట్ట తమలపాకులు, గోంగూర తీసు కొచ్చాడు రాధ, సారథి చెప్పడంతో ఆ బుట్ట తీసుకు వెళ్ళి ఇంట్లో పెట్టి వచ్చింది. ఆచార్లుగారు పాలు మధ్యాహ్నానికి తెచ్చిస్తా నని చెప్పి వెళ్ళిపోయాడు.

"కాసేపు పేకాడదాం" అన్నాడు సారథి.

"మీరు ఆడండి. నేను వెళ్ళి వంట పని చేస్తాను" అన్నది అన్నపూర్ణమ్మగారు.

"తొందరేం ? కాసేపు ఆడండి" అన్నాడు సారథి.

"ఆవిడ వంట వో పట్టాన తెమిలేది కాదులే! వెళ్ళనివ్వు" అన్నాడు శాస్త్రిగారు.

"అయితే రాధను కూడా తీసుకెళ్ళండి. మీకు సాయం చేస్తుంది" అన్నాడు సారథి.

"అబ్బే ! అంత స్లో కాదులే" అన్నాడు శాస్త్రి గారు నవ్వుతూ.

"అదికాదు మామయ్యగారూ ! రాధకి వంట పని బాగా చేతనవును. అత్తయ్యగారికి సాయంగా ఉంటుందని చెబుతున్నాను" అన్నాడు. అన్నపూర్ణమ్మగారు ఆ అమ్మాయిని తీసుకుని వెళ్ళిపోయింది.

"అదేమిటోయ్ ! అతిధిగా వస్తే పన్ను చేయించా రనుకోదూ" అన్నాడు శాస్త్రిగారు మందలింపుగా.

"పరాయి ఇల్లు కాదుగా ! ఫరవాలేదులెండి" అన్నాడు సారథి క్రీగంట బావమరిది వంక చూస్తూ. అతను తలవంచుకుని కూర్చుని ఉన్నాడు.

"పేక వెయ్యండి" అన్నాడు సారథి.

మాలతి, సారథి ఒక జట్టుగా, రామకృష్ణ, శాస్త్రిగారు రెండో జట్టుగా 'అడ్డాట' ప్రారంభ మయింది.

శాస్త్రిగారు ఆట చెప్పాడు. సారథి అడ్డు చెప్పాడు.

జాగ్రత్తగా తూచి, చూచి ఆడినా శాస్త్రి గారు వరుసగా నాలుగు ఆటలు వోడిపోయాడు. ఆయన మనస్తత్వం ఎరిగున్న విజయసారథి ఇలాగే ఆట సాగితే ఆయనలో అసహనం పెరిగి కోపం పుట్టుకు రావచ్చుననీ, అందు మూలాన పిక్నిక్ భంగం కావచ్చుననీ గ్రహించుకున్నాడు. పేకాటలో వోడిపోయినంత మాత్రాన కోపం తెచ్చుకునే టంత తెలివి తక్కువవాడా శాస్త్రి గారు అని ప్రశ్నిస్తే చెప్పేదేమీ ఉండదు. చిన్న వాళ్ళ ముందు చిన్నతనం అంటే పెద్దవాళ్ల కెలా ఉంటుందో పెద్దల్నడిగితే తెలియవచ్చు.

అందుకని విజయసారథి ఆటలో వోడిపోవడం సాగించాడు. దాదాపు అరగంట అయిం తరువాత శాస్త్రిగారి వోకులన్నీ పోయి సారథి 'డెఫిసిట్' లో పడ్డాడు.

శాస్త్రిగారి ముఖం తేటపడింది.

"ఎంత తెలివిగా ఆడినా కుర్రాళ్ళు కుర్రాళ్ళే నోయ్ సారథీ" అన్నా డాయన.

"నిజమే" అన్నాడు సారథి.

తిరిగి ముక్కలు పంచి ఆట చెప్పాక "మీ బాబాయిగారు ఏం చేస్తూంటాడోయ్ సారథి ?" అన్నాడు శాస్త్రిగారు.

"వ్యాపారం" అన్నాడు సారథి.

మళ్ళీ ఏదో అడగబోతూ శాస్త్రిగారు పెంకు టింటివైపు చూశాడు. చీరె, జాకెట్టు మార్చు కుని తల దువ్వుకు, బొట్టు పెట్టుకుని స్నిగ్ధ

సౌందర్యానికి ప్రతినిధిలా రాధ వస్తోంది.

సారధి కూడా ఆమెను చూసి "ఏమ్మా రాధా ?" అన్నాడు.

"వంట అయిపోయింది. వడ్డించమంటారేమో కనుక్కోమన్నారు అత్తయ్యగారు" అన్నది రాధ.

తండ్రి వెంట ఉన్నందువల్ల ఆమెతో మాట్లాడలేక, గట్టిగా ఆమె వంక చూడలేక

పిక్నిక్

నానాబాధ పడుతున్నాడు రామకృష్ణ. ఆ సంగతి గ్రహించిన సారధి రెండూ కలిసి వచ్చేలా "మరి అంత తొందర కూడదోయ్" అన్నాడు.

రామకృష్ణ ఉలిక్కిపడి బావగారి వంక చూశాడు.

సారధి పెదిమల చివర సన్నని నవ్వు లాస్యం చేస్తోంది.

"కాసేపు ఆగుతాం లేమ్మా ! ఆవిడ గారికి పూజా అదీ ఉంటుందిగా కానిచ్చుకోమన్న

అన్నాడు శాస్త్రిగారు.

"అలాగే" అన్నది రాధ కదిలి వెళ్ళిపోతూ.

"వాళ్ళది కాకినాడ అని చెప్పింది మాలతి. ఒక్కర్తే ఈ వూరు వచ్చిందేమోయ్ సారధీ" అన్నాడు శాస్త్రిగారు. ఆ తరువాత.

"మా బాబాయితో కలిసి వచ్చింది మామయ్యగారూ. ఆయన గుంటూరు వెళ్ళారు. రేపు సాయంత్రానికి వచ్చేస్తారు" అన్నాడు సారధి.

"మనింటికి రమ్మని చెప్పావా ?"

"ఆ."

శాస్త్రిగారి దృష్టి వంటఇంటివైపే లగ్న మయి పోయింది. రాధ బయటికి వచ్చి తార ట్లాడి రెండు క్షణాల తర్వాత మామిడిచెట్ల వేపుగా బయలుదేరి వెళ్ళిపోయింది.

ఆటలో పొరపాటు అల్లుడు వేలెత్తి చూప డంతో ఈ లోకంలోకి వచ్చాడు శాస్త్రిగారు.

"మామయ్యగారు ఏదో ఆలోచనలో పడ్డారు. ఆట ఆపేద్దామా ?" అన్నాడు సారధి.

శాస్త్రిగారు టైము చూసుకుని "పదకొండు కావస్తోంది. ఆట ఆపేద్దాం" అన్నాడు.

పేక పెట్టెలో పెట్టేశాడు సారధి.

ఆ తరువాత కొన్ని క్షణాలు నలుగురూ మవునంగా కూర్చున్నారు. ఉషారుగా తిరుగడానికి ఏర్పాటయిన పిక్నిక్ కాదిది అన్న సంగతి గ్రహించిన మాలతి, రామకృష్ణ ఏమీ మాట్లాడకుండా దిక్కులు చూడసాగారు. శాస్త్రిగారు మాటి మాటికీ 'ఆ అమ్మాయి' గురించి ఆలోచిస్తూ మవునం వహించాడు. సారధి వాళ్ళని పరిశీలిస్తూ కూర్చున్నాడు.

వివాహం పవిత్రమయిన వ్యవస్థ అవునా కాదా అన్నది ఈమధ్య చర్చనీయాంశం అయింది. పెళ్ళి అనేది పచ్చి బూటకమనీ బోనఫైడ్ వ్యభిచారం తప్ప మరేమీ కాదనీ ఈనాడు కొందరు వాదిస్తున్నారు. వివాహంలో జరిగే తంతు లన్నింటికీ అదే ప్రాతిపదికమీద సాక్ష్యాలిప్పించడం జరుగుతోంది. కాని ఈ దేశం, అదృష్టమో, దురదృష్టమో గాని, ఆ వాదనలను త్రోసిపుచ్చి వివాహానికి జీవితంలో అతిముఖ్యమయిన స్థానం ఇచ్చి గౌరవిస్తోంది. ఆ పరిస్థితి పోవాలని కంకణం కట్టుకున్నవాళ్ళు దాన్ని విసర్జించడం మేలు.

అలాగే పెళ్ళీడు ఆడపిల్ల లున్న తల్లిదండ్రులే పెళ్ళి విషయంలో ఎక్కువ తొందరపడతారనేది. పెళ్ళీడు మొగపిల్ల లున్నవారికి కూడా .... సింగరాజు లింగరాజుల్ని వదిలెయ్యండి .... ఆ తొందర ఉంటుంది. అందులో వృద్ధాప్యం కూడా వస్తే కోడలు కోసం తహతహలాడటం సహజం. ఆ తహతహ అత్తగారి కెంత ఉంటుందో మామగారికీ అంత ఉంటుంది. అయితే ఆయన మొగమారాజు కనక బయటపడడు. అంతే.

శాస్త్రిగారికి రాధను చూస్తోంటే ఆమె తన కోడలవుతే బాగుండు ననిపిస్తోంది. ఆ అమ్మాయి అందచందాలు, వినయం, వందనం ఆయన్ను ఆకర్షించాయి. తండ్రి వ్యాపారస్థుడని సారధి చెబుతున్నాడు. కనుక గౌరవనీయమైన కుటుంబమే అయిఉంటుంది. గోత్రమూ అవీ తెలిస్తే జాతకాలు సరిపోతే పెళ్ళి చేయించేయొచ్చు. కాని ఈ విషయం కదపటం ఎలా ? తనే అడగటం బాగుండదు

ఆయన సారధి వంక చూశాడు. అతనూ తన వంకే చూస్తూండటం గమనించి "ఏమిటోయ్?" అన్నాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు ?" అన్నాడు సారధి.

"ఏదో" అన్నాడు శాస్త్రిగారు ఆవలించి నవ్వుతూ.

వంటింటి దగ్గర్నుంచి అన్నపూర్ణమ్మగారు కేక వేసింది. "నా పూజ అయిపోయింది. వడ్డించమంటే వడ్డిస్తాను" అని.

"భోంచేద్దాం" అన్నాడు సారధి.

నలుగురూ లేచారు. చాప తీసి తోపల పెట్టించి, చెట్లకింద విస్తరాకులు వేయించాడు సారధి. శాస్త్రిగారు చొక్కా విప్పి రావడానికి పెంకుటింట్లోకి వెళ్ళారు.

"ఏం బావగారూ ! అంత మవునంగా ఉన్నారు?" అన్నాడు సారధి.

రామకృష్ణ మాట్లాడలేదు.

అతని పక్కగా కూర్చుంటూ "భయపడకండి బావగారూ అంతా సుఖాంతమే అవుతుంది!" అన్నాడు సారధి.

"ఏమో ! .... చెప్పినవన్నీ అబద్ధాలని తెలుస్తే ఆయన దూర్వాసుడై పోతాడు. అదే భయంగా ఉంది" అన్నాడు రామకృష్ణ.

"పిచ్చివాడా !" అన్నాడు అతని భుజంమీద చరుస్తూ సారధి.

శాస్త్రిగారు తిరిగి వచ్చాడు. "నాలుగు విస్తళ్ళు వేశా రేమిటోయ్ ? రాధ రాదూ ?" అన్నాడు కూర్చుంటూ.

"వడ్డనలో అత్తయ్యగారికి సాయం చేస్తుంది!" అన్నాడు సారధి,

"నీ పద్ధతి నా కేం నచ్చలేదు సారధీ ! చుట్టమై చూడొస్తే దెయ్యమై పట్టుకున్నా రని ...." అన్నాడు చిరుకోపంతో శాస్త్రిగారు.

"ఫరవాలేదు లెండి" అన్నాడు సారధి నవ్వుతూ.

రాధ వంటకాలన్నీ తెచ్చి వడ్డిస్తూంటే ఆమె వంక పరిశీలనగా చూడసాగాడు శాస్త్రిగారు. వడ్డనలో ఆ పొందికా, మర్యాదా చాలామందికి అలవడవు. మాలతికి అసలు వడ్డనే చాతకాదు.

"గోంగూరపులుసు చేశారే ?" అన్నాడు శాస్త్రిగారు ఔపోసన పట్టి నాలుగు మెతుకులు నోట్లో వేసుకున్నాక.

"మీ ఫేవరిట్ కదా అని" అన్నాడు సారధి.

భోజనాలు సాగుతున్నాయి. వడ్డనకి అన్నపూర్ణమ్మగారు అసలు రాలేదు. అంతా రాధే చేస్తూండటం చూసి మనసులోనే భార్యమీద విసుక్కున్నాడు శాస్త్రిగారు. ఎంత చేతనయినా ఆ అమ్మాయి చిన్నపిల్ల. పైగా అతిథి. బాధ్యత ల్ని తప్పించుకోవటానికి ఎంత ఇదిగా ప్రయత్నిస్తారు ఈ ఆడవాళ్ళు ?

"ఏమిటమ్మా ?" అన్నాడు శాస్త్రిగారు రాధ ఏదో అన్నట్లయి ఆలోచనల్లోంచి బయటకు వస్తూ.

"పులుసు మరికాస్త వెయ్యమంటారా ?" అన్నది రాధ తిరిగి.

"ఏమిరా, రాముా! మీ తాతయ్యగారి తొడ అలా వాచిపోయిం దేమిరా?"

"అబ్బే...ఏమీ లేదురా... నిన్న కోవెలలో జరిగిన పాట కచ్చేరికి వెళ్ళారులే. అందుకని."

—ఎగ్గోని అవనిజ (గుత్తి)

"వడ్డించు."

ఆయన చాలన్నా వినకుండా మరి కాస్త వడ్డించి వెళ్ళిపోయింది. రాధ. 'ఏమో అనుకొన్నాను. మొత్తానికి గడుసు పిల్లే' అనుకున్నాడు శాస్త్రిగారు.

"ఎలావుంది మామయ్యగారూ పులుసు ?" అన్నాడు సారధి.

"మీ అత్తగారి వంటకి వంక ఉంటుందిటోయ్ ? .... బ్రహ్మాండంగా ఉంది" అన్నాడు శాస్త్రిగారు పులుసులో వెల్లుల్లిపాయను తనివితీరా కొరుకుతూ.

"పులుసు అమ్మ చెయ్యలేదు నాన్నా" అన్నది మాలతి.

"మరి."

"రాధగారు చేశారు."

శాస్త్రిగారు భార్య బద్ధకాన్ని నిందించాలో రాధ పాకశక్తిని అభినందించాలో తేల్చుకోలేక "అలాగా ?" అన్నాడు.

అయితే మరు క్షణాన ఆయనకు రాధమీద ఎక్కడలేని ఆపేక్ష పుట్టుకువచ్చింది. 'ఆంధ్రమాత' ను అంత రుచికరంగా తయారు చేసినందు కయినా కావచ్చు. లేక ఆమె అంత చనువుగా కాబోయే (!) అత్తగారికి సాయం చేసినందు కయినా కావచ్చు. ఏమయినా భోజనప్రియు డయినవాడికి తన ఇష్టమైన ఆధరువును అమృతప్రాయంగా వండిపెడితే అతని ఆనందానికి, వంట చేసిన వారిమీద కలిగే ఆపేక్షకు అంతు ఉండదు.

ఆయన ఒక నిశ్చయానికి వచ్చాడు. ఆ అమ్మాయికి సారధి ఎలాగూ చుట్టమే గనక 'ఆ మాటలు అతనిచేత మాట్లాడించేస్తే 'అది' కాస్తా చేసెయ్యొచ్చు. రామకృష్ణ నేడో రేపో ఉద్యోగంలో జేరతాడు. ఏ నాగార్జునసాగర్‌లోనో జేరి అక్కడి ఏ వర్కింగ్‌గర్ల్‌నో కట్టుకుంటానంటే పరువు పోతుంది.

రాధ శాస్త్రిగారికి నచ్చింది.

భోజనాలు అయిపోయినాయి. రాధ తెచ్చిచ్చిన కిళ్ళీ వేసుకుంటూ అప్పటిదాకా ఆమెను గురించిన ఆలోచనలోనే ఉన్న శాస్త్రిగారు "ఇక నువ్వెళ్ళి భోంచేయమ్మా ! .... మీ అత్తగారు తరవాత భోంచేస్తుంది. ముందు నీకు వడ్డించమను" అన్నాడు.

రాధ సిగ్గుతో అక్కడినుంచి పరుగెత్తింది.

(62 వ పేజీ చూడండి)



కానివారని తెలిసేటంతవరకు అందరూ అయినవారే. ఇది తెలుసుకొనడమెట్లా అన్నదే ప్రశ్న. అంతా బాగా ఉన్నంతకాలమూ అందరూ అయినవారుగానే కనుపిస్తారు. ఇంతకూ అయినవారు ఎవరు? మనతోబాటు మన ఆనందంలో మాత్రమే కాక మన కష్టసుఖాలలోనూ పాలుపంచుకొనేవారనే కదా మనభావన? దీనికి విఘాతం సంభవించినప్పుడు మనసుకు కష్టం కలుగక మానదు. కాని అన్నిసందర్భాలలోనూ అలాంటిది ఇతరులకు మాత్రం సాధ్యమా అని ఆలోచించరు. ఈ ఆలోచనే కనుక ఉంటే, కానివారూ ఒకప్పుడు అయినవారు అవుతారేమో!

ప్రపంచంలో 'అయినవారు' అనుకున్నవారు అరుదుగా ఉంటారు. 'కానివారు' కావలసినంతమంది ఉంటారు. మనకు పైవారిద్దరిలో భేదము తెలీక, వారితో సంప్రదించడములో ఒక్కొక్కసారి మన మనస్సు చివుక్కుమంటుండడం సంభవిస్తుంది.

సీత బి. ఎ ప్యాసయింది. ఆవిషయం అందరికీ చెప్పబుద్దేసింది సీతకు. బంధువులందరికీ ఉత్తరాలు వ్రాసింది. వారందరిలో సంతోషిస్తూ జవాబులు వ్రాసింది కొద్దిమందే. కొందరు పాపం, ఆనందించామని గాని, విచారించామనిగాని జవాబే వ్రాయలేదు. అల్లా జవాబివ్వకపోవటమూ సీతకు నిజంగా కష్టం కలిగించింది. ఆ విషయాన్ని పాపం ముఖ్యస్నేహితురాలయిన నాతో చెప్పింది. నేను దానిని తిట్టాను. 'అసలు ఉత్తరాలు ఎందుకు వ్రాశావూ' అని. 'ఏం అల్లా వ్రాయటం తప్పా!' అని అడిగింది. నేను దానికి అప్పుడు చెప్పాను. 'నీకు నీ ఆనందాన్ని అంతగా అందరూ పాలుపంచుకోవాలని ఉంటే రోడ్డుమీద పోయేవాళ్లకు చెప్పు. నిజంగా వాళ్ళు సంతోషించినంతగా ఎవరు సంతోషిస్తారు? వారు మనఃపూర్వకంగా 'మంచిది అమ్మా' అనో, 'మంచి చదువులు చదువు తల్లీ!' అనో అంటారు. అల్లా అనగానే సీత, 'అది కాదే, ఏం, పాసయినందుకు మంచిది అనో, ఈపైన ఏం చదువుతావూ? ఎం. ఏ. లో చేరుతున్నావా? అనో వ్రాస్తే వాళ్ల సొమ్మేం పోయిందీ' అంది.

మనం సాధారణంగా కానివారిదగ్గరికి పోనూపోము, మనవిషయాలు వారికి చెప్పనూ చెప్పము. ఒక పెళ్లి కుదిరిందన్నవిషయం మనం 'ఒకళ్ళతో' చెప్పుదామనుకుంటాము. ఆ 'ఒకళ్ళు' మనకళ్లకు 'అయినవారి'గానే కన్పడతారు. 'చూడండీ, అమ్మాయి పెళ్లి కుదిరింది' అంటామనుకోండి. 'ఊహూ, పాపం, కట్నండబ్బూ అదీ కూడబెట్టడం కష్టమే. అమ్మాయికి నగలు పెట్టాలి గదా?' అంటారు. మనం గొప్పవారమయితే ఫరవాలేదు. లేకపోతే కష్టముగా ఉంటుంది. 'ఆ చేసెయ్యండి, అన్నిటికీ భగవంతుడే ఉన్నాడు, ఏమీ బెంగపెట్టుకోకండి, మేమంతా లేమా?' అంటే ఎంత బాగా ఉంటుందీ'? 'ఊహూ, ఆడపిల్ల పెళ్లిచేయడం కష్టమే,' అని నిట్టూర్పుడం చూస్తుంటే అసహ్యంవేస్తుంది.

మొన్న నేను మా స్నేహితురాలింటికి వెళ్లాను. నేను వెళ్లేటప్పటికి మా స్నేహితురాలు స్నానం చేస్తోంది. వాళ్ల అమ్మ ముందు వరండాలో కూర్చుని బియ్యం ఏరుతోంది. నేను వెళ్లగానే కూర్చోమంది నేను కుర్చీలో కూర్చుంటూ. 'ఏమండోయ్, నాకు ఫలానా ఉద్యోగం వచ్చింది' రేపు వచ్చే పదవ తారీఖునాడు చేరడానికి వెడుతున్నాను' అన్నాను.


దానికి ఆవిడ, 'ఏమోనమ్మా, ఉద్యోగం అంటే మాటలా? ఎల్లా నెగ్గుకొస్తావో' అంటుంటే నాకు వళ్ళు మండిపోయి, 'అబ్బే ఫరవాలేదులెండీ, చూపిస్తా నా తడాఖా, ఎందుకు నెగ్గుకరాలేను' అన్నాను దానికి ఆవిడ, 'అదికాదు అమ్మాయీ. ఆడపిల్లలకు ఉద్యోగం అంత మంచిదికాదు' అని ఇంకేదో అనబోతుంటే వాళ్లమ్మాయి, అంటే నా స్నేహితురాలు, 'రావే పద్మా, డాబామీదకు పోదాం' అంటూ నన్ను లాక్కుపోయింది.

ఇంతకీ నే చెప్పొచ్చేది, అయినవారు అంటూ మనం ఏదో రాసుకు పూసుకు తిరగబోతాము. వారేమో 'అమ్మాయీ, నువ్వు మేము ఏం సంతోషిస్తామని మాకీ శుభవిషయం ఇంత పొద్దున్నే చెప్పడానికి వచ్చావూ?' అనే భావం మనకు కొన్నిసార్లు వెల్లడి చేస్తారు.

నేను ఇంటరు పాసయినపుడు, గబగబలాడుతూ మా మామయ్యగారింటికి ఈ విషయం చెబుదామని వెళ్లాను నిజంగా నే నెంత పాసవుతే మాత్రం నాకు గొప్పగాని, అందుకు ఆనందించమని అందరిళ్లకీ పోవడమేమిటి? పై విషయం నే నానందించాల్సిన విషయంగాని అందరితో చెప్పాలనే తాపత్రయమేమిటీ నాకు? అదో వెర్రికాకపోతే?

మా మామయ్యగారింటికి వెళ్లేసరికి మా మామయ్య ఇంట్లో లేడు. వాళ్ల పిల్లలందరూ ఆడపిల్లలే. ముగ్గురే లెండి! వాళ్లలో ఎవరూ ఫస్టుఫారమ్ దాకా కూడా చదవలేదు. నేను గబగబలాడుతూ 'అత్తయ్యోయ్, నేను ఇంటరు ప్యాసయ్యాను' అన్నా, 'ఊ .... హు .... ' అన్న మాట ఆవిడ నోటిలోంచి బలవంతంగా ఊడి పడింది. తరువాత నాకు ఏం మాట్లాడడానికీ తోచలేదు. ఆ సంభాషణ అంతటితో ఆగిపోయింది. నాకింకేం తోచక, 'ఆఁ వెడుతున్నా, మా ఫ్రెండింటికి వెళ్లాలి' అంటూ లేచి వచ్చేశా.

మనకు తక్కినవారందరూ మనవిషయాలపై ఆసక్తి చూపాలని, మన ప్రతిభను పొగడాలని ఉంటుంది. మనపైన కూడ ఇతరులకు అల్లాగే ఉంటుంది. మనవిషయాలపై ఇతరులెంత ఆసక్తి చూపిస్తే, మనం అంతగా వారివి



అయినవారి క్రింద జమ కడతాం. కొంతకాలం వరకు వారు అయినవారుగా ఉండి, చటుక్కున పుటుక్కుమని కానివారుగా మారిపోవడం మనకూ తెలీదు

మన విషయాలపై వారు ఆసక్తి చూపాలని కోరుతాం. కాని, వారు అట్లు చేయక దానిని తమాషాగా ఖండించి పారేస్తారు.

ప్రతి మనిషికీ ప్రతి విషయం అయిన వారితో ముచ్చటించాలన్న ఉబలాటం ఉండటం సహజం. అయిన వారంటే బంధువులే కదా ! వా రెంత దూరంలో ఉన్నా ఉత్తరాల ద్వారా ఒక విషయాన్ని గూర్చి పాలు పంచుకోవాలని ఆశిస్తాం. ఆ విషయం మంచిదే కానివ్వండి, చెడుదే కానివ్వండి, అది వేరే విషయం.

చూడండీ, అయినవా రెవరో, కానివా రెవరో ఎన్నుకొని మసలుకోవడంలోనే ఉంది మన నేర్పు, బ్రతుకు తెరువూను. మనకు అయినవారు స్వల్ప సంఖ్యలోనే ఉంటారు, ఈ ప్రపంచంలో.

మీరు అనవసరంగా రాసుకు పూసుకు పోయి, అమాయికంగా మీ విషయా లేమీ సంప్రదించకండేం. అనవసరంగా బాధపడతారు. ఆ తరువాత మీ ఇష్టం. ★

'సఖ్యము సాప్తపదీన' మను సూక్తి పురాణ కాలమునుండి నేటి వరకు ఆచరణలో నున్నది. అనగా ఏడు మాటలు మాట్లాడుకొనినంతలోనే స్నేహితు లగుదురు. ఈ మాటలే కుమార సంభవములో మాయావటువు, తపస్సు చేసుకొను చున్న పార్వతితో అన్నాడు. కాని నేడు కొన్ని సంవత్సరములు సహవాసము చేసి, కొన్ని కోట్ల మాటలు మాట్లాడుకొనినను నిజమగు మిత్రులు లభించుట లేదు. 'నేను అందరితోను మాట్లాడు చున్నాను. గనుక, నా కందరు స్నేహితులే' యను కొనుట యవివేకము. నిజమగు మిత్రులు ప్రతి వారికి ఒక రిద్దరికంటె నెక్కువగా ఉండరు. కష్టములలో పాలుపంచుకొనువారు, తమ రహస్యములను దాచి, తమ వేదనల నుపశమింపజేసిన వారే నిజమగు మిత్రులు. నిజమగు స్నేహితులు. బయట పడుటకే కాబోలు మానవుల కప్పు డప్పుడు కష్టములు సంభవించుచుండును.

నిజమగు మిత్రులు లెన్నడును భోగభాగ్యము లను కాంక్షించరు. అట్లు కాంక్షించువా రసలు మిత్రులే కారు. సజ్జన సహవాసమును గూర్చి భాగవతములో నొక చక్కని యుదాహరణము గలదు. ఎప్పుడో బాల్యములో కలిసి చదువుకున్న కారణమున పెద్దవారైన తరువాత అంతస్థులో వేరైనను, మహాసామ్రాజ్యవిభవము తో తులతూగుచున్న శ్రీకృష్ణుడు పేద చేలికాడగు కుచేలుని యాదరించి, గత స్నేహమును జ్ఞప్తికి దెచ్చి సకల సంపదల ప్రసాదించి యనుగ్రహించెను. నేడట్టి స్నేహితు లెక్కడనో కాని దొరకరు. ఎవ్వరైన గొప్ప చదువులు చదివిన, గొప్ప పదవిలో నున్న అట్టి స్నేహితులనే జ్ఞప్తి యుంచుకుందురు. వారు విదిలించుకొనుచున్నను, వారి చుట్టును పది సార్లు తిరుగుదురు. పరిస్థితుల ప్రభావమున పతనమైన వారిని బాల్యములో ప్రాణ స్నేహితులైనను నేడు స్నేహితులుగా చెప్పుకొనుటకును, వారిని బల్కరించుటకును జంకి

సఖ్యం - సాప్తపదీనం

రింపదు నేటి నవనాగరిక సంఘము.

ఆంగ్లములో 'నీ స్నేహితులను చెప్పినచో, నీ కెట్టి వాడవో చెప్పుదు నను' సూక్తి కలదు. అట్లే మన మాతృభాషలో కూడ 'వియ్యమునకు, నెయ్యమునకు సమాన ఉజ్జీ యుండ వలయు' నను లోకోక్తి కలదు. వీని రెంటి యర్థము తరచి చూచిన నొకటిగానే కనుపించును. అట్లని ఎప్పుడును మంచివారు, మంచి వారితోను, దుర్జనులు దుర్జనసహవాసమును చేయుదు రనియు, చేయవలయు ననియు వాశింపరాదు. పూర్తిగా మంచి గుణములు, లేదా పూర్తిగా దుర్గుణములు ఏ ఒక్క వ్యక్తిలోను నుండవు. వెలుగు చీకట్ల కలయికవలె మంచి, చెడు ప్రతివ్యక్తిలోను కలిసియుండును. వీనిలో మంచి ఎక్కువగా నున్న మంచివానిగను, చెడు ఎక్కువగ నున్న చెడ్డవానిగను లోకులు పరిగణింతురు. కాని సజ్జనులైన స్నేహితులు తోటివారి లోని మంచిని గ్రహించి వారి స్నేహమును పెంపొందించుకొందురు. అంతేగాని చెడ్డవారిని దూరముగా ఉంచి ప్రతిసారి చెడునే వేలెత్తి చూపినచో వారింకను పతనమై పోవుదురు. ఈ సంగతి గుర్తుంచుకొని వారిని కూడ సక్రమ మార్గములో నడిపింపగల సామర్థ్యము సజ్జన సహవాసమున కసాధ్యము కాదు.

"మొదట జూచిన కడు గొప్ప, పిదప గురుచ
అది కొంచెము తర్వాత నధిక మగుచు,
దనరు దిన పూర్వపరభాగ జనితమైన
ఛాయ పోలిక కుజన సజ్జనుల మైత్రి"

అను సుభాషితములలోని పద్యముమ ప్రతి ఒక్కరు అనుక్షణము జ్ఞప్తియం దుంచుకొన వలయును. స్నేహమును సాయంకాలపు నీడవలె పెరుగనీయ వలయును. సూటి పోటి మాటలని ఎదుటివారి మనస్సును నొప్పించకూడదు. 'మనసు విరిగెనేని మరి యంటనేర్చునా !'' స్నేహమనే విత్తనమును జాగ్రత్తగా నాటి, సహృదయ మనే నీరు పోసి మహా వృక్షముగ చేయవలయును.

ముద్రారాక్షస నాటకములో చందనదాసు తన మిత్రుడును, నందుల మంత్రియు నగు రాక్షసుడు ఆపదలో నుండగా నతని కుటుంబమును తన యింట దాచి, తా నాపదల పాల్పడినను, తుద కురికంబ మెక్కినను వారిని శత్రువులగు చాణుక్య చంద్రగుప్తుల కప్పగించలేదు. ఈ విధముగా నతడు రాక్షసుని యెడ నిజమగు మైత్రిని జూపినాడు. అట్లే రాక్షసుడు రానున్న ఆపదలను లెక్కింపక చందనదాసును రక్షింప ముందున కొచ్చి సకల కృత్యములను ఆచరించుటకు కారణమైన "మిత్ర స్నేహమునకు నమస్కారమని'' మన్ననల నందెను.

ఆటువంటి సజ్జనసహవాసమును గూర్చి చెప్పుటకు నా వంటిది ప్రయత్నించుట కొండను త్రవ్వి చిట్టెలుక ప్రయత్నించినట్లు. అందుచే నేను కూడ మిత్ర స్నేహమునకు నమస్కారమని చెప్పుచు ముగించుచున్నాను.

కుమారి చీర్ల రత్నమాంబ ★

ఊలుతో స్వెట్టరు

22—2—61 తేదీ ఆంధ్ర సచిత్రవార పత్రికలో సోదరి సీతగారు (కావలి) 7, 8 సం. ల పిల్లలకు (మగ) సరిపోవు స్వెట్టరు అల్లే విధానము తెలియజేయమన్నారు. నాకు తెలిసిన విధముగా వ్రాయుచున్నాను. నేను వ్రాసే స్వెట్టరు మగపిల్లలకే గాక ఆడ పిల్లలకు కూడ బాగుంటుంది.

కావలసినవి—మీకు ఇష్టమైన రంగు ఊలు 2½ ఆవున్సులు, 11 వ నంబరు సూదులు-2.

అల్లే విధానము: పదకొండవనంబరు సూదులతో మొదట 64 రింగులు వేసుకోవాలి. తరువాత రెండు గొలుసులు, రెండు ముళ్ళు చొప్పున సుమారు 2 అం. పొడవు బెల్టు అల్లుకోవాలి.

బెల్టు అల్లిన తరువాత మూడు గొలుసులు, రెండు ముళ్ళు చొప్పున 64 రింగులు సుమారు 4 అం. పొడవులో బోర్డరు అల్లుకోవాలి. తరువాత చేతులు మొదలుపెట్టాలి.

చేతులు అల్లే విధము: బోర్డరు అల్లిన తరువాత కుడిప్రక్క ఒక రింగు, ఎడమ ప్రక్క ఒక రింగు చొప్పున 10 రింగులు అల్లుతూ తగ్గిం

డొంకాడ జయలక్ష్మి

చాలి. అనగా చివరన రెండు రింగులలో గుచ్చి సూదితో ఒక రింగు లాగవలెను. ఇలా కుడిప్రక్క ఎడమప్రక్క మొత్తము 20 రింగులు తగ్గించాలి. తగ్గించేటప్పుడ చేతుల చివర రెండు ప్రక్కలా 5 గొలుసులు వేసుకోవాలి. (అంటే బోర్డరుకు బదులుగా 5 గొలుసులు వేసుకుంటే బెల్టులాగ వచ్చి చాలా బాగుంటుంది.) తిరగేసి అల్లేటప్పుడు గూడ 5 గొలుసులే వేసుకోవాలి. లేకపోతే బెల్టులాగ రాదు. తరువాత మెడ మొదలు పెట్టాలి.

మెడ అల్లే విధానము: చేతులు అల్లేటప్పుడు కుడిప్రక్క 10 రింగులు ఎడమ ప్రక్క 10 రింగులు తగ్గించగా 44 రింగులు మిగులుతాయి కదా ? ఈ 44 రింగులలోను సగము రింగులు ఒక సూది మీదకు అల్లుకోవాలి. 22 రింగులు వస్తాయి. ఈ 22 రింగులలోను అల్లుతున్నప్పుడు మెడ దగ్గర (కుడి ప్రక్క) ఒక్కొక్క రింగు చొప్పున 5 రింగులు తగ్గించుకోవాలి. తగ్గించేటప్పుడు ముందు చేతుల దగ్గర 5 గొలుసులు ఎలా బెల్టు వేసుకున్నామో అలాగే వేసుకొని అల్లుకోవాలి. ఇలా రెండు ప్రక్కలా బెల్టు వేసుకుంటూ మధ్య బోర్డరు అల్లుతూ సుమారు 3½ అం. వరకు అల్లి తరువాత ముందు మనము మెడ అల్లుటకు తగ్గించిన 5 రింగులు హెచ్చించుకోవాలి. (ఒక్కొక్కటి చొప్పున) తరువాత అక్కడి ఊలు తెంపి ముడివేసుకోవాలి. ఇప్పుడు ఒక ప్రక్క మెడ ఒక ప్రక్క చేతులు పూర్తి అయినవి. ఇప్పుడు మరలా మిగతా 22 రింగులు తీసుకుని మొదట ఒక ప్రక్క ఎలాగ అల్లితిమో అలాగే అల్లుకోవాలి. ఇలాగ రెండవ ప్రక్క గూడ అల్లిన తరువాత మెడ పూర్తి అయి, గుండ్రముగా ఉంటుంది. ఇది పూర్తయినతరువాత లెక్కపెడితే 44 రింగులు ఉంటాయి. ఈ 44 రింగులతోను మామూలుగాను బోర్డరు అల్లుకొని చేతులు చివరికి వచ్చేటప్పటికి మొదట 10 రింగులు కుడిప్రక్క, 10 రింగులు ఎడమ ప్రక్క తగ్గించిన దగ్గర మనం అల్లుతున్నది దానికి సరిగా దాని అంత పొడవు అల్లుకొని మొదట మనము తగ్గించిన రింగులు ఒక్కొక్కటి హెచ్చించాలి. అంటే రెండు ప్రక్కల ముందు తగ్గించి 20 రింగులు హెచ్చించి అల్లాలి.

ఇలా హెచ్చించిన తరువాత మొదట మనం ఎన్నిరింగులు వేసుకున్నామో అన్నిరింగులు వస్తాయి. అనగా 64 రింగులు వస్తాయి. తరువాత మామూలు బోర్డరు వేసుకుంటూ అంటే 3 గొలుసులు 2 ముడులు చొప్పున అల్లుకొనుచూ మనము ముందు ఎంతవరకు అల్లితిమో అంతవరకు బోర్డరు అల్లుకోవాలి. తరువాత బెల్టు ముందు అల్లిన విధముగానే 2 గొలుసులు 2 ముళ్ళు వేస్తూ దానితో సమానముగా బెల్టు అల్లుకోవాలి. తరువాత తిరగేసుకుని అంటే 3 ముళ్ళు 2 గొలుసులు వచ్చిన వైపు బొంత కుట్టే సూదికి ఒక అర గజము ఊలు (స్వెట్టరు అల్లే కలరు) ఎక్కించి వారకుట్లు రెండు కలిపి రెండు ప్రక్కల (రెండు కుడి ప్రక్కలు, రెండు ఎడమ ప్రక్కలు) కుట్టవలెను. ఇంతటితో స్వెట్టరు పూర్తి అయినది. అన్నమాట.

ఈ స్వెట్టరు అల్లిన తర్వాత చూచుటకు గీతలుగా బోర్డరుఉండి చాలా బాగుంటుంది. మఫ్లరు అల్లుట తెలిసినవారికి ఇది చాల సులభముగా ఉంటుంది. అల్లకము తెలియక పోయినా 3, 4 సార్లు చదివి అర్థము చేసుకున్న వారికి అల్లుటకు సులభముగా కన్పిస్తుంది. సోదరీమణులంతా స్వెట్టరు అల్లడానికి ప్రయత్నించండి. ప్రయత్నిస్తారు కదూ! ★



వనితా వాణి

సరళ సలహా ఆమోద యోగ్యం కాదు

బొద్దుగా ఉండేవారు సన్నపడాలంటే ఉపాయాలు తెలియజేయమని మేడూరునుండి ఒక సోదరి కోరితే శ్రీమతి సరళగారు తన అభిప్రాయము 1—3—61 వ తేదీ ఆంధ్ర సచిత్ర వారపత్రికలో యిచ్చారు. బొద్దుగా, సన్నగా ఉండడం వారి శరీర తత్వమనీ, బొద్దుగా ఉన్నవారు శాంతమూర్తులనీ సన్ననివారు అతి కోపిష్టులనీ, అది ప్రకృతిసిద్ధమని ఇంకా శ్రీ సరళగారు ఏమేమో వ్రాశారు.

బొద్దుగా ఉండేవారిలో రెండు రకాల మనుషులున్నారు. ఒక రకము :—జన్మత: బలంగా, ఆరోగ్యంగా ఉంటూ బొద్దుగా ఉంటారు. వీరు అంత లావుగా ఉన్నా ఛాతీ చుట్టుకొలత ఎక్కువగానూ, నడుము చుట్టుకొలత తక్కువగానూ ఉంటుంది. వీరు స్వభావసిద్ధమైన దారఢ్యంతో ఉంటారు గాన వీరిని చూచి ఎవరూ అసహ్యపడరు. అంతేగాక నిత్య జీవితంలో వీ రేమాత్రం బాధపడరు.

రెండవ రకము :—బాల్యములో సన్నగా ఉండి వయస్సు పెరిగినకొలదీ లావు పెరిగి, బొద్దుగా తయారవుతారు. వీరి ఛాతి చుట్టుకొలత తక్కువ. నడుము చుట్టుకొలత ఎక్కువగా ఉంటుంది. ఇది అనారోగ్యానికి చిహ్నం. కృత్రిమ బొద్దుతనము గాన వీరిని చూచి కొంద రసహ్యపడవచ్చును. వీరికి నిత్యజీవితంలో చాలా బాధ ఉంటుంది. కాన దీనిని పోగొట్టుకొనుటకు వీరికి తగిన సలహా కావాలి. ఆహార మార్పులు, వ్యాయామము, అవసరమైన ఔషధసేవ ద్వారా ఈ బొద్దుతనమును పోగొట్టుకొనవచ్చును. అనారోగ్య కారణంగా బొద్దుతనము వచ్చినవారిని చూచి జాలిపడాలి గాని అసహ్యపడరాదు.

చంద్రలోకానికి ప్రయాణం చేయ ప్రయత్నించే ఈ విజ్ఞాన ప్రపంచంలో బొద్దుతనాన్ని, కల్యావశిష్టాన్నీ మార్చడం అసాధ్యం కాదు. తల్లిదండ్రుల స్వభావాన్ని, శారీరక, మానసిక మార్పులను బట్టి వచ్చే సౌమ్య, సహనత్వ, క్రోధత్వాలకు శరీరం లావు, సన్నాలను అంటగట్టడం సమంజసంగాదు. అవసరమైనప్పుడు సన్నపడాలని కోరడమూ మూర్ఖత అనిపించుకోదు.

కోలాహలం వెంకటసుబ్బమ్మ (మిర్యాలగూడెం)

(మా) వనితాలోకం శీర్షిక రానురాను అంతగా అభివృద్ధిలోకి వస్తూందంటే ఆ ఘనత, మా వనితలదే అని చెప్పుటలో అతిశయోక్తి లేదనుకుంటాను. 1—3—61 వ తేదీ ఆంధ్ర సచిత్ర వారపత్రికలోని సరళగారి సలహా ఏమాత్రం బాగుండలేదని చెప్పుటకు విచారిస్తున్నాను. సన్నవారికి చాలా కోపం ఉంటుందని, అసహనము ఎక్కువని, బొద్దుగా ఉండేవారికి నిదానం, సహనం అధికముగా ఉండునని వ్రాశారు. వారి అభిప్రాయము మంచిదికాదని నా అభిప్రాయము. గాంధిజీ సన్నముగానే కదా ఉండేవారు. వారెంత శాంతస్వభావులో, ఎంత సహనము కలిగి ఉండెడివారో అందరికీ తెలిసినవిషయమే. ప్రపంచ శాంతిదాతయని పేరుగాంచిన నెహ్రూజీ లావుగానే ఉన్నారా ? ఇలాగే సన్నటివాళ్లలో ఎంతమంది శాంతస్వభావులు లేరు ? ప్రత్యేకంగా సన్నటి వాళ్లలోనే కోపమెక్కువగా ఉండునను వారి అభిప్రాయము ఇకమీదటన్నా మార్చుకొందురని ఆశిస్తున్నాను.

కుమారి సౌదామిని కొమ్మిరెడ్డి (దరిశి)

* * *

1—3—61 వ తేదీ వారపత్రిక చదివాను. సరళగారి సలహా ఒకమారు చదివితే బాగానే ఉంటుంది. కాని రెండవ సారి చదివితే మెదడుకు కొంచెం పని కల్పిస్తుంది. విగ్రహపుష్టిని బట్టి వారివారి స్వభావాలను సూచించగల సరళగారి మేధాశక్తికి మా జోహార్లు ! ఈ సలహాలోని మూడు, నాలుగు పేరాలు చాలా అసందర్భంగానూ, అస్తవ్యస్తంగానూ ఉన్నాయని వ్రాయడానికి చింతిస్తున్నాను. సరళమైన సలహా యివ్వగల సరళగా రిలాంటి మొరకైన సలహా నెందుకిచ్చారో అర్థంకాకుండా ఉంది. దీనినిబట్టి ఆలోచిస్తూంటే నాల్గవ పేరాలో చెప్పినట్లుగా సరళగారి స్వరూపం కొట్టవచ్చినట్లు కన్పిస్తూంది. పరిస్థితులనూ, పరిసరాలనూ బట్టి మానవ ప్రకృతి మారుతూంటుందనీ — సన్నపాటివారి లోనూ ఎక్కువమంది సౌమ్యులు, బొద్దుగా ఉండేవారిలోనూ ఎక్కువమంది కోపిష్టులూ ఉన్నారనీ సరళగారు సరళంగా గుర్తిస్తారని ఆశిస్తాను .... సెలవ్.

కుమారి ఎస్. ఎ. ఎన్. రాధ (రాజమండ్రి)

* * *

1-3-61 వ తేదీ ఆంధ్ర సచిత్ర వారపత్రికలో సరళగారి సలహా చదివాను. లావుగా ఉండేవాళ్ళు సౌమ్యస్వభావులు, వారు సన్నబడటానికి ప్రయత్నింతనవసరంలేదని వ్రాశారు. కాని సన్నగా ఉండేవారు కోపస్వభావులని గూడ పేర్కొన్నారు. అటువంటప్పుడు సన్నగా ఉండేవారు లావెక్కవలసిన అవసరం లేదంటారా ?

సన్ననివాళ్ళు లావెక్కడానికి ఏమేమి చేయాలో పత్రిక ద్వారా సరళగారు తెలుపుతారని ఆశిస్తాను.

కె. యశోద (వాల్తేరు)

* * *

మాటల్లో మంచితనం

ఈమధ్య పత్రిక మరీ ఆకర్షణీయంగా ఉంటోంది. ముఖ్యంగా వనితాలోకం. ఈ శీర్షిక క్రింద ప్రచురింపబడుచున్న వ్యాసాలు మా వనితలకు ఎంతో ఉపయోగకరం. 1-3-61వ తేది పత్రికలో శ్రీమతి సత్యవతీదేవిగారు వ్రాసిన "మాటల్లో మంచితనం" అను వ్యాసం చాలా బాగుంది. మనలో చాలమందికి తరచూ కలిగే అనుభవాలే వారు వర్ణించినప్పటికీ ఎంతో బాగుంది. "ఎదుటివాళ్ల హృదయాలకు హత్తుకొనేలాగ మాట్లాడే నేర్పు ఉన్ననాడు మనం సాధించలేని పనిలే దీ ప్రపంచంలో" అని వ్రాశారు. ప్రపంచం మాట ఎలా ఉన్నా కనీసం మన నిత్యావసారాలనయినా సఫలంగా సాధించుకోగలుగుతాం, అటువంటి నేర్పు ఉన్ననాడు.

ఎస్. వనజ (విజయవాడ—2

* * *

1—3—61 వ తేదీ ఆంధ్ర సచిత్ర వారపత్రికలో వి. సత్యాదేవిగారు వ్రాసిన మాటల్లో మంచితనం చాలా బాగుంది. వారికి నా అభివందనములు పత్రిక ద్వారా తెలియజేయ కోరెదను.

గనిపెట్టి ధనలక్ష్మి (విజయపురి సౌత్)

* * *

మొన్న పత్రికలో సోదరి సత్యవతీదేవి గారి వ్యాసం 'మాటల్లో మంచితనం' నన్ను ఆకర్షించింది. ఆ వ్యాసం ఆవిడ చాలా బాగా వ్రాశారు.

కె. రంగనాయకి (నర్సాపురం)

* * *

ఈ వారం పత్రిక (1—3—61) లో వి. సత్యవతిగారి "మాటల్లో మంచితనం" అనే వ్యాసం చాలా బాగుంది.


"అన్నిటినీ మరిపింపచేసేది, మురిపింపజేసేది, మంచి మాట. మనిషికి అంతకు మించిన ప్రతిఫల మేమీ లేదు" అనే సత్యవతిగారి సూక్తులు ఎన్నటికీ మరువలేనివి.

వి. సరోజినీదేవి (ఉయ్యూరు)

* * *

1—3—61 వ తారీకు ఆంధ్ర సచిత్ర వారపత్రిక వనితాలోకములోని 'మాటల్లో మంచితనము' అను వ్యాసము వి. సత్యవతీదేవిగారు వ్రాసినది చాలా బాగున్నది. చిన్న పిల్లలకైనా సరే. మంచిమాట లాడి చదువుకోమని చెపితే చదువుకుంటారు కాని, నీవుగాని చదవకపోతే నాలుగు జెల్లకాయలు తగిలిస్తాను అని బెదిరిస్తే వారు మరీ మొండి కెత్తుతారు. కాబట్టి వారు మంచి

1




2



3



4



శిరోజాలంకరణ

చిత్రాలు - దేవిక

1. ముంగలికేశుతో కట్టుకున్న జడ. 2. అజంతా సిగ అలంకారాలు. 3. శిరోజాలను కుదురు పెట్టి రిబ్బను ముడి. 4. రెండు జడల జత. 5. అజంతా రెండు సిగల జడ. 6. ముంగలి కేశులు నాగరకతకు తగ్గట్టు అలంకరించుకొన్న వైనం. 7. రెండు జడలను చెరో పక్క చుట్టుకొని పువ్వులు కలిపి ఉంచుకోడం ఒక్క క్రొత్త సింగారం. 8. పగడపువ్వులతో అల్లుకొని పగడపువ్వులే శిగలో తురుముకోడం వాలుజడకి అందం. 9. ఇప్పటి నాగరకతకు ముచ్చటైనది "హార్స్ టెయిల్". 10. అన్ని వేళలా హాయి నిచ్చే ముడి వెంట్రుకలు కిందికి వదలడం సరిక్రొత్త పద్ధతి.

5



6



7




8



9



10



వనితా వాణి

ఖైతే పూరుమంచిది అన్నారు పెద్దలు. చాలా బాగున్నది వ్యాసము.

పుష్పాల అంజిబీబాయి (అనకాపల్లి)

కేకులు

22—2—61 వ తేదీన ఎస్. ఎస్. బేగంగారు మా పత్రికలో కేకులుగురించి పాకశాలలో వ్రాశారు. నేను తయారు చేసినాను. చాలా బాగుగా కుదిరినది. మావారు చాలా సంతోషించినారు. బేగంగారికి నా ధన్యవాదాలు.

ఫాతిమా బేంగషి (పాయకరావుపేట)

* * *

'మూంతా'

1—3—61 వ తేదీ పత్రికలో కె. నిర్మలగారు వ్రాసిన విధముగా 'మూంతా' చేసి చూచినాము. చాలా బాగా కుదిరినవి. రుచి కూడా కొద్దిగా మైసూర్‌పాక్ రుచివలె ఉన్నది. కె. నిర్మల గార్కి మన పత్రిక ద్వారా నా ధన్యవాదాలు తెల్పుతున్నాను.

ఇమ్మానేని సంపత్కుమారి (మద్రాసు)

రసగుల్లా

మా ఇంట్లో 'రసగుల్లాలు' చాలాసార్లు చేసినాము. కాని ఒక్కసారైనా బాగుగా కుదరలేదు. అందువల్ల సోదరీమణుల కెవరికైనా రసగుల్లాలు చేసే విధానము తెలిసినయెడల ఆంధ్ర సచిత్ర వారపత్రిక ద్వారా తెలుపమని కోరుచున్నాము.

పెంటపాటి పార్వతి (విజయనగరం)

* * *

ప్లాస్టిక్ వైర్‌తో పువ్వులు

1—3—61 ఆంధ్రసచిత్ర వారపత్రికలో ఆర్. ప్రభావతీమూర్తిగారు ప్లాస్టిక్ వైర్‌తో పూలు అల్లటము వ్రాసినారు. అందు ప్రేముకు ఆకు పచ్చ వైరుతో ఆరు వైపుల ముడులు వెయ్యాలి అని వ్రాశారు. కాని బొమ్మలో ఎనిమిది వైపుల ముడులు వేసినట్లుగా చూపారు. నేను ఎనిమిది వైపుల ముడులువేసి అల్లినా ఫరవాలేదు, ఆరు వైపుల ముడులు వేసి అల్లినా ఫరవాలేదు అని అనుకొంటున్నాను. మీ ఉద్దేశము ఏమిటో పత్రిక ద్వారా తెలియపర్చ గోర్తాను.

ఎం. సుకన్య (వట్టిగుడుప్పాడు)

* * *

1—3—61 వ తేదీ ఆంధ్ర సచిత్ర వారపత్రిక వనితాలోకంలో ప్లాస్టిక్ వైరుతో పువ్వులు అను శీర్షిక వ్రాసిన ఆర్. ప్రభావతీమూర్తిగార్కి అభివందనములు. మేము శీర్షికలో ఉదహరించిన ప్రకారము పువ్వులను అల్లితిమి. చాలా అందముగా వచ్చినవి. అవి రోజాలు మాత్రమే. పువ్వును చూసినంత మాత్రమున అల్లుట రాదు. చాల గజిబిజిగా కన్పిస్తుంది. అల్లేటప్పుడు చూస్తే ఏమంత కష్టంకాదు.

శ్రీమతి లంక సూర్యభాస్కరమూర్తి
(విశ్వేశ్వరాయపురం)

★

పాకశాల: టాఫీ, గోజాలు: మధ్యాహ్నం టిఫిన్

15—2—61వతేది పత్రికలో శ్రీమతి ఆర్. సామ్రాజ్యమ్మ (పెనుమాక) గారు 'మధ్యాహ్నం టిఫిన్‌కొరకు పనికివచ్చే పిండివంటలు — కనీసం వారం రోజులు నిల్వ వుండేవి" తయారు చేయడం గూర్చి అడిగారు. నేను కొన్ని యిక్కడ తెలియ బరచుచున్నాను. :—

తీపి వంటలు : మనం సాధారణంగా మధ్యాహ్నము పూట తినడానికి లడ్డూ, మైసూర్‌పాక్, జిలేబి కజ్జికాయలు మొ॥ వాటిని చేస్తూ ఉంటాం. ఈ సంచికలో "టాఫీ", "గోజాలు" ఎట్లా చేయాలో తెలుపుతున్నాం :—

1. టాఫీ

కావలసిన వస్తువులు :

కొబ్బరికాయ	1.
చిక్కని పాల	1 పావు.
చక్కెర	¾పావు
నెయ్యి	1 ఛటాకు (5 తు)
బాదంపలుకులు	1 తులము.
చారపప్పు.	1 తులము.

తయారుచేయు విధము : కొబ్బరిని సన్నముగా తురిమి, వేడినీళ్ళు పోసి కొబ్బరిపాలను తీయవలెను. అనగా కొబ్బరికాయనుండి ఎన్ని పాలను రాబట్టగలమో అన్నిపాలను తీసి, ఒక శుభ్రమైన పలుచని బట్టతో ఆ పాలను వడగట్టవలెను. బాదం, చారపప్పులను 3, 4 గంటలు నీటిలో నాననిచ్చి, పై పొట్టు తీసి శుభ్రముగా కడిగి మెత్తగా నూరి ఉంచుకొనవలెను. దానిని పాలలో కలిపి ఈ మిశ్రమమును కొబ్బరిపాలలో కలుపవలెను. ఒక వెడల్పయిన గిన్నెలో ఈ మిశ్రమము నంతటిని పోసి కుంపటి మీద పెట్టి తిప్పుతూ ఉండవలెను. కొంచెము చిక్కబడిన తరువాత అందులో చక్కెర పోసి మరలతిప్పు చుండవలెను. అది "కోవా" మాదిరి దగ్గర పడిన తరువాత నెయ్యి పోసి 6, 7 నిమిషములు పొయ్యి మీదనే ఉంచి మరల త్రిప్పుచుండవలెను —అంటే నెయ్యి ఆ స్వీటులో ఇంకవలెనన్న మాట. ఒక పళ్లెమునకు కొంచెము నెయ్యి రాసి దీనిని కుమ్మరించవలెను. చల్లారిన తర్వాత మన యిష్టం వచ్చిన ఆకారములలో కోయవలెను. అలంకరణ (డెకొరేషన్) కావాలనుకునేవారు "వరఖ్"(స్వీటుకు ఉపయోగించే తెల్లని మెరుపు కాగితం) ను స్వీటు పైన అద్దినచో చూడడానికి అందముగా ఉంటుంది.

2. గోజాలు

(తీపి వంటలు)

కావలసిన వస్తువులు :

గోధుమపిండి	1 పావు
చక్కెర	1 పావు
ఉప్పు	¼ టీ స్పూను
నెయ్యి	1 టీ స్పూను
చారపప్పు	1 అర్ధ తులం

నెయ్యిగాని నూనె—వేయించుటకు

చేయు విధానము : జల్లించిన గోధుమ పిండిని తీసుకుని, 1 టీ స్పూను నెయ్యి వేసి బాగా కలిపి మూరిన ఉప్పు, తగినన్ని నీళ్ళు పోసి పూరీ పిండి మాదిరి కలుపవలెను. చారపప్పును 2, 3 గం. లు నీటిలో నాననిచ్చి పై పొట్టు తీసి నేతిలో వేయించి ఉంచుకొనవలెను. చక్కెరతో తీగ పాకం తయారుచేసి ఉంచుకొనవలెను. ఈ పాకంను సన్నని సెగమీద పెట్టి ఉంచవలెను. గోధుమపిండి ముద్దను బాగుగా పిసుకవలెను. చిన్న చిన్న ముద్దలు తీసుకుని పలుచగా (పూరీల మాదిరి గుండ్రముగా) ఒత్తి చారలు చారలుగా చివరలు తెగకుండా చాకుతో మార్కు పెట్టవలెను. తరువాత దాని చివరల దగ్గర మెలియబెట్టి





(ఈవిధముగా) అన్నింటిని తయారుగా ఉంచుకొనవలెను. పొయ్యిమీద బాణలి పెట్టి నెయ్యిగా పిండాల్డాగాని, లేక నూనెగాని పోసి అది కళపెళ కాగిన తరువాత వీటిని వేసి లేత గోధుమ రంగు వచ్చు వరకు వేయించవలెను. వేగిన వాటిని కొన్ని కొన్ని చొప్పున పాకంలో వేసి కొద్దిసేపు నానిన తరువాత వాటిని వేరుగా మరియొక గిన్నెలో పెట్టవలెను. అవి వేడిగా నున్నప్పుడు వేయించిన చారపప్పును వీటిమీద అక్కడక్కడ అద్దవలెను.

'సత్యవతి'

★



దైవజ్ఞ వాతూరి శ్రీరామమూర్తి

15-3-61 బుధవారం మొదలు
21-3-61 మంగళవారం వరకు

మేషం :

(అశ్వని, భరణి, కృత్తిక 1 పా.)

బాధ్యతను పైన పెట్టుకొనకుండా ముందుగా జాగ్రత్తపడగలుగుతారు. వృత్తి ఉద్యోగాలలో బుద్ధి బలంతో మీ పనిని సాధించుకుని అంతస్తును నిలుపుకో గలుగుతారు. సాటివారితో స్వల్ప విషయాలలో అభిప్రాయ భేదాలు వస్తవి. మీ ఆరోగ్యం బాగుంటుంది. లెక్కలు, వ్యవహార పత్రాలు వ్రాయుట మొదలయిన సందర్భాలలో పొరబాట్లు రాకుండా చూచుకొనండి. పుణ్య కార్యాలు అనుకూలిస్తవి. వారం రెండవ భాగంలో మనస్సుకు చికాకు కలిగే వార్తలు తెలుస్తవి. పండితులతో స్నేహం లభిస్తుంది. కొన్ని సందర్భాలలో చేసిన పనినే తిరిగి చేయవలసి రావటంవల్ల విసుగుదల కనిపిస్తుంది. ప్రయాణాలు చేదామనుకుంటారు కాని సాగక పోవచ్చు. డబ్బు కాని, విలువగల వస్తువులు కాని దొంగతనంగా పోయే అవకాశా లున్నవి. 16, 17 లలో త్రిప్పట అపవాదులు.

* * *

వృషభం :

(కృత్తిక 2, 3, 4 పా., రోహిణి, మృగశిర 1, 2 పా.)

పని శ్రమ అధికం, ప్రతివిషయంలోను ప్రారంభంలో పోటీలు వస్తూ ఉంటవి. కాని, చివరకు అందరూ మీ మాటను అనుసరిస్తారు. బంధువులకు సంబంధించిన కార్యభారం పైన వేసుకోవలసి వస్తుంది. వృత్తిలో మీ మాటను వ్యతిరేకించేవారు తొలగిపోతారు. ఆదాయం బాగానే యుంటుంది. శుభకార్యాలలో పాల్గొంటారు. కోర్టు కచేరీలలో అనుకూలత ఉంటుంది. ప్రస్తుతం రాజకీయాలలో ఉత్సాహం కనుపించదు. ఇంతకు ముందు ఇతరుల చేతికి పోయిన వస్తువుల నిమిత్తం మనస్పర్ధలు రాగల అవకాశా లున్నవి. ఎదురు చూస్తున్న వార్తలు సకాలంలో అందవు. విలువగల వస్తువులు కొంటారు. స్వల్ప విషయాలలో ఉద్రేకం పెరిగి కలహించుకోవలసిన పరిస్థితులు ఏర్పడగలవు. 20, 21 తేదులలో వస్త్రాభరణ ప్రాప్తి, బంధుదర్శనం, గొప్పవారితోమైత్రి.

* * *

మిధునం :

(మృగశిర 3, 4 పా., ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పా.)

సమయానుకూలంగా పనులు జరుపుకొనవలసిన సమయం. మీ ఆరోగ్యం కూడా సంతృప్తికరంగా ఉండదు. మీకు మీ మిత్రులకు, మధ్య విరోధాలు రేకెత్తించేవా రుంటారు. ఈ సమయంలో తొందరపడటం మంచిది కాదు. న్యాయ నిమిత్తం ప్రాకులాడతారు కాని, చివరకు మీరు అనుకున్నంత ఉపయోగం కనుపించదు. ఆదాయ వృద్ధి నిమిత్తం మీరు చేసిన ప్రయత్నాలు కొంత వరకు అనుకూలిస్తవి. లోగడ ఇతరులకు చెప్పిన మాటను నిలుపుకొనటం నిమిత్తం మీ సౌభాగ్యాన్ని వదులుకొనవలసి వస్తుంది. సందేహాలతో ముందుకు సాగకుండా నిలిచిన పనులు క్రమక్రమంగా ఆరంభం చేయగలుగుతారు. దుబారా ఖర్చులు చేస్తున్నామనే విషయం తెలుస్తుంది. కాని వాటిని నిలుపలేక పోతారు. 19, 20 లలో ధనప్రాప్తి, కుటుంబ సౌఖ్యం, శుభవార్తలు.

* * *

గ్రహస్థితి

మేషంలో శుక్రుడు, మిధునంలో అంగారకుడు, సింహంలో రాహువు, మకరంలో గురు, శనులు, కుంభంలో బుధ, కేతువులు, మీనంలో సూర్యుడు, కుంభ, మీన, మేష వృషభాలలో చంద్రుడు.

కర్కాటకం :

(పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్లేష)

బాహ్యవిషయాలలో కొన్ని విధాల చిక్కులు కనిపిస్తున్నా మీ మాట నేర్పుతో పనిని సాధించుకోగలుగుతారు. చాటున ఉండి మిమ్ములనుగురించి చెడుగా ప్రచారం చేసేవా రుంటారు. అయితే దైవబలంవల్ల చిక్కులు ఏమీ ఉండవు. వృత్తి వ్యాపారాలలో మనశ్శాంతి, గౌరవము బాగుంటవి. అధికారులతో మైత్రి లభిస్తుంది. వృత్తికి సంబంధించిన ప్రయాణాలు చేయవలసి రావచ్చు. నౌకరులు మొదలైన వారిని నమ్మి బాధ్యతలను విడవటం మంచిదికాదు. కుటుంబంలోని వారి సహాయంలోపించటంవల్ల కార్యనిర్వహణ శ్రమగా తోస్తుంది. ఇతరులవద్దనుంచి రావలసిన ధనం వారాంతంలో చేతికి వస్తుంది. శుభవార్తలు తెలుస్తవి. అధికారులవల్ల పనులు అనుకూలించే సమయం కాదు. 15, 16 లలో కారణం తెలియని భయం, ప్రయత్నాలలో చిక్కులు.

* * *

సింహం :

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

ఎంత శ్రమ చేసినా ఎదుటివారి మెప్పు పొందలేకపోవటంవల్ల ఉత్సాహం తగ్గుతుంది. మీ అభివృద్ధిని చూచి ఓర్వలేనివారు మంచితనంతో మిమ్మును సాహసకార్యాలకు దింపటానికి చూస్తారు. జాగ్రత్తగా ఉండండి. స్నేహితులకు ధన సహాయము చేయగలుగుతారు. భాగస్తులతో కలిసి చేయు లావాదేవీలలో తగాదాలు వస్తవి. విద్యార్థులకు ప్రోత్సాహకరమైన సమయం. వృత్తి, వ్యాపారాలలో అదృష్టం కలిసి వచ్చేటట్లు కన్పిస్తున్నా చేతికి అందే సమయంలో ప్రతిబంధకాలు వస్తూ ఉంటవి. వారం రెండవభాగంలో శుభవార్తలు తెలియవస్తవి. కుటుంబంలోనివారికి అనారోగ్యం చేస్తుంది. వారాంతంలో శుభ కార్యాలలో పాల్గొంటారు. 18, 19 లలో పండితులతో స్నేహం. ధన లాభం, విలాస కార్యాలు, వ్యవహార రంగంలో శ్రమ, అనుకూలత.

* * *

కన్య :

(ఉత్తర 2,3,4 పా, హస్త, చిత్త 1 2 పా)

ఖర్చులకు భయపడి కార్యక్రమాలు విరమించుకొంటారు. కాని, ఏదో విధంగా తప్పక చేయవలసినపరిస్థితి ఏర్పడుతుంది. తలవని తలంపుగా స్నేహితుల సహాయసంపదలు లభిస్తవి. మీ ఆరోగ్యం ఇంతకు ముందు కన్నా మేలుగా ఉంటుంది. ఇతరులవిషయంలో కల్పించుకుని న్యాయం చెప్పటం వంటి పనులు తగ్గించుకోవలసి వస్తుంది. స్వంతకార్యక్రమాలతో విశ్రాంతి లేకుండా నడిపోతూ ఉంటుంది. స్త్రీరాస్తులకు సంబంధించిన వ్యవహారాలు ఒక నిర్ణయానికి వచ్చి మనశ్శాంతి లభిస్తుంది. వినోద కార్యక్రమాలకు ఆటంకాలు వస్తవి. బంధుమిత్రులకు వ్రాసే ఉత్తరాలలో అవతలివారి మనస్సుకు నొప్పి కలుగకుండా చూచుకొనటం అవసరం. 16, 17 తేదులలో ఆదాయ భంగం, స్వల్ప విషయాలలో సందేహాలు, పెద్ద మనుష్యులతో పేచీలు.

* * *

తుల :

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు)

అనేక సందర్భాలలో ఉదారంగా ప్రవర్తించినా, చివరకు స్వల్ప కారణాలతో మనస్పర్థలు వచ్చే సమయం. ఖర్చులు పెరుగుతవి కాని సంతృప్తికరంగా పనులు జరుగుతవి. పెద్ద మనుష్యులతో మైత్రి లభిస్తుంది. ధర్మకార్యాలలో ప్రవేశించవలసి వస్తుంది. ఒక ప్రక్క మిమ్ములను ఆదరించేవారు ఉన్నా మరొక ప్రక్క వృత్తిలో పోటీలు, మోసము కనిపిస్తూ ఉండటంవల్ల నిరుత్సాహం తోస్తూ ఉంటుంది. పెద్ద మొత్తాలుగా డబ్బు చేతికి వస్తుంది. వస్త్రాలు, ఆభరణాలు మొదలయినవి కొంటారు. తాత్కాలికంగా పిల్లలకు అనారోగ్యం చేసి నెమ్మదిస్తుంది. ఇంతకు ముందు చేయజాలక విరమించుకొన్న కార్యక్రమాలు తిరిగి ఆరంభం చేయగలుగుతారు. దూరప్రయాణాలు చేయవలసి వస్తుంది. 19, 20 లలో వినోద కార్యక్రమాలు, ఇష్ట వస్తు ప్రాప్తి, శుభవార్త.

* * *

వృశ్చికం :

(విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

ప్రస్తుతం మీ శక్తికి మించిన భారం పైన పడుతుంది. మంచి మాటలతో మీచేత పని చేయించుకునేవారుంటారు. ఖర్చులు పెరుగుతవి. కాని, ఆదాయం మామూలుగా ఉంటుంది. వృత్తి ఉద్యోగాలలో ఇంతకుముందున్నటువంటి అసంతృప్తి చాలవరకు తొలగిపోయి మనశ్శాంతి లభిస్తుంది. గౌరవం లభిస్తుంది. ఏ విషయంలోను ప్రతిజ్ఞలు చేయుటం, పందెములు వేయటం వంటి బాధ్యతలను పైన వేసుకొన తగిన సమయం కాదు. సాధారణ ప్రసంగాలు కూడా పాకం ముదిరి కలహాలకు దారితీయగల అవకాశాలున్నవి. రాజకీయాలలో మీరు అనుకున్నంత అభివృద్ధి కనుపించదు. బంధువుల వద్ద మంచి అనుకూల వార్తలు తెలుస్తవి. పిల్లల మూలంగా సుఖ సంతోషాలు లభిస్తవి. 20, 21 లలో నూతన ప్రయత్నాలు, జ్ఞాపకశక్తి లోపం కావటంవల్ల కార్యభంగం.

* * *

ధనుస్సు :

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)

ఈ సమయంలో న్యాయం కన్నా యుక్తి అవసరంగా తోస్తుంది. క్రమ క్రమంగా ధనాదాయం పెరుగుతుంది. దక్షిణ దిక్కునుంచి లాభ వార్తలు తెలుస్తవి. సంఘంలో కీర్తి ప్రతిష్ఠలు బాగుంటవి. తలపెట్టిన పుణ్య కార్యాలు సుఖంగా నెరవేరుతవి. వృత్తిలో మీ ప్రయత్నాలు నిరాటంకంగా నెరవేరి పుష్కలంగా డబ్బు చేతికి వస్తుంది. బంధుమిత్రులవల్ల సన్మానం పొందగలుగుతారు. వారం రెండవభాగంలోగా ఆరోగ్యం చెడే అవకాశాలున్నవి. సాధ్యమైనంత వరకు ప్రయాణాలు వాయిదా వేసుకొనటం మంచిది. యంత్రాలు, ఆయుధాలు వినియోగించే సందర్భాలలో జాగ్రత్తగా ఉండటం అవసరం. 15, 16 లలో అధికారులతో కలహాలు. ఆదాయ భంగం. అపవాదులు రాగల సూచనలు.

* * *

మకరం :

(ఉత్తరాషాఢ 2, 3, 4 పా, శ్రవణం ధనిష్ఠ 1, 2 పా)

వృత్తిలో అభివృద్ధికరమైన సమయమే కాని, ధన సంబంధమైన చిక్కులు మాత్రం బాధిస్తూ ఉంటవి. చేతికి రావలసిన ఫలితం నిదానం అవుతుంది. అత్యవసరంతో చేసిన పొరపాట్లు ధన నష్టానికి దారితీయగల అవకాశాలున్నవి. గొప్ప వారితో స్నేహం సంపాదిస్తారు. మీ ప్రయత్నాలు స్వవిషయంలో విశేషంగా లాభించక పోయినా ఇతరులకు సహాయం చేయగలుగుతారు. మీ ఆరోగ్యం ఇంతకుముందు కన్నా బాగుంటుంది. వారం రెండవ భాగంలో ఆదాయం బాగుంటుంది. మీకు సహాయం చేస్తామన్నవారు సమయంలో ముఖం తప్పిస్తారు. అయితే తాత్కాలికంగా మరొకరి సలహా లభించటంవల్ల మాట దక్కించుకో గలుగుతారు. పుణ్య కార్యప్రయత్నాలు క్రమంతో నెరవేరుతవి. 16, 17 లలో ఆస్తి వృద్ధి ప్రయత్నాలు, సంఘంలో పేరు ప్రతిష్ఠలు. కుటుంబంలో అధికవ్యయం.

* * *

కుంభం :

(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా.)

బాహ్యాడంబరంతో కార్యం సాధించుకుంటు ముందుకు పోగలుగుతారు. మాట చలామణి బాగుంటుంది. అంతరంగికమైన చిక్కులు బయటకు తెలియకుండా నిబ్బరంతో వ్యవహరించ గలుగుతారు. అధికారులతో మైత్రి సంపాదించ గలుగుతారు. ఆరోగ్యం సరిగా ఉండదు. కాని, మానసికంగా ఉంటున్న ఆందోళన తొలగిపోతుంది. సంఘకార్యాలు చురుకుగా నెరవేరుతవి. విలువగల వస్తువులు కొంటారు. ఎంత డబ్బు వచ్చినా కర్పూరం మాదిరి హరించిపోతూ ఉంటుంది.

ఈవారము ధరలు

బంగారు ధర ఈ వారంలో కొద్దిగా తగ్గే అవకాశాలున్నవి. వెండి ధర ఆరంభంలో పెరిగి తరువాత మందీ వస్తుంది. పసుపు ధర మందీ వచ్చి నిలుస్తుంది. నూలు ధరలో తేజీ కనుపిస్తుంది. ప్రత్తి ధర నిలకడగా ఉంటుంది.

వేరుశనగపప్పు ధర పెరిగి వారాంతంలో తగ్గుతుంది. నూనె ధర నిలకడగా ఉంటుంది. మావుల నూనె ధరలో మందీ వస్తుంది. పెసల ధరలో తగ్గుదల వస్తుంది. గోధుమల ధరలో కొద్ది తేజీ కనుపిస్తుంది. మినుములకు గిరాకీ వస్తుంది.


ఇతరులవద్దనుంచి ముఖ్యమైన రహస్య వార్తలు తెలుస్తవి. 20, 21 లలో బంధుదర్శనం, వృత్తిలో అభివృద్ధి, ధనలాభం.

* * *

మీనం :

(పూ. భాద్ర 4 పా, ఉ. భాద్ర, రేవతి)

శ్రమ తొలగిపోతుంది. మీ ఆలోచనలకు సరియైన ఒక మార్గం లభిస్తుంది. అనేక సందర్భాలలో ఇతరుల నిష్ఠురాలకు గురి కావలసిన బాధ్యత తొలగుతుంది. దూరప్రయాణాలు చేయవలసి రావచ్చు. మీ నిత్యకృత్యాలలో సాధారణమైన పొరపాట్లు వచ్చినా అవతలివారి దృష్టికి పోకుండా సర్దుకో గలుగుతారు. వ్యవహార రంగంలో అనుకూలమైన కాలం. ఖర్చులు అధికంగా కనుపించినా, కార్యసిద్ధి, మనస్సంతృప్తి పొందగలుగుతారు. శుభకార్యప్రయత్నాలు చురుకుగా జరిగి ఒక నిర్ణయం చేయగలుగుతారు. కుటుంబంలో సుఖ సంతోషాలు లభిస్తవి. వారాంతంలో అల్పులతో కలహాలు రావచ్చు. 16, 17, 18 లలో కారణంలేని ఆందోళన, దుర్వార్తలు తెలుస్తవి.



—చిత్రకారుడు: జి. గణేశ్వరరావు (కాకినాడ)



ముక్తి

కలువకొలను సదానంద

"బంగారమ్మా! ఇడ్లీలున్నాయటమ్మా?" అని అడిగింది పొరుగింటి మాణిక్యమ్మ.

ఖాళీఅయిపోయిన పాత్రని పెరట్లో పడేయబోతున్న బంగారమ్మ—"లేవమ్మా! అయిపోయినై" అని, "గంట ఎంతైందీ మాణిక్యమ్మా?" అనడిగింది.

"పదిన్నర కావస్తోంది" అంటూ మాణిక్యమ్మ వెళ్ళిపోయింది. "ఓ సమ్మోయ్! అప్పుడే అంత పొద్దెక్కిపోయిందా? ఇంకా ఎసరైనా పెట్టలేదే..." అనుకుంటూ బంగారమ్మ చకచకా పనిలో నిమగ్నమైంది.

బంగారమ్మకు ఏభై ఏళ్లుంటాయి. ఆమెభర్త పదహేనేళ్ళ క్రింద ఎప్పుడో ఏరుదాటేశాడు. ఆమెకు వరాలు అని ఒకే ఒక కూతురు. దగ్గర్లోనే ఏదో పల్లెలో వరాలుకు మంచి సంబంధం చూసి పెళ్ళిచేసింది తల్లి. ఆమె బస్తీలో ఒంటరిగా మిగిలిపోయింది. తమతో బాటేవచ్చి వుండిపొమ్మన్నాడుఅల్లుడు. "నాకేం లోటు నాయనా యిక్కడ? మీరు సుఖంగా వుంటే చాలు. ఇడ్లీలు; వడలు కాల్చి అమ్ముకుని నా బతుకు నేను బతుకుతాను" అంది బంగారమ్మ.

వరాలుకు కొడుకు పుట్టాడు. వాడు పెరిగి పెద్దవాడయ్యాడు. అయిదో తరగతి చదివేశాడు. ఇంకా చదువుతానన్నాడు. "ఒరేయ్ రవీ! మన వూళ్లో హైస్కూలు లేదు. చదవాలంటే బస్తీకి వెళ్లాలి. అక్కడే-అమ్మమ్మ దగ్గరే వుండి చదువుకుంటావా?" అంది వరాలు.

"అమ్మమ్మ దగ్గరే ఏం? అరణ్యంలో వుండి చదువుకోమన్నా తయార్!" అన్నాడు రవి. వాడు అరణ్యంలోకి వెళ్ళలేదుగాని—అమ్మమ్మ దగ్గరికే వచ్చాడు. వాడు బంగారమ్మను చూచి-"అమ్మమ్మా! నీ పేరు విని నీ ఒళ్ళంతా బంగారమేనేమో అనుకుని ఆశపడ్డాను. కాకి బంగారమైనా లేదు" అన్నాడు. అమ్మమ్మ రవిని చూచి ముచ్చటపడింది. "నామనమడు బట్టి పల్లెటూరి మొద్దబ్బాయి అనుకున్నాను. ఇంతలేసిమాటలు నేర్చాడనుకోలేదు" అంది ఆమె.

వరాలు వెళ్ళిపోతూ-తన తల్లితో అంది-"ఒసేయ్! వాడు డబ్బుచూస్తే నిజంగానే కళ్ళు కుట్టుకుంటాడు. మాటిమాటికీ డబ్బులిమ్మని వేధించడం వాడికి పెద్దరోగం. చనువిస్తే నెత్తికెక్కుతాడు. డబ్బివ్వకపోతే ఛటుక్కున నీళ్ళకడవ దింపేస్తాడు. అంతమాత్రానికే నువ్వు కరిగిపోవద్దు. వాడు బాగు

పడాలంటే - అప్పటికప్పుడు కన్ని, చెవులు మెలేస్తూవుండు."

అప్పట్నుంచీ రవి అమ్మమ్మ దగ్గరేవుండి చదువుకుంటున్నాడు. ఆరోతరగతి ప్యాసై, ఏడోతరగతి లోకి కొత్తగా అడుగుబెట్టాడు. ఈ ఏడాదిలోపల—వాడికి అమ్మమ్మ దగ్గర మంచి చనువు ఏర్పడింది. ఆమెను వాడు ఏ ఆటలైనా ఆడించ గలడు. బంగారమ్మ తన పొరపాటును ఆలస్యంగా గుర్తించి, కూతురు సలహాను యిప్పుడిప్పుడే అమలులో పెడుతోంది.

ఇడ్లీలు, వడలు కాల్చి అమ్మి, రవిని బడికిపంపి, తొందర పనులన్నీ తెమిల్చి పొయ్యిమీద ఎసరు పెట్టే సరికి పదిన్నర గంటలైంది. ఆమె చేటలో బియ్యంపోసుకుని అందులోని వడ్లూ, రాళ్లు ఏరుతూ యింటి ముందర నిలబడి, నాలుగు గింజలు చేతిలోకి తీసుకుని "భో...భో...భో.. భో..." అంది.


ఆమె ఒక కోడిపెట్టను పెంచుతోంది. బియ్యం ఎసరులో వేసేటప్పుడంతా ఆమెకు ఆకోడి జ్ఞాపకం వస్తుంది. దానికి నాలుగు బియ్యపు గింజలు వేద్దామనుకుంటే - అది ఆ యింటి ఆవరణలో ఎక్కడా కనిపించలేదు. ఏదిబ్బలదగ్గర ఏరుకు తింటూవుందో, వస్తుందిలే-అనుకుంది బంగారమ్మ. కాని చాలసేపటివరకు కోడి రాలేదు.

ఆమె అన్నంవార్చి, మళ్ళీవాకిలి బయట నిలబడి-గట్టిగా "భో-భో-భో-భో" అంది. ఎక్కడినుంచో 'కొక్కొ-కొక్కొ-కొక్కొ-' అంటూ సన్నగా సమాధానం వచ్చింది. కోడి వస్తూవున్నది-అని అనుకుంది ఆమె. కాని-కోడి రాలేదు. మళ్ళీ ఆమె గొంతెత్తి పిలిచింది. 'కొక్కొ-కొక్కొ-' అంది కోడి. ఎంతసేపు పిలిచినా సమాధానమేమో వస్తూవుందిగాని—కోడి కనిపించడం లేదు.

బంగారమ్మకేదో అనుమానం కలిగింది. ఆమె యింటిముందర పాడుబడ్డ చేదబావి ఒకటుంది. ఆమె చరచరా బావిదగ్గర కెళ్లి, అందులోకి తొంగిచూచింది. 'కొక్కొక్కొక్కొ' అంటూ ఆకాశంకేసి నిక్కి చూస్తూన్న కోడిపెట్ట కనిపించింది బావిఅడుగున.

బంగారమ్మ మొగుడు నీటిబుగ్గ పడుతుంది కదా అని ఆ బావిని త్రవ్వించాడు. నీటిబుగ్గ పడలేదు. పెద్దరాయి తగిలింది. బావి పూర్తిగా ఒకటేరాయి. ఆ రాతిలోనే బావిని త్రవ్వాడు, అది అయిదు మట్లు లోతు తెగిందిగాని, అంతం కాలేదు. అంతటితో బావి త్రవ్వకం ఆగి పోయింది. దానిలో దిగడానికి మెట్లు లేవు. బావిలోపలగోడలు చక్కగా, నిటారుగా లేక-ఒక సొరంగంలాగుంటుంది. అందులో ఎప్పుడూ ఒక్క చుక్క నీరువుండదు. కానీకోతి ముక్కానీ బెల్లం తిన్నట్టు-ఆ బావి త్రవ్వినందుకు ప్రయోజనమేమీ లేకపోగా—ఎవరైనా కాలుజారి అందులోపడే ప్రమాదం సంభవించకుండా వుండడానికి ఆ బావి చుట్టూ పిట్టగోడ కట్టవలసివచ్చింది.

బంగారమ్మ పెంపుడు కోడి ఎల్లాగో ఆ బావిలో పడిపోయింది. అది బంగారమ్మకు ప్రాణం. ఆమె దానిమీద కొన్ని ఆశలు పెట్టు



కుంది. అది కోడిపుంజు కాదు. కోడి పెట్ట! బాగా పెంచితే-కొన్నిరోజుల్లో కనీసం పదిహేను గ్రుడ్లయినా పెడుతుంది. ఆ గుడ్లను పొదిగిందంటే— పదిహేను కోడిపిల్ల లౌతాయి. ఈ విధంగా చాలాసార్లు గుడ్లు పెట్టి పొదుగుతుంది.కొన్నాళ్లకు ఆపిల్లలు కూడా తల్లులౌతాయి. క్రమంగా తన పెరడంతా పెద్దకోళ్ళ మందై పోతుంది......ఆ ఒక్క కోడిమీద యిన్ని ఆలోచనలున్నాయి బంగారమ్మకు. ఆ కోడిఆమె ఆశ.

ఆమెఆశ బావిలో పడిపోయింది. ఆ ఆశను మళ్ళీ పైకి తీయాలనుకుంది ఆమె. బడినుంచి రవి రాగానే వాడిచేత పైకి తీయించాలనుకుంది.

మధ్యాహ్నం రవి అన్నానికి వచ్చాడు. అన్నంతిన్నాడు."ఒరేయ్ రవీ! మనకోడి బావిలో పడి పోయింది. పైకి తీయరా!" అంది బంగారమ్మ. ఈ వార్త రవి చెవిని పడగానే-దేవత దిగివచ్చి వరం కోరుకొమ్మన్నట్లయింది వాడికి.

రవి వయస్సు చిన్నది. వాడి సాహసంమాత్రం పెద్దదే. ఆ బావిలోకి దిగి ఎక్కడంలో వాడు బాగా ఆరితేరాడు. దానిలో వాడి ఆటవస్తువు లేవైనా పడిపోతే-వాడికా భయంలేదు. సునాయాసంగా దిగి తెచ్చుకోగలడు. చాలాసార్లు-కావాలని, తనవస్తువులు, యిరుగుపొరుగు పిల్లలవస్తువులు అందులో పారేశాడు. వాళ్లను ఏడిపించాడు. ఆ బావితో చెలగాటమంటే వాడికి సరదా.

ఒకసారి ఒకనేస్తంతో పందెం వేసుకున్నాడు. "ఒరేనేస్తం! నువ్వూ నూరుమీటర్ల పరుగు పందెంలో ఫస్టున వచ్చావుకదా—నేను నిన్ను ఓడిస్తాను. పందెంకాయి" అన్నాడు. రవి.

"శరేశాస్! ఎలా ఒడిస్తావో చూద్దాం" అన్నాడు నేస్తం.

రవి నేస్తం చేతిలోని బంతిని లాగి బావిలోపడేశాడు. "ఒరేయ్ నేస్తం! ఏడవకు. ఆరావిచెట్టు యీ బావినుండి ఎంతదూరం?"

"సుమారు ఏభైమీటర్లు."

"నువ్వు ఆరావిచెట్టుదగ్గరికి పరుగెత్తికెళ్ళి, పరుగెత్తుకొచ్చేసేలోపల బావిలో బంతిని బయటికి తెచ్చేస్తాను!" అన్నాడు రవి. అన్నంత పని చేశాడు. ఆబావిలోకి దిగి పైకి రావడంలో అంతటివేగమూ, నైపుణ్యమూ అలవడినాయి వాడికి.

"అయితే అమ్మమ్మా! నాకే మిస్తావ్?" అన్నాడు రవి.

"మీవంశమే అంత! లక్ష్మిదేవి వంటిపిల్లను ఏలుకోరా అంటే వెయ్యిరూపాయలు కూలీ అడిగాడు కదూ మీనాన్న! కూలి వెధవా! అణా ఇస్తాలే!...కోడిని బయటికి తియ్యి..."

"ఒక్కఅణా ఎవడిక్కావాలి? అలాంటివి నాలుగు."

"ఆఆశ వదులుకో. అణాకు మించి ఒక్కనయాపైసా ఎక్కువ యివ్వను..."

"అలాగేలే! అయితే కోడిపైన ఆశవదులుకో!" అంటూ పుస్తకాల సంచీ అందుకోబోయాడు రవి.

"ఒరేఒరే! సరేలేరా! నీకష్టం నాకెందుకు? పావలానే తీసుకుందువులే!..." అంది అమ్మమ్మ-పోబోతున్నవాడిని ఆపి.

రవి ఒక్కగంతువేసి వీధిలోకి పరుగెత్తాడు...

"నేను మాబావిలో దిగబోతున్నాను. చూడాలనుకున్నవాళ్లంతా రండహో!..." అని కేకపెట్టాడు. మాణిక్యమ్మ కూతురు రాధ, పక్కింటి పాండు, ఎదురింటి చంద్రం ఆకేకవిని బిలబిలమంటూ అతని వెంటపడ్డారు.

రవి-ఆగోడ కొకకాలు, యీ గోడకు ఒకకాలు ఆన్చి, అలాగే ప్రాకుతూ-బావిలోకిదిగాడు. చుట్టూ ఒకటే రాతిగోడ. ఎక్కడా చెమ్మ లేదు. ఏమూలచూచినా బూజుపట్టి వుంది. సాలెపురుగులు గూళ్ళుకట్టుకొన్నాయి. రవి దిగగానే కోడి అరపులు ఎక్కువయ్యాయి. అది అయిదడుగుల ఎత్తుకు ఎగిరి, అటుపిమ్మట ఎగురలేక మళ్ళీ వున్నచోటే కూలబడింది. రవి దాన్ని ఒడిసి పట్టుకున్నాడు. అరచేతులు వేడితో వుడుకెత్తిపోయాయి. "అమ్మమ్మా! బక్కెట్టుదించు" అని కేకపెట్టాడు. లోపల్నుంచి వాడికి ఆకాశం కాగితం ముక్క పరిమాణంలో కనిపించింది. రాధ, పాండు, చంద్రంల తలకాయలు తనకేసి తొంగిచూస్తున్నాయి.

అమ్మమ్మ చేంతాడుకు బక్కెట్టు ముడివేసి లోపలికి దింపింది. రవి కోడిని అందులో వుంచేశాడు. బక్కెట్ పైకెళ్ళి పోయింది. వాడు చేతులు దులుపుకున్నాడు.

"నా పౌగ్రడబ్బీ!" అని కేకేసింది రాధ-పై నుండి.

"ఏమిటీ?" అన్నాడు రవి అర్థంకాక.

"నా పౌగ్రడబ్బీ."

"పౌగ్రడబ్బీ అంటే?"

"దాని పౌడరు డబ్బీ యటరా" అంది అమ్మమ్మ.

రవి వెతికాడు. ఒక మూలగా పౌడరు డబ్బీ కనిపించింది. దాన్ని తీసి లాగు జేబులో వుంచుకున్నాడు.

"నా లెవల్ వార్" అన్నాడు పాండు.

"సీ రివాల్వరా?" అంటూ రవి బావిలో పడివున్న చిన్న పిస్తోలు తీసి జేబులో వుంచుకున్నాడు.

ఇంతలో — "నా వుంగరం" అన్నాడు చంద్రం.

రవి రబ్బరు రింగునుకూడా చేతికి తీసుకున్నాడు. క్షణంలో పైకి వచ్చేశాడు. పౌగ్రడబ్బీ, లెవల్ వారూ, వుంగరం—ముగ్గురికీ యిచ్చేశాడు. పుస్తకాలసంచీ భుజానికి తగిలించుకుని "అమ్మమ్మా! నా పావలా యివ్వు. లేటైపోయింది! బడికెళ్ళాలి!" అన్నాడు.

బంగారమ్మ పొదుపరి. అనవసరంగా డబ్బు పాడుచేయదు. సమయానుకూలంగా మాట్లాడుతూ తన పనులు సాధించుకునే నేర్పరి. ఆమె నవ్వుతూ-నడుములో చెక్కుకున్న సంచీలోంచి అణాతీసి వాడికిచ్చింది. అణా చూసి రవి మండిపడ్డాడు. "ఇది అన్యాయం? నా పావలా నాకిచ్చేసేయ్! ఇస్తానని ఒప్పుకున్నావా, లేదా?" అంటూ చిందులు

ఒకానొక కోతలరాయుడు తన మామగారు "ఉన్నతమైనస్థితి"లో మృతిచెందాడని చెప్పుకొంటూ గర్వం ఒలకబోస్తున్నాడు. అదేమిటో వివరించమని తోడివారు కోరారు.

ఒకరు అన్నదిది: "అతను చెప్పినది నిజమే. చాలా ఉన్నతమైనస్థితి అది. అతని మామగారిని ఉరిదీశారు."

—కటకర్తి ప్రసాదరావు (హైదరాబాదు)

ద్రోశ్కాడు.

"పావలా నీకెందుగ్గానీ పోరా! ఇచ్చినదానితో తృప్తిపడు. ఆశకు మితం వుండాలి" అంది బంగారమ్మ.

మిగతా మూడణాలివ్మని అరగంటసేపు మారాంచేసి లేదనిపించుకున్నాడు రవి. "ఇంక నువ్వెంత గీపెట్టినా ప్రయోజనంలేదు" అనేసింది అమ్మమ్మ.

వాడు కుర్రవాడైనా అన్యాయాన్ని మాత్రం సహించలేడు. అమ్మమ్మ అడినమాట తప్పింది. కోడిని పైకితీస్తే పావలా యిస్తానంది. కాని, ఆమెఅలా చేయలేదు. ఆమెకు తగిన బుద్ధి చెప్పాలి-అనుకున్నాడు.

"నీ అణా నువ్వేవుంచుకో! నాకెందుకు?" అని ఆమెముందు విసరి కొట్టాడు. కోడిపెట్ట - బంగారమ్మ చల్లిన నూకల్ని ఏరుకు తింటోంది. రవి దాని వెంటబడి తరిమి, ఎంతో ప్రయాసపడి దాన్ని పట్టుకున్నాడు. బంగారమ్మ నిర్ఘాంతపోయి చూస్తూవుండగా - ఆ కోడిని బావిలోకి విసిరికొట్టి, గసలుబోస్తూ, కసిగా నవ్వుకుంటూ - బడికి వెళ్ళిపోయాడు.

రవి యింత పని చేస్తాడని అనుకోలేదు బంగారమ్మ. అణాతీసుకుని, కాస్సేపు ఏడ్చి కిక్కురుమనకుండా వెళ్ళిపోతాడనుకుంది. కాని అలా జరగలేదు. కథ మళ్ళీ మొదటికి వచ్చింది.

బావిలోనుండి కోడిపెట్ట ఏకబిగిని అరుస్తోంది. ఒక్కో సారి మెల్లగా, మరోసారి పెద్దగా - చిత్రవిచిత్రంగా వున్నాయి దాని అరుపులు. కొంతసేపటికి ఆ అరుపులువినిపించలేదు. "అరచి అరచీ అలిసిపోయింది. పాపం!" అనుకుంది బంగారమ్మ.

సాయంకాలం వాడు గుమ్మంలో కాలు బెట్టగానే - వాడి పుస్తకాలూ, బట్టలూ అన్నీ అందించేయాలనుకుంది ఆమె. ఆపని జరగడం తథ్యమని రవికూడా అనుకున్నాడు. కాని సాయంత్రం యింటికి రాగానే బంగారమ్మ బ్రతిమాలుకోవడం చూచి వాడికి కాస్త ధైర్యం చిక్కింది.

"నా పావలా నాకిచ్చేస్తావా?" అన్నాడు.

"తప్పకుండా యిచ్చేస్తాను. ముందు కోడిని బయటికి తీసెయ్!" అంది అమ్మమ్మ.

"ఇవ్వకపోతే యీ సారి కోడిని చంపేస్తాను."

"ఇవ్వకపోతే కదా చంపడం? ఇచ్చేస్తాలే!"

రవి బావిలోకి దిగాడు. దిగుతూ దిగుతూ-"ఈసారి అమ్మమ్మ పావలా యివ్వకపోతే కోడిని చంపేయాలి," అనుకున్నాడు. అమ్మమ్మ బావిలోకి బక్కెట్టు దింపింది. కోడి యీ సారి ఎగురలేదు. కూర్చున్న చోటునుండి కదల్లేదు. రవి దాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు. అయిదు నిమిషాలపాటు దాన్ని అటుత్రిప్పి యిటుత్రిప్పి చూసి, తర్వాత భయం భయంగా పైకి చూశాడు.

ఇద్దరు పిచ్చివాళ్ళు మాట్లాడుకొంటూ ఉన్నారు.

"నామెదడు ఎక్కడో పడిపోయిందిరా" అన్నాడు ఒకడు.

"నీ జేబుకు చిల్లి ఉందేమో చూచుకో" అన్నాడు రెండవవాడు.

—కె. వి. పి. డి. మనోహరరావు
(చిలకుర్తి క్యాంప్)

"అమ్మమ్మా!" అన్నాడు.

"ఏమిట్రా?" అంది వాడికేసి చూస్తూ.

"మరే-కోడి చచ్చిపోయింది-" ఆమెకీ మాట పిడుగులా వినిపించింది...

"ఓరి కిరాతకపు వెధవా! త్వరగా దాన్ని బక్కెట్టులో వుంచరా..." అంది ఆమె కోపమూ, ఆతురత పెనవేసుకొన్న కంఠంతో.

"మరి నా పావలా?" అన్నాడు రవి నసుగుతూ.

"చెప్పినట్టు చేస్తావా-లేకుంటే-మిరపరాయితెసి నెత్తిన వేయమంటావా?" అంటూ వురిమింది బంగారమ్మ.

కోడి పైకి వచ్చింది. దానివెంటే రవి పైకి వచ్చాడు. కోడిముక్కులో నుండి నెత్తురుకారి గడ్డ కట్టింది. దాని కళ్ళు మూసుకుపోయాయి. మెడ వదులుగా వేలాడుతోంది. బంగారమ్మ మొహం వాచిపోయేటట్లు చీవాట్లు పెడుతోంటే కిక్కురుమనకుండా భరించి, కోడికాళ్ళు ఒడిసి పట్టుకుని, దాన్ని దిబ్బలో పారేసి రావడానికి వెళ్ళాడు రవి.

"కోడిపోయింది" అనుకున్నది బంగారమ్మ

"పావలా పోయింది" అనుకున్నాడు రవి.

ఉదయంనుంచి జరిగిన వాదులాటలో యిద్దరిలో ఏ ఒక్కరూ లాభం పొందలేకపోయారు. లాభం పొందగలిగిన ప్రాణి ఒక్కటే! అది - కోడి! ఈ సందుచూచుకొని అది సులభంగా ముక్తిని సంపాదించుకొన్నది. అలాకాక - బ్రతికివుంటే - అది ఆ మొండి మనుషుల మూలంగా మరెన్ని హింసలకు గురి కావలసి వచ్చేదో? ★

చాటు కథా మంజరి

తిరుపతి వేంకటకవులు

శ్రీ తిరుపతి వేంకటకవులు కారణ జన్ములయిన మహాకవులు. నాటక కర్తలు. అవధాన శిరోమణులు. ఇరువదవ శతాబ్దపు తెలుగు వాఙ్మయ చరిత్రమే వారిచరిత్రము. వీరు జంటకవులు. ఒకరు శ్రీ దివాకర్ల తిరుపతిశాస్త్రిగారు. శ్రీ చెళ్ల పిళ్ల వేంకటశాస్త్రిగారు రెండవవారు. శ్రీ తిరుపతిశాస్త్రిగారు 1871 లో జన్మించి 1919 లో తనువుచాలించి నారు. 1870 లో పుట్టిన శ్రీ వేంకట శాస్త్రి 1950 లో శివరాత్రినాడు దివంగతులయినారు. కృష్ణా మండలమువారు శ్రీ తిరుపతి కవి. గోదావరీతీరము శ్రీ వేంకట కవి జన్మస్థానము. ఆంధ్ర దేశసౌభాగ్యమునకు ఆ రెండునదులవలె, ఆంధ్రవాఙ్మయ సౌభాగ్యమునకు ఈ జంటకవులు కారకులయినారు.

ఆంధ్రకవితావిశ్వనాథులై అర్ధ శతాబ్దము ఏకచ్ఛత్రాధిపత్యము వహించిన ఈ మహనీయులు ఆడిన మాటను పాటగా తెలుగుజాతి పాడుకొనుచున్నది.

'కవిః కాలస్యకారణమ్' అని నిరూపించిన ఈ మహాకవులు సృష్టించిన చరిత్ర ఎంతయోకలదు. వీరికి గల బిరుదములు, వీరు పొందిన సన్మానములు, సత్కారములు అనిదంపూర్వములు.

'తిరుపతికవుల జీవిత మొక మహాభారతము. ఇందే పర్వము పరిశీలించినను ప్రతిజ్ఞలుచేయుట, మీసములు దువ్వుకొనుట, ప్రతిపక్షులను పరిహసించుట, పద్మవ్యూహ ములు పన్నుట, వానిని భేదించుట, ఎదిరి ఎట్టివాడయిన సాహసించి మీది కురుకుట - ఇయివి చూతుము. ఈ భారతమున గూడ రాయబారముల రభసలు, శపథములు చప్పుడులు, పాశుపతప్రయోగములు, అట్టహాసములు, తొలుకుట్టనములు కలవు'—

కవితకు పెండ్లిపందిళ్లు కరవైన కాలములో ఒకప్పుడు తిరుపతి వేంకటకవులు ఆనందగజపతిరాజు సభకు

వెళ్లి —

సంగరశక్తిలేదు వ్యవసాయముసేయుట
సున్న సంతలో
నంగడివేసి యమ్ముటది యంతతు
మున్నెరాశక్తి ముష్టికిన్
బొంగుబుజానవైచికొని పోయెద మె
క్కడికైన ముష్టిచెం
బుంగొనిపెట్టు మొక్కటి యమోఘ
మిదేకద దంతిరాణ్ణృపా

అని నిందాగర్భితముగ వేడుకొన్నారు.

తిరుపతి వేంకటకవులు ఉద్దండులు గనుకనే వారు

'దోసమటంచెరింగియును దుందుడు
కొప్పగ జెంచినారమీ
మీసము రెండుబాసలకు మేమె కవీం
దులమను దెల్పగా
రోసముగల్గినన్ కవివరుల్ మము
గెల్వుడు గెల్చిరేని యీ
మీసముదీసి మీపదసమీపములందల
యుంచి మొక్కమే'

అని ఢంకాబజాయించి సవాలు చేసినారు. ఈ కవిసింహగర్జనలకు తర్జనభర్జనపడిన కవిపండితులు వారినెదుర్కొడ్డి నిలువలేకపోయిరి.

తిరుపతి వేంకటకవులు జంటగా దంపతులవలె తెలుగునాట వెలసి కావ్యకన్యకల నెందరనో కడుపార గన్నవారు. దేవీ భాగవతము, పాండవోద్యోగ విజయములు, బుద్ధచరిత్రము, శ్రవణానందము, గిరతము, నానారాజసందర్శనము, కథలు, గాథలు, ఎన్నో గ్రంథములు వారుపెట్టిన భిక్షలే. వీరిలో వేంకటశాస్త్రి గారు 'కవనార్థమ్మధయించితిన్ సుకవితా కార్యంబె నా వృత్తి మద్భవ మద్గానసరింతు, తద్భవమె మద్భాగ్యంబు' అని వక్కాణించినవారు. వీరు సరస ప్రసంగ కుశలులు. వారు పద్యము చదువుతీరు, మాటలాడు వరస జగత్ప్రసిద్ధములు. తిరుపతి వేంకటకవుల చాటువు లెన్నో తెలుగువారి నాలుకలపై నాట్యములాడుచున్నవి.

ఒకప్పుడు వీరు విజయనగర రాజసభకు పోయి, ఆ రాజు దర్శనమీయక సన్మానించి పంప జూచినాడు అక్కడి దివాను కోదండరావు అనువారు. 'అప్పుడీ కవులు దివానుగారిని ఉద్దేశించి

అటుగద్వాలిటు చెన్నపట్టణముమధ్యం
గల్గు దేశమ్మునన్
బటులస్ఫూర్తి శతావధానములుమెచ్చం
జేసి యున్నట్టి మా
కిట రాణీయశియున్న దర్శనము నిం
కెన్నాళ్ళకీ రాజొసం
గుటకెచ్చెప్పంగదవయ్య పాలిబుధా
కోదండరామాభిధా!

అని ప్రశ్నించినారు.

తమ అవధాన చాతుర్యమును గూర్చి ఈ మహాశయులు

బెజవాడ సదానందం

శతఘంట కవనమ్మునల్పసంగతియన్న
గరతిలామలకమ్ము గాదె మాకు
అష్టావధాన కష్టావలంబనమన్న
నంబికోండయు దర్శనంబు మాకు
ఆశుధారాకవిత్వాడంబరంబన్న
నెల్లేరుపై బండినడక మాకు
సత్కావ్యనిర్మాణ చాకచక్యంబన్న
షడ్రసోపేత భోజనము మాకు
వ్యర్థమగు వాదములోనపడ్డనట్టి వారి
దంబ మణగించుటా పోశనంబు మాకు
దాశరథే! కవి సముదాయగేయ!
పండిత విధేయ! రామభూపాలరాయ!

అభినవ రామలింగవిరుదాంకుడ నా
కవనంబున దునీ
యభణపుగాండ్లు తప్పులిడ నర్హులె?
కాదు తప్పు దిద్దమా
యుభయులలోన నొక్కడు మరొక్కని
కిందగు గాక యీర్ష్యచే
నభము శుభమ్మనుం దెలియు కార్నెడి
దేబెలు మాకు లెక్కయే?

అని చెప్పుకున్నారు. అంనాడు వారి యవధానము చూడనివారు, చూచి మైమరచి ఆనందించనివారు తెలుగునాటలేరు. 'వారు ప్రౌఢ పండిత ప్రభునభలలోనే కాదు. బాల పామర జారచోరాదులసభలలోను' భళీ అనిపించుకున్నవారే.'వానలో దడియనివారు మగ్గురువధానమ్మాదూక్తి మరందధారలకు గడుగనివారు మాకెచట గాన నరారు తెలుంగునాడునకు' అని శిష్యులచే కీర్తింపబడినవారు వీరు.

ఏనుగు నెక్కినాము ధరణీంద్రులు
మొక్కగ నిక్కినాము స
న్మానము లందినాము బహుమానములన్
గ్రహియించినార మె
వ్వానిని లెక్కపెట్ట కనివారణ దిగ్వి
జయం బొనర్చి ప్ర
జ్ఞానిధులంచు పేరుగొనినారము నీ వల
నన్ సరస్వతీ!

ఇందు తిరుపతికవి స్వర్గస్థుడైన తరువాత చాలకాలము వేంకటశాస్త్రి గారు సజీవులై గ్రంథ రచన సాగించిరి. కాని ఆరచనలన్నియును తిరుపతి వేంకటకవుల రచనలుగనే వెలువడినవి. అది వారి ఐక్యమునకు నిదర్శనము. 'ఆస్థానకవి' గా ఆంధ్రులు శ్రీ వేంకటశాస్త్రిగారిని వారిచరమదశలో సత్కరించి తమను తాము సన్మానించుకొన్నారు. ఆనాడు వృద్ధులై పరచింతా పరాయణులైన శ్రీ శాస్త్రిగారు కామేశ్వరీ దేవి నిట్లు ప్రార్థించినారు:

కవులెల్లన్ జయపెట్టు వైభవ మొసం
గజాలేదొ తచ్ఛిష్యవ
ర్గవిభూతిన్ గరుణింపవో తనుజను
ర్భాగ్యంబు గైసేయవో
వివిధైశ్వర్యము లిచ్చి తింక నొకటే
విశ్వేశి! నీ సన్నిధిన్
గవిగా నుండ నను గ్రహింపు మిదియే
కామ్యంబు కామేశ్వరీ!

ఈ 'కవిలోక మహాగురువులు' తెలుగుజాతి ను తేజపరచిన మహనీయులు. తెలుగువాఙ్మయ చరిత్రలో వీరిది స్వర్ణయుగము. ★

దైవ సాన్నిధ్యం ...



ఆమెకు పరిశుభ్రత, నిజంగా దైవత్వానికి తరువాతది. దైవ ప్రార్థనకు వెళ్లే ముందు గోద్రెజ్ సాండల్ సబ్బుతో స్నానం ఆమె ప్రతి దిన పూజకు నిష్టదాయకం. ఆమె గోద్రెజ్ సాండల్ సబ్బు తప్ప మరేదీ వాడదు. దీనిలో జంతు క్రొవ్వు లేదని గ్యారంటీచేయబడినది.

మార్దవ కరమైన కూరగాయల నూనెల నుండి తయారుచేయబడిన సబ్బులో స్వచ్ఛమైన మైసూర్ మంచి గంధపు నూనె చేర్చబడుట వల్ల, గోద్రెజ్ సాండల్ సబ్బు పోటిలేని ఉత్తమమైనదిగా పరిగణింప బడుచున్నది. కూరగాయల సబ్బులను చేయుటలో మార్గ దర్శకులచేత తయారు చేయ బడినట్టి, దాని యొక్క లక్షణమే కలిగే సమృద్ధయిన నురుగు చల్లదనమును హాయిని గొలుపును, దాని అసలైన మంచి గంధపు సువాసన నిలవుండును....

గోద్రెజ్ సాండల్

సబ్బు మీకు అత్యుత్తమ విలువైనది.

Godrej

గోద్రెజ్

సబ్బులలో
ఉత్తమ
నామము

సినిమా

సినీ కినారే 'సినారే'

నవకవి సి. నారాయణరెడ్డి (సినారె) మంజుల సరస్వతి చిత్రలోకంలో కాలు పెట్టనున్నట్లు వినికిడి. గేయం తీయంగా భావుకులకు ఆప్యాయంగా పంతరించగలిగిన నారాయణరెడ్డి చిత్రలోకంలో అడుగుపెట్టడం ముదావహం. చిత్రసనిలో నవ కుసుమాలు ఎన్నో వెలయించిన నేషనల్ ఆర్ట్ థియేటర్‌వారే సినారె పరిచయానికి కారకులు కాగలరని తెలిసింది.

పాడిందే పాటగా మిగిలిన సినిమా పాటలలో సరికొత్త బాటలు, పూదోటలు ఎన్నో సినారె తీర్చిదిద్దగలరని సినీ జనుల ఆశంస

'డబ్బింగ్' అంటే

డబ్బింగ్ అంటే ఉత్తన్నబ్బింగ్‌పోదూ అనే వారూ వినేవారూ ఉన్నారు

కాని చిత్రపరిశ్రమలో క్రమ ము కు ఫలితం

అవీ... ఇవీ...

దక్కాలంటే 'డబ్బింగ్' ఉత్తమం అనేవారు ఉన్నారు_

వ్యాపారిక భాషలో డబ్బింగ్ అంటే డబ్బు చేసుకొనడం!

ఏ భాషలోనయినా వెలువడిన ఉత్తమ చిత్రం 'డబ్' చేసి డబ్బు చేసుకోడం వ్యాపారదక్షతకు నిదర్శనమని రూఢి అయింది

అలా "డబ్" అయిన చిత్రాలు అనేకం విజయవంతమయిన ఘట్టాలు చాలా ఉన్నాయి.

ఆదర్శాలు పెట్టుకుని "ఒరిజినల్"గా చిత్రం తీసి పెట్టుబడిని గూర్చిన చింతతో గుండెల "లబ్ డబ్బింగు"తో అవస్థ పడటంకన్న మంచి కథను "డబ్" చేయడంలో తప్పు లేదనీ సుఖం కలదనీ అభిజ్ఞులు కొందరి భావం నిజమే

పౌరాణిక 'కాలం'

పౌరాణికాలుదాటి సాంఘికాలు, జానపదాలు కలిసి మెలిసి వచ్చి, తిరిగి పౌరాణికాలంవచ్చి పడిన ఈ రోజుల్లో పేరుల్లో రాణించే పౌరాణికాలు నిర్మించడం ఎంతయినా అవసరం

హిందూ, జైన, బౌద్ధ పురాణాలు ఎన్నో మనకు ఉన్నాయి కృత్రిమత లేనిదే రాణించని పసు కాలీన కథలకన్న, సహజంగాఉండే కొన్ని శ్రుతి కథలు చిత్రీకరించడం మేలు. బుద్ధ జాతక కథలు, మహాభారత ఉపాఖ్యానాలు, చారిత్రకమైన కథలు చిత్రీకరించడంవల్ల 'సినిమా' ధ్యేయం నిరపాయంగా రాణిస్తుంది బెన్—హర్, టెన్ కమాండ్‌మెంట్స్, కోవాడిస్ మొదలయిన పాశ్చాత్య చిత్రాల ధోరణిలో మొత్తంమీద మన చిత్రాల దృక్పథం మార్చడం అవసరం,

జాతీయత, సంస్కృతి తొలుకాడే, ఒక లక్ష్యంతో చిత్ర నిర్మాణం సాగాలి అందుకు మళ్లీ పౌరాణికాలం స్థిరపడాలి ★



చేతనావారి "గుళ్ళో పెళ్ళి"లో రమణమూర్తి, కృష్ణకుమారి.

సీతారాపథంలో....

ఆది ఒక కళాశాల. అక్కడ చదువుకున్న కళతో కాపురం చేస్తాయని ఒక అవ్రపథ! అందుకు తగ్గట్టుగానే ఒక కళా ప్రదర్శనం!

ఆ కాలేజీలో సంగీతపు పోటీ ఏర్పాటు చేశారు అందుకు జడ్జీగా ప్రఖ్యాత సంగీత దర్శకుడు సాలూరు రాజేశ్వరరావును రప్పించుకున్నారు ఆ కళాశాల ప్రిన్సిపాలు వేమూరి నాగయ్యగారు కూడా ఒక జడ్జీ!

జగజెట్టు లయిన బిడ్డలు చాలా మంది వచ్చారా —పాడారు. పాడారు పాడనట్లు తెలియనివారు తెలివట్టే ఉన్నారు

ఆపారి గడుగ్గాయి పిడుగులాటి ఒక అబ్బాయి, సీమ టపాకాయలాటి ఓ అమ్మాయి చెరో వైపు నుంచి వచ్చారు రెండు మైకుల ముందూ నుంచున్నారు పోరమావు సవాళ్ళు చేసుకున్నారు జనమూ, జడ్జీలూ ఆత్రంగా చూస్తున్నారు

అబ్బాయి అందంగా, మందంగా మంద్ర స్థాయిలో తగుమాత్రంగా హాయి కలిపి—మరీ అందుకున్నాడు పోటీపాట

'పాడవే రాధికా,
నే నారంభించిన ఈ రాగమునే నీ
పాలించవే బాలికా—'

భలే యీ అమ్మాయిగారు వెంటనే అంటు కొరు తురుగ్గా—

'చాలులే మాధవా—
ఆలోచింపక రాగము పాడే
లేలను కానోయ్ బాలకా'

ఇలా హోరాహోరిగా పాటల పోరు సాగింది. ప్రేమికులు న్ర్వశాపేక్షంగా శోభనం కొరికింది శ్రోత...

ఇక చరణాల తోరణాలపైన రణాలు ప్రారంభ మైనాయి. రెండు 'పాట' కి కుసుమాల పరస్పర పరాగ సంపర్కంలా, ఈ రాగ సంపర్కంతో వాళ్ళ హృదయ కుసుమాలు సుమించి మంచి సంగీత సౌరభం చల్లగా సోకింది

చివరకు జడ్జీగారు అమ్మాయికే బహుమతి యిచ్చారు 'ఆడపిల్ల కదా' అని అబ్బాయీ తమా యించుకున్నాడు అదే అనుకుని—అయితే తనలో తను ఒక్కటే అనుకున్నాడు అసలు ఆ అమ్మా యినే బహుమతిగా స్వీకరించి జీవితం అమర గీతం చేసుకోవాలని, ఆ అమ్మాయి ఏమనుకుందో —మనుకోలేదో మనతో చెప్పలేదు కళ్ళు మాత్రం ఏదో కథ చెప్పబోయి వాటినవే కప్పేసుకున్నాయి

పిసి సంగీత ప్రసాదరావు సంగీత దర్శకత్వంలో ఈ గీతం ఘంటసాల, పాటల గంధి సుశీల పాడారు.

గుత్తుం దివపతి భాస్కర నారాయణ నిర్మిస్తున్న 'పెండ్లి పిలుపు' లోనిది అబ్బాయిగా



ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ వారి 'భార్యాభర్తలు'లో కృష్ణకుమారి.



ప్యాసే పంఛీచిత్రంలో మహమూద్, అమీతా.

ఎన్.టి. రామారావు, అమ్మాయిగా దేవిక నటించారు.

ఈ పాటల, పానిపట్టు యుద్ధంలో అంతరూ ఉపాకరించి ఆ ఘట్టాన్ని రమ్యంగా తీశారు.

* * *

ఆంధ్ర రాజధాని భాగ్యనగరం. నాగరకత, రక రకాల తళుకు బెళుకులతో బజార్లలో పచార్లు చేస్తోంది. తెలుగు, కన్నడ, మరాట, ముస్లిం, పర్షియన్, పంజాబీ .... కలగాపులగంగా పేరో ‌గం తీర్చే భాగ్యనగరరాజవీధులు. ఆ వీధుల

సీ తా రా ప థం లో

కూడలి స్థలంలో ఒక భవనం. ఆ భవనం పేరు ఆదర్శ (?) విజ్ఞాన (? ?) మండలి (!). అయితే ఆ భవనం బోర్డుమీద ఈ ప్రశ్నార్థకాలు ఆశ్చర్య సూచికలూ అల్లరి చేయవు. ఆ భవనం సంగతి తెలిసినవాళ్ల మొహాలు మాత్రం ఆ గుర్తులతో నిండి ఉంటాయి.

లోపలికి పోతే మదిర, మదిరాక్షి, మధుర సంగీతం! ఆ మండలిలో చతుర్ముఖ, షణ్ముఖ పారాయణ! కొందరు వయసుగాళ్ల కైపు కళ్ల కథా కమామిషూ చిత్రంగా ఉంటుంది.

ఈ ఆదర్శ విజ్ఞాన మండలికి గల పరువు, ప్రతిష్ఠలు ఒకటి రెండు కాదు. విశేషంగా ఉన్నాయి. అది జోగిందర్ అనే ఒక పక్కా పెద్ద మనిషి ఆధ్వర్యంలో నడుస్తోంది. అతను చాలా ఘటికుడని హైదరాబాదులో చాలామందికి తెలుసు. అతని చిరునవ్వులూ, మర్యాదా, మన్ననా, చేత పయినంత వరకూ అతని నైజాలు దాచే ఇజాలు. ఈ ఘటికుడు ఎంతకయినా తెగిస్తాడు. చలిం చడు. ఈ 'ఘటికాచలమహాత్యం' తెలిసిన ఇద్దరు సి. ఐ. డీ. లు మారు వేషాలు బనాయించి సౌదీ అరేబియా మియాల్లాగా తయారై దొంగని దొంగ తనంతోనే లొంగదీయాలనే మాట సారులై ఈ ఆదర్శ విజ్ఞాన మండలికి వచ్చారు.

రాగానే వారికి మదిరా సౌరభం గుప్పున సోకి ఆ పరిసరాన్ని వివరించింది. మరో అడుగు 'వేసే సరికి ఆసులు, కాసులు కలిసి ఆడుకునే మేజా బల్లలు రమ్మని పిలిచాయి. అసలు హాల్లోకి పోయే సరికి ఆ విషయ జీవాలయంలో మూలవిరాట్టు జోగీంద్రుడు సాక్షాత్కరించాడు. ఈ అరేబియా మియాలకు జోగీభయ్యా స్వాగతం చెప్పి, రెండు పెగ్గు లిప్పించి చతుర్ముఖ పారాయణలోకి దింపాడు. ఆటలచాటున జోగిందర్ ఈ అరేబియా మియాల ఆంతర్యం పరిశీలిస్తూ తన్ను పునాదులు తనిఖీ చేస్తున్నాడు.

ఈ కాండలో లోపించిన మరో రస పట్టు పట్టం ప్రారంభమైంది. ఓ వెన్నెల వినకర్ర, వగలతో పగలబడిపోతూ, కైపుతో కెంపు లయిన చూపు తూపులు విసురుతూ, హొయలు, లయలు తప్పని జల్సా నాట్యం మొదలుపెట్టింది. ఆ ఆటకు తగ్గ పాట. పాటలో వస్తువు పేకాట. ఆమె ఈ అరేబియామియాలకు, జోగిందర్‌కు మధ్య తమాషాగా తయారైంది. ఈ పాట సంద డిలో మెల్లిగా జారుకున్నాడు జోగిందర్—దర్శ కుడు బోళ్ల సుబ్బారావు 'కట్' అన్నారు.

శ్రీ రామా పిక్చర్స్‌వారి దేశద్రోహులు చిత్రం లోనిది ఈ సన్నివేశం. పాట, రచన ఆరుద్ర. సంగీతం ఎస్. రాజేశ్వరరావు. జోగిందర్‌గా రాజ నాల, అరేబియా వేషంలో దాక్కున్న సి. ఐ. డీ లుగా రామకృష్ణ, శోభన్‌బాబు ('భక్త శబరి' లో 'కరుణ' పాత్రధారి) నాట్యకత్తెగా జెమినీ చంద్ర నటించారు.

ఎన్. టి. రామారావు, దేవిక, గిరిజ, రమణా రెడ్డి, కాంతారావు నటిస్తున్న యీ చిత్రం దాదాపు సగం పూర్తి అయింది. ★

విక్రం రంగా విదేశయాత్ర

విజయవంతమైన చిత్రాలు తీసిన విక్రమ్ అధినేత బి. ఎస్. రంగా మార్చి 4 వ తేదీ బయలు దేరి మలయా మీదుగా ప్రపంచపర్యటనకు వెళ్లారు. ఆసియా, అమెరికా, యూరప్ దేశా లలో మూడు నెలలపాటు శ్రీ రంగా పర్యటి స్తారు. విదేశాలలో సినీ లోక విశేషాలు విచారించి మెరుగులు, మరుగులు తెలుసుకొనడానికి ఆయన ప్రయత్నిస్తారు. ★

వార్తాభరణం

ప్రసిద్ధ దర్శకులు బి. ఎన్ రెడ్డి 'భక్త ప్రహ్లాద' చిత్ర నిర్మాణానికి పూనుకున్నారు వాహినీ సంస్థ రజతోత్సవానికి కానుకగా యీ చిత్రం విడుదల కాగలదని వార్త తారాగణం ఏమిటో ఇంకా రూఢిగా తెలియలేదు

*　　　*　　　*

విజయవారి జానపదం 'జగదేక వీరుడు' కె. వి. రెడ్డి దర్శకత్వంలో మూడు వంతులు పూర్తి అయింది దీనికి రూప(క) కల్పన పింగళి 'పాళీ' సంగీతం పెండ్యాల నాగేశ్వరరావు ఎన్ టి రామారావు, బి సరోజాదేవి, రేలంగి, గిరిజ మున్నగు వారు నటిస్తున్నారు ఏప్రిల్‌లో ఈ చిత్రం విడుదల కాగలదు

*　　　*　　　*

వి ఎస్. ఫిలిమ్స్‌వారి చారిత్రక భక్తిరసమయ గాధ భక్త రామదాసు' ఏప్రిల్ చివరకు విడుదల చేయదలచినట్లు దర్శక నిర్మాత నాగయ్య తెలిపారు నాగయ్య, లింగమూర్తి, సహల సూర్యచంద్రరావు, శిర్ల బ్రహ్మయ్య, గుమ్మడి, రామశర్మ, కన్నాంబ, సూర్యకుమారి నటిస్తున్నారు. సంగీతం అశ్వద్ధామ రచన • యడవల్లి లక్ష్మీ నారాయణ రేలంగి అతిథి నటుడుగా నటిస్తున్నారు

*　　　*　　　*

శ్రీ వాణీ ఫిలిమ్స్ పేరిట ఇటీవల వెలసిన సంస్థ మొదట ఒక పౌరాణికం తీస్తారని తెలుస్తున్నది అందుకు 'మహిరావణ' ఎన్నుకున్నట్లు కూడ తెలిసింది ముఖ్యనటుడు ఎన్ వి రంగారావు దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు

*　　　*　　　*

'ఆలివర్ ట్విస్ట్' ఆధారంగా 'చిట్టి తమ్ముడు' అనే చిత్రం విజయగోపాల్ ప్రొడక్షన్స్‌వారు నిర్మిస్తున్నారు సంగీతం పెండ్యాల దర్శకుడు తిలక్

*　　　*　　　*

గ్రామీణ కథ ఆధారంగా తెలుగుతనం తొలుకాడే కథను నవశక్తి వారు చిత్రీకరిస్తున్నారు నాగేశ్వరరావు, కృష్ణకుమారి, రమణారెడ్డి, సురభి బాలసరస్వతి నటిస్తున్నారు దర్శకుడు రామినీడు సంగీతం అశ్వద్ధామ

*　　　*　　　*

లలితకళానికేతన్‌వారి 'భక్త జయదేవ' విడుదలకు సిద్ధంగా ఉంది ఈ నెలలోనే విడుదల కాగలదని తెలుస్తోంది అంజలి, నాగేశ్వరరావు, రేలంగి, మిక్కిలినేని, కె వి ఎస్ శర్మ మున్నగు వారు నటిస్తున్నారు దర్శకుడు పి వి రామారావు సంగీతం ఎస్ రాజేశ్వరరావు

*　　　*　　　*

పారగన్ పిక్చర్స్‌వారి 'తల్లి ఇచ్చిన ఆజ్ఞ' (అన్నియున్ ఆనై) అనువాద చిత్రం విడుదల కానున్నది తమిళంలో ఈ చిత్రం రాష్ట్రపతి పతకం పొందింది దర్శకుడు చిత్రపు నారాయణమూర్తి మాటలు, పాటలు శ్రీ శ్రీ శివాజీ గణేశన్, సావిత్రి, ఎస్ వి. రంగారావు, ఎం. ఎన్. రాజం, పండరీబాయి, నంబియార్ నటీనటులు.



కె. వి. ఎస్. ప్రొడక్షన్స 'పాపాల భైరవుడు'లో అంజలీదేవి, బాలాజీ.

సరిగమలు

ప్రదర్శకత్వం

ప్రదర్శకత్వం, దర్శకత్వం అయితే ప్రసిద్ధ సినీ రచయిత ప్రత్యగాత్మ దర్శకుడూ, రచయిత అనిపించుకుంటారు ప్రదర్శకత్వం తత్వంగా మనస్తత్వంగా గల దర్శకులు చాలా కొద్దిమంది రచయితలు చాలామంది

ఇంతకీ ప్రదర్శకత్వం అంటే ?రచయిత రాసే అక్షరాలు అభినయ విధికి బీజాక్షరాలు ఆ అక్షరాలను అంటూ, అనుగుణంగా అభినయిస్తే రచయిత సృష్టించిన భావవ్యక్తులు జీవ వ్యక్తులై నాటకంగాని సినిమాగాని రక్తి కడుతుంది. రచయిత వూహాలు, భావాలు, జీవాలు అక్షరాలే వాటిని ఆవిష్కరించడం దర్శకుని విధి, విలాసమూను కాని రచయిత, దర్శకుడూ ఒక్కరే అయినప్పుడు అక్షరాలలో నాటిన పాత్రలు అక్షరాలా పాత్రోచితంగా జీవిస్తాయి

చిరుపేదలు, పరివర్తన, ఇల్లరికం మున్నగు చిత్రాలలో 'ప్రత్యగాత్మ' రచయితగానే ఉండిపోయారు ఇప్పుడు ప్రసాద్ ఆర్ట్స్‌వారి 'భార్యాభర్తలు' తీర్చిదిద్దడానికి ఆయన దర్శకత్వం బాధ్యత వహించారు ఇక్కడ రచన శ్రీ శ్రీ, రూపకల్పన మాత్రం ప్రత్యగాత్మ

రచయితగా పేరొందిన, ప్రత్యగాత్మ దర్శకత్వం కొత్త పుంతలు తొక్కిందని వినికిడి

*　　　*　　　*

తొలిసారిగా 'ద్రోహి'లో 'వేడే తీరె నా వాంఛ' అనే పాటవిని, ఆ పాట కట్టుబడి అందుకు వలసిన బాణీ పెట్టుబడి పెండ్యాల నాగేశ్వరరావుది అని తెలుసుకున్నవారు అతనికి మంచి భవితవ్యం ఉందని తీర్మానించుకున్నారు. ఆనాటినుండీ పెండ్యాలను ఎక్కువగా మన్నించినది ప్రకాష్ పిక్చర్స్ సంస్థ, తరువాత దీక్ష, కన్నతల్లి, మేలుకొలుపు మొదలయిన చిత్రాలలో పెండ్యాల మంచి బాణీలు కట్టి అందుకు పెట్టిపుట్టినట్లు మెప్పులు పొందారు.


దొంగరాముడు, జయభేరి, భాగ్యరేఖ, భట్టి విక్రమార్క, శ్రీ వేంకటేశ్వర మాహాత్మ్యం, భక్త శబరి, నిత్యకళ్యాణం పచ్చతోరణం, వెలుగునీడలు చిత్రాలతో పెండ్యాల నేటి మేటి దర్శకులతో దీటు రాగలిగారు. 'బాణీ వారాణీ' అని గలిగిన సినీ వీరభద్రుడయినా "అన్ని విధాలా అగ్రగణ్యుడు రాజేశ్వరరావు, ప్రథమ తాంబూలం ఆయనది" అంటారు పెండ్యాల

సంగీతం సామవన్యం ద్వారా గోపాలంగారివల్ల, అభినయం, అనుభవం ఆయన నాటకాల ద్వారా పెండ్యాల సంపాదించారు. 'సృష్టిలో తీయనిది' అనే పాటకు పెండ్యాల కట్టిన బాణీ చాలు—అతని ప్రతిభకు అదే తార్కాణం

రాజనాల

ఇచ్చిన పాత్రను మెచ్చినవారు, మెచ్చి మనసిచ్చి ఆ పాత్రగానే జీవించాలని కృషి చేసేవారు నటీనటుల్లో కొందరు ఉన్నారు అటువంటి కృషీవలులలో రాజనాల ఒకరు రాజనాల నటనలో రాజనాలు పండించి, జనాలకు నచ్చిన నటుడు ఇచ్చిన పాత్రకు న్యాయం చేయాలనే పట్టుదలతో అతను రకరకాల పాత్రలు ధరించి కృతకృత్యుడైనాడు అయితే కేవలం విలన్ పాత్రలే ఎక్కువగా అతన్ని ఆకర్షించాయి ఇటీవలి చిత్రం 'అన్నా—చెల్లెలు'లో అతని పాత్ర మంచి ప్రజాదరణ పొందింది

'అభినివేశం ఉంటే చాతుర్యం ఉంటుంది దానివల్ల అభినయం సహజమందరమవుతుంది. ఆ అభినివేశం నాకు ఉన్నది'—అంటారు రాజనాల. ★



భారతదేశంలో పర్యటన ముగించుకొని స్వదేశానికి తిరిగివెళ్ళిన బ్రిటిష్‌రాణి రెండవ ఎలిజబెత్‌కు, ఆమె భర్త డ్యూక్ ఆఫ్ ఎడింబరోకు పాలమ్ విమానాశ్రయంలో రాష్ట్రపతి డా॥ రాజేంద్రప్రసాద్, ఉపరాష్ట్రపతి డా॥ ఎస్. రాధాకృష్ణన్, ప్రధాని నెహ్రూ వీడ్కోలు ఇచ్చిన దృశ్యం.

న్యూ ఢిల్లీ లేఖ — **శ్రీ కృష్ణ**

వృద్ధనాయకులకు హోలీ సరదాలు: చైనాతో పాకిస్తాన్ పంచశీల ఒప్పందం!

మహారాజా మరణించాడు; మహారాజా చిరకాలం వర్ధిల్లాలి" అన్నది అనాదిగా బ్రిటిష్‌వారి సూక్తి మ్యాఢిల్లీలో ఇటీవల ప్రధానమంత్రి అల్లుడు మరణించారు. దేశీయాంగ మంత్రి పండిత గోవింద వల్లభపంతు వారం రోజులుగా స్పృహ లేకుండా ఉన్నారు ఈ సంఘటన లేవీ రాష్ట్రపతికి హోలీ పండుగలో పాల్గొనాలన్న ఉత్సాహాన్ని తగ్గించ లేదు రాష్ట్రపతితో హోలీ ఆడేందుకు పలువురు ఇతరులతోపాటు పార్లమెంటు సభ్యులకు కూడా ఆహ్వానాలు వెళ్ళాయి స్వాతంత్ర్యానికి పూర్వం బడి పిల్లలు మాత్రమే హోలీ కోలాహలంలో పాల్గొనే వారు స్వాతంత్ర్యానంతరం 70 ఏళ్ళకు పైబడిన వయస్సుగల వృద్ధులు ఈ ఉత్సవం జరుపుకుంటున్నారు

*   *   *

పదాతిబలం ప్రధానాధికారిగా జనరల్ బి ఎ కౌల్ నియుక్తులు కానున్నారన్న వార్త ఖాయమనే అనుకోవచ్చు రాజధాని నగరంలో ఇదే ప్రధాన చర్చనీయాంశంగా ఉన్నది

ప్రధాన మంత్రి తమ స్వీయచరిత్రలో ఇలా వ్రాసుకున్నారు "మేము కాశ్మీరీలం రెండు శతాబ్దాలకు పూర్వం 18 వ శతాబ్దారంభంలో మా పూర్వీకులు ధనాన్ని, కీర్తిని సమార్జించాలనే అభిలాషతో కాశ్మీర్ లోయను విడిచి, సారవంతమైన మైదానప్రాంతాలకు తరలివచ్చారు అది మొగల్ సామ్రాజ్యం పతనావస్థలో ఉన్న కాలం ఔరంగజేబు మరణించాడు ఫరూక్ సాయిర్ సింహాసనానికి వచ్చాడు అప్పుడు కాశ్మీర్‌ను విడిచి వచ్చిన మా పూర్వీకుని పేరు రాజ్ కౌల్ పార శీక, సంస్కృత భాషలలో మహాపండితుడని ఆయన ఖ్యాతి గడించారు ఫరూక్ సాయిర్ కాశ్మీర్ వచ్చినప్పుడు ఈయన ఆ మొగల్ చక్రవర్తి దృష్టిని ఆకర్షించారు బహుశ ఆ చక్రవర్తి కోరిక ననుసరించే 1716 సంవత్సరం దరిదాపుల్లో రాజా కౌల్ ఢిల్లీ నగరానికి తరలి వచ్చి ఉంటారు కాలువ గట్టున నిర్మించబడిన భవనంతో

పాటు ఒక జాగీర్ ఆయన కుటుంబానికి మంజూరైంది. ఈ భవనంలో నివాసం ఏర్పరచుకొన్నందువల్లనే ఆయన పేరుకు "నెహ్రూ" పదం చేర్పబడింది. (నహర్ అంటే కాలువ అని అర్థం) అసలు ఇంటిపేరు "కౌలు". ఈ మార్పు వచ్చిన తరువాత అది కౌల్—నెహ్రూ అయింది. ఆ తరువాత కాలంలో కౌల్ లోపించి, నెహ్రూలమయ్యాం.

దీనినిబట్టి నెహ్రూ లందరూ నిజానికి కౌలులని స్పష్టమవుతోంది. ఢిల్లీ నగరంలోని సాదతుఖాన్ కాలువ గట్టున నివసించిన కౌలులు నెహ్రూ లయ్యారు. కనుక ప్రధాన మంత్రి ఇంటిపేరు "కౌల్" ప్రధాన కార్యదర్శి శ్రీ ఆర్. కె. నెహ్రూ కూడా కౌలే అయివుండాలి. పదాతిబలం ప్రధానాధికారి పదవికి శ్రీ కృష్ణమీనన్ కొత్తగా నియమించనున్న వ్యక్తి కూడా కౌలే. జనరల్ కౌల్ రెండు సంవత్సరాలలో సర్వ సైన్యాధికారి కాగలరనీ, ఈనాడు ప్రాచ్య దేశాలలో అమలుయందుఉన్న ప్రజాస్వామ్యం తీరు తెన్నుల ననుసరించి క్రమేణా ఆయనే రాష్ట్రపతి అవుతారనీ న్యూఢిల్లీవాసులు విశ్వసిస్తున్నారు.

శ్రీ కృష్ణమీనన్‌కు ప్రధాన మంత్రి అండ ఉన్నది. ఈ అండ ధర్మమా అని రక్షణ శాఖలో రాజకీయాలు ప్రవేశించాయి. శ్రీ కృష్ణమీనన్ ఒక వేళ రంగంనుంచి నిష్క్రమించినా, రక్షణ బలాలతో ఆయన ఆడిన ఆటకు దేశం మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది.

* * *

పాకిస్తాన్ అధ్యక్షుడు జనరల్ ఆయూబ్ భారత దేశాన్ని దుయ్యబడుతూ, చేసిన ప్రసంగంవల్ల అనుకున్న విధంగానే పరిణామాలు సంభవించాయి.

కరాచీలోని భారత హై కమీషనర్ కార్యాలయాలపై దాడి జరిగింది. అల్లరిమూకలు రువ్విన రాళ్లు తగిలి హై కమిషనర్, పెక్కుమంది ఇతరులు గాయపడ్డారు.

ఈ సంఘటన మూలంగా ఒక ముఖ్యమైన సమస్య ఉత్పన్నమవుతోంది. అన్ని దేశాలలోను రాయబారి కార్యాలయాలు సురక్షిత కేంద్రాలుగా పరిగణింపబడుతాయి. ఆ యా దేశాల ...రులు సైతం ఈ కార్యాలయాలలో ఆశ్రయం పొందవచ్చు. అప్పుడు వారికి తగిన రక్షణ ఉంటుంది. ఇందుకు ఉదాహరణగా నేపాల్ మాజీ మహారాజు సంగతే పేర్కొనవచ్చు. ఆయన తన భవనంనుంచి పారిపోయి ఖాట్మండూలోని భారత రాయబారి కార్యాలయంలో తలదాచుకున్నారు. అప్పటి నేపాల్ పాలకులు కూడా ఆయనకు ఏ విధమైన హాని కలిగించలేకపోయారు.

రాయబారుల కార్యాలయాల ఎదుట ప్రదర్శనలు నిర్వహించే సంప్రదాయం ఇటీవలే ప్రారంభమైంది. ఢిల్లీలో కూడా ఇలాంటి ప్రదర్శనలు జరిగాయి. వారం రోజుల క్రితమే న్యూఢిల్లీలోని బెల్జియన్ రాయబారి కార్యాలయంవద్ద ప్రదర్శనలు జరిగాయి. అయితే ఇలాంటి ప్రదర్శనలు ఆ యా ప్రభుత్వాల విధానాలపై ఏ విధమైన ప్రభావం చూపగలవో ఇంకా స్పష్టంగా తెలియలేదు. నిజానికి ప్రభుత్వ విధానాన్ని రాయబారి రూపొందించడు గదా!. ఉదాహరణకు భారత దేశాన్నే తీసుకోండి. ఏ రాయబారి శ్రీ కృష్ణమీనన్ ఉపన్యాసాలపై తన ప్రభావం చూపగలుగుతున్నాడు? కరాచీలో భారత హై కమీషనర్ కర్యాలయాలపై నిష్కారణంగా పాకిస్తానీలు జరిపిన దాడిని సమర్థించేందుకు నేనీ విషయాలు చెప్పటంలేదు. కాని మనదేశంలో కూడా విదేశీ దౌత్య ప్రతినిధుల కార్యాలయులముందు ప్రదర్శనలు జరిపే అలవాటు పెచ్చుమీరుతోంది. దీనిని మాన్పించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. రెండు తప్పులు ఒక ఒప్పును సృష్టించలేవు.

ఇప్పుడు మరొకసారి పాకిస్తాన్ విషయం పరిశీలిద్దాం. ఆ దేశంలో అమెరికన్ల పలుకుబడి సన్నగిల్లుతోంది. నూనె పరిశోధన నిమిత్తం పాకిస్తాన్ రష్యాతో ఒక ఒప్పందం కూడా కుదుర్చుకున్నది. భారతదేశాన్ని వేధించేందుకు చైనాతో మైత్రి మహా శ్రేష్ఠంగా కనిపిస్తోంది. ఇంకోవిధంగా చెప్పవలసివస్తే, మరికొన్ని మాసాలలో పాకిస్తాన్—చైనాల మధ్య ఆత్మీయత అభివృద్ధి చెందుతుందని అనుకోవచ్చు.

ఈ సందర్భంలో సరిహద్దుసమస్యపై చైనీయులతో చర్చలు కొనసాగించినభారతీయ ఉద్యోగుల నివేదికలోని కొన్ని వాక్యాలను పరిశీలించటం ఎంతైనా ఉచితం: "సరిహద్దు విషయమై భారతీయ బృందం చూపిన సాక్ష్యాధారాలు ప్రశస్తమైనవని నివేదిక స్పష్టం చేస్తోంది. తమ ప్రభుత్వాల వాదాలను సమర్థిస్తూ, ఉభయ దేశాల ఉద్యోగులు సాక్ష్యాధారాలు చూపినా, మనం వారికంటే దాదాపు మూడు రెట్లు అధికంగా సాక్ష్యాధారాలు చూపాం. భారతీయ బృందం తమ వాదానికి అనుకూలంగా 630 అంశాలను చూపగా, చైనీయులు 245 అంశాలను మాత్రమే చూపగలిగారు. మనం చూపిన అంశాలు కేవలం లెక్కకు మాత్రమే అధికంకాక, ప్రశస్తమైనవి కూడాను. మన సాక్ష్యాధారాలు సుస్పష్టంగా ఉండటంతోపాటు, వివాదగ్రస్తమైన ప్రాంతాలు సంప్రదాయసిద్ధంగా భారతదేశంలో అంతర్భాగాలని నిరూపిస్తున్నాయి. అంతేకాక మన వాదంలో స్వవచన వ్యాఘాత దోషం లేదు."

ఇప్పుడు మనకు ఉపకరించేవి ప్రశస్తమైన ఆయుధాలుగాని, అత్యుత్తమమైన సాక్ష్యాధారాలు కావు. "కాగితంమీద" చైనాను పూర్తిగా చిత్తు చేశామన్న ధీమాతో శ్రీ జగత్ మెహతా, ఆయన బృందం రొమ్ము విరుచుకొని తిరుగుతున్నారు కాని, భారత భూభాగం మాత్రం చైనీయుల అధీనంలోనే ఉన్నది. సమితిలోను, దాని వెలుపలా శ్రీ కృష్ణమీనన్ తమ అసాధారణ వ్యూహ రచనా నైపుణిని ప్రదర్శిస్తూనే ఉన్నా ప్రయోజనంలేకపోతోంది. ఏదేశానికైనా చిట్టచివరకు ఉపకరించేది సైనిక శక్తేగాని, పంచశీల కాదని కాంగో సైతం నిరూపించింది.

దీనివల్ల పాకిస్తానీ ప్రభుత్వ ఆలోచనలు ఏవిధంగా ఉన్నయో సూచన మాత్రంగా తెలుస్తున్నాయి. సైనిక సహాయం మినహా—అదైనా సిద్ధాంతరీత్యా భారతదేశానికి వ్యతిరేకంగా వినియోగించరాదు — అమెరికావల్ల తమకు కలుగుతున్న మేలు ఏమీ లేదని పాకిస్తాన్ గుర్తించింది. భారత ప్రభుత్వం తన భూభాగంనుంచి చైనీయులను తరిమివేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నదని కూడా పాకిస్తాన్ గ్రహించింది. చైనీయులకు ఇప్పుడు విస్తరణ కాంక్ష పట్టింది. భూటాన్, సిక్కింలను తమ అధీనంలోకి తెచ్చుకోవాలని వారి కోరిక. అందువల్ల చైనా—పాకిస్తాన్‌లు పంచశీల ఒప్పందాన్ని ఒకటి కుదుర్చుకున్నట్లయితే ఉభయ దేశాలకు లాభసాటిగా ఉంటుంది. లేక సైనిక ఒప్పందం అయితే మరీ మంచిది. రాజకీయాలు విచిత్రమైన పొత్తులు కుదురుస్తాయి!

★

పిక్నిక్

(39వ పేజీ తరువాయి)

భుక్తాయాసం తీర్చుకున్నాక శాస్త్రిగారు లేచి, 'అలా తిరిగి వద్దాం రావోయ్ సారథి'' అన్నాడు. సారథి, 'ఏం చేస్తావో'' అన్నట్లు చూస్తున్న బావ మరిది వంకా, తల వంచుకుని చాపమీద గీతల గీస్తున్న మాలతి వంక చూసి మామగారితో బయలుదేరాడు. తోట దక్షిణంవేపు నున్న 'జహంగీర్' మామిడి మొక్క కింద చదికిలబడి 'కూర్చోవోయ్' అన్నాడు శాస్త్రిగారు.

సారథి కూర్చున్నాడు.

"మీ రాధా వాళ్ల గోత్రం తెలుసా సారథీ ?'' అన్నా డాయన గంభీరంగా.

"ఆ. కౌండిన్యస'' అన్నాడు సారథి నవ్వుతూ.

"ఆలమ్మాయికీ రామకృష్ణకీ పెళ్లిచేస్తే బాగుంటుం దనుకున్నానోయ్.''

"బాగానే ఉంటుంది. ఇద్దరికీ ఈడూ జోడూ కూడా ! వాళ్ల నాన్నగారితో మాట్లాడమంటే మాట్లాడతాను'' అన్నాడు సారథి.

"అందుకే నీతో చెబుతున్నాను. మొగపిల్లవాడి తండ్రి వచ్చి అడుగుతున్నాడంటే కుళ్ళుంకలు చేసే లోకం యిది....కట్న కానుకల విషయంలో నా కేమీ పట్టింపు లేదు. వాడికి కూడా ఇష్టం అయితే ఆ శుభకార్యం కాస్తా జరిపించేస్తాను. ఆ తరువాత మీ నాన్నతోపాటు వైజాగ్ క్లబ్బులో చదరంగం ఆడుకుంటాను'' అన్నా డాయన విప్పారిన హృదయంతో.

"రామకృష్ణకు ఇష్టమే లెండి. అయినా ....'' అన్నాడు సారథి సందేహంగా.

"అయినా .... ? ఆ అమ్మాయికి ఇష్టం అవుతుందో కాదో అనా ?''

"అదేంలేదు లెండి. ఆ అమ్మాయికీ ఇష్టమే.''

"మరి ఏమిటి నీ సందేహం ?''

నిజం చెప్పవలసిన సమయం వచ్చింది. ఇంత వరకూ తాను పడిన కష్టానికి ప్రతిఫలం ఇహ తేలిపోతుంది. జాగా ఎరిగి, తూచి తూచి మాట్లాడితే తప్ప కార్యం సఫలం కాదు.

"మీతో ఒక అబద్ధం చెప్పాను మామగారూ ?''

శాస్త్రిగారు ఆశ్చర్యంతో "ఏమిటది ?'' అన్నాడు.

"రాధ తండ్రి వ్యాపారం చెయ్యటం లేదు.''

"మరి ?''

"కావ్ఁగా ఆలోచిస్తానంటే చెబుతాను. ఆయన నాటకాల్లో వేషాలు వేస్తాడు. అదే ఆయన జీవనాధారం.'

శాస్త్రిగారి మొహం పాలిపోయింది. ఎంత మోసం ? తనవా డనుకున్న సారథి కూడా ఇంత మోసం చేశాడా ? ఇంకా నయం ఇప్పటికయినా చెప్పాడు.

"మీకు కోపం వస్తుందని నాకు తెలుసు మామగారూ ! నే చేసింది తప్పే కావచ్చు. కాని నిన్న సాయంత్రంనుంచి మీరు ఆ అమ్మాయిని చూస్తున్నారు. చివరికి అత్తయ్యగార్ని రాధకు కూడా అత్తగార్ని చెయ్యగలిగింది మీ హృదయం. ఆమె వడవడి మిమ్మల్ని ఆకర్షించలేదని చెప్పగలరా ?''

శాస్త్రిగారు మవునంగా వింటున్నారు.

"సుందరశివరావుగారు చాలా పెద్దమనిషి. నాటకాల్లో వేషాలు వెయ్యటమే ఆయన తప్పయితే ఆ తప్పును మన మందరం ఎప్పుడో ఒకసారి చేసివున్నాం. పైగా ....''

"అవి కిరాయి నాటకాలు కావు సారథీ ! వాటిల్లో పడ్డవారికి ప్రస్క్యాపుల్స్ అనేవి పూర్తిగా హుళక్కి అయిపోతాయి'' అన్నాడు దృఢంగా శాస్త్రిగారు.

"అని ఎందు కనుకోవాలి ? .... అయినా అవసరం కొద్దీ చేసిన పనే విలాసార్థం చేస్తే మంచిది అనుకునే మనస్తత్వం మార్చుకోవాలి మామగారూ ! అలా అనుకోడం మూలానే దేశం సగం నాశన మవుతోంది.''

"లోకం అంటూ ఒకటి ఉంది సారథీ ! రిటైర్డు ఇంజనీరుగారి అబ్బాయికి, కాబోయే ఇంజనీరుకి నాటకాలరాయుడి కూతుర్ని చేశారంటే నలుగురూ ఏమనుకుంటారు ? ఎంత అప్రదిష్ట ?''

"మనసు అవునన్నది ప్రధానం కాని మరెవరో కాదన్నది కాదు మామగారూ ! మీరు అన్నీ తెలిసినవారు. కావ్ఁగా ఆలోచించుకోండి ! ఆ అమ్మాయికి తల్లి లేదు. అయినా ఇల్లు సద్దుకుపోగల సత్తా సంపాదించుకుంది. అత్తగారి లోటు లేకుండా మా అమ్మ చూసేలా చూస్తాను. అదీ కాక అన్నింటికన్నా ముఖ్యమయినది రామకృష్ణకీ ఆ అమ్మాయి అంటే పిచ్చి అపేక్ష. నా మాట మీరు తీసెయ్యరనే ధైర్యంతో ఉన్నా డతను. ఇప్పుడు మీరు కాదన్నారని తెలిస్తే అతని కెలా ఉంటుందో ఆలోచించండి. రామకృష్ణ మనస్సు మీకు తెలియనిది కాదు.''

"నన్ను ఆలోచించుకోనీ సారథీ !''

సారథి సంతృప్తిగా నిశ్వసించాడు. ఆయనలో మార్పు వస్తుందన్నమాట. తన ప్రయత్నం సఫల మవుతోంది.

అతను లేచాడు. ఆలోచనగా నడుచుకుంటూ పెంకుటింటి వైపు వచ్చాడు. ముందు వసారాలో రాధ, అన్నపూర్ణమ్మగారు పక్క పక్కనే పడుకుని నిద్రపోతున్నారు. ఆ నిద్రలో రాధ నవ్వుకుంటోంది. ఆమెను చూస్తోంటే తన చెల్లెలు శ్రీదేవి గుర్తుకొచ్చిం దతనికి. రామకృష్ణ, రాధ దంపతు లయితే ......

శశిరేఖా అభిమన్యుల్లా ఉంటారు.

అతను వెనక్కు తిరిగాడు. శాస్త్రిగారు నేల వంక చూస్తూ, సాలోచనగా నడుచుకుంటూ వస్తున్నాడు. సారథి దగ్గరకు రాగానే తలెత్తి అతని కళ్లల్లోకి చూశాడు.

"ఏం తేల్చుకున్నారు మామగారూ ?'' అన్నాడు విజయసారథి.

అల్లుడి భుజంమీద చేయి వేసి దగ్గరకు తీసుకున్నాడు శాస్త్రిగారు. ఆ తరువాత నవ్వుతూ, ప్రేమగా "నీకు విజయసారథి అని పేరు పెట్టిన మీ నాన్నకి ఏం బహుమతి ఇవ్వాలా అని ఆలోచిస్తున్నాను'' అన్నాడు.

"ఇంకా తేలలేదా ?'' అన్నాడు సారథినవ్వుతూ.

"ఊహూఁ.''

'నాన్న అడిగినట్లుగా మకాం వైజాగ్‌కి మార్చెయ్యండి.''

శాస్త్రిగారి కళ్లు ఆనందంతో అశ్రుసిక్తా లయినాయి. ఆయనకు అల్లు డంటే తగని ప్రేమ. ఒకనాడు అనాలోచితంగా అతడిని ద్వేషించాడు తాను కాని అతని మంచితనం, ఆత్మీయత ఈనాడు అనుభవమయి ఆ ప్రేమ ఏర్పడింది.

"నీ ధైర్యానికి అభినందిస్తున్నాను సారథీ ! ఇంతనాటకంరామకృష్ణ జన్మలోఆడగలిగేవాడుకాదు.''

"ఒక్కమాట చెప్పనా ?''

"ఊఁ.''

"వాళ్ల భయాలక కారణం వాళ్లే. మీకు ఏ పని చేస్తే కోపం వస్తుందో వాళ్లకు తెలుసు. అయినా ఆపని చేస్తారు. అయితే వాళ్ల కది మంచి చేయొచ్చు. ఆ విషయం మీకు తెలిసేలా చేసినప్పుడు మీ రెందుకు కోప్పడతారు ? బలహీనతల్ని రెచ్చగొట్టే వాళ్లుండబట్టే దుర్మార్గుడు లోక కంటకు డయ్యాడని నా ఉద్దేశం.''

"నిజం'' అన్నా డాయన విప్పారిన హృదయంతో.

* * *

ఆ సాయంత్రం ఏడు గంటలకు కారు తిరిగి విజయవాడ బయలుదేరింది. కొంత దూరం కారు నడిచాక మాలతి సారథితో 'ఈ కథకు నీతి ఏమిటో చెప్పనా ?'' అన్నది.

"చెప్పు'' అన్నాడు సారథి నవ్వు మొహంతో. మిగతా అంతా చెవులు రిక్కించుకు వింటున్నారు.

"ప్రేమించిన పడతిని చేసుకో దల్చుకున్నవారు విజయసారథిని సంప్రదించుడు'' అని అన్నది మాలతి. రాధ సిగ్గులపెళ్లికూతు రయింది.

ఆనందంతో తుళ్ళిపడుతూ సాంబశివరావుగారి కారు విజయవాడ పొలిమేరలు ప్రవేశించింది. ★


గళ్లనుడికట్టు-41

ఆధారాల పోటీ ఫలితం

శ్రీ కె. శేషావతారం(భట్లమునూరు) పంపిన ఆధారాలు ఉత్తమమైనవిగా నిర్ణయించి, ఆయనకు బహుమతిగా రు 5 లు పంపుతున్నాం.

శ్రీశేషావతారంపంపినఆధారాలుఇవి:

14 అడ్డం : సంపుటంలో పేజీ లుంటాయా ? (మేము ఇచ్చినది-త్రిపుట తాళంవేసి పేజీ చింపండి) జవాబు – పుట. 32 నిలువు : విదియలో స్వర్గం తలక్రిందులైంది. (మేము ఇచ్చినది – మంచి పుస్తకాలు చదివితే స్వర్గం కనిపిస్తుంది) జవాబు – దివి.



ఆధారాలు

అడ్డం

1. క్షీరానికి పల్లకి—ఒత్తు అక్షరం లేకుండా.
3. ఆకారములో మంట పుట్టించే గుణం ఉందని ఒప్పుకోవాలి.
5. వస్తువు, వయస్సుకు మధ్యలో ఒకటి లేనిది.
7. ఏ కలియుగంలోనో రాజా ఉండి ఉంటాడు.
9. అదియా! తన ప్రయత్న మనుకొనుచున్నాడు.
10. గిరీశం 'అన్న' గుణం, పేరూ కలవాడు!
11. ఆ వర సమూహంలో ఒకటే వాలిక.
12. తలుపులో ఉండేది కడప వంటిది.
14. ఇతిహాసం వంటిదే!
16. గడ్డి—.
18. కుబేరుని పట్టణానికి కొమ్ము తిరిగితే కోపం రాదూ!
20. అక్కనుగుణాలు కలదైనా కోపం మాత్రం ఉన్నది.
21. నా కా కఠినమయిన మాటలోనే ఆశ్రయం దొరుకుతుంది.
22. వెల గల రాయి.
23. ఇనుకతిన్నా ఏ విధంగా వ్రాయండి కాని వ్యాఘ్రాన్ని మాత్రం మరిచిపోకూడదు.
25. అరణివది వరస్సులో కొంచెం చేరి మారితే త్రోవ ఏర్పడుతుంది.
29. ఇహము కానిదా?

* 30. ఇంకా 'లాభము' ప్రమాణం జరగలే దంటారా?

ఆధారాల పోటీ

గళ్ళ నుడికట్టు—43 లో 2 నిలువు మాటకు, 30 అడ్డం మాటకు మేము ఇచ్చిన ఆధారాల కన్న ఉత్తమమైనవి పంపే వారికి రు. 5 లు బహుమతి ఇస్తాము. ఆధారాలు మాకు చేరవలసిన ఆఖరి తేది మార్చి 18, 1961.


నిలువు

1. వాల్గన భాగం.


* 2. కింపురుషుల వంటిదేనా?

3. నెల్లూరు జిల్లాలో ఒక వూరు రత్నం.
4. కవ్వములో కూడా గజ్జె వలె మ్రోగాలి!
5. కొనగ—నవగకుండా వెలకారి మరి.
6. మాట త్రిప్పినా ముక్క అయి తీరుతుంది.
7. ఆ తరువాత పుట్టేది!
8. గ్రామోద్యోగి.
13. దగ్గరలో పరుషం చేర్చండి. పిశాచం ప్రత్యక్ష మవుతుంది!
15. తారాజువ్వలు, భూపతులను దాచాయి.
16. హరిద్ర.
17. 21 అడ్డంలో కష్టం!
18. బయట ముళ్ళు ముళ్ళుగా ఉన్న పండు, అది పత్తి మాత్రం పనికిరాదు!
19. కటకరథంలో కొన్ని విధమవుతాయి— అడ్డం కాకపోతే 8 నిలువు చివర మార్చి చూడండి.
24. వ్రాసినది.
26. నిర్మాణము, వ్రాత!
27. కడవలో—రాయి.
28. నీరు పోసేది.


42-వ గళ్ళనుడికట్టుకు జవాబులు



40-వ గళ్ళనుడికట్టుకు జవాబులు



బహుమతి పొందిన కార్టూన్



చిత్రకారుడు—కమలా ఆర్. మోహనరావు (కాకినాడ)

చెప్పేపద్ధతి ముఖ్యం

ఒక రాజుగారికి తన పళ్లు అన్నీ ఊడిపోయినట్లు కల వచ్చినది. ఇద్దరు జ్యోతిష్కులను రప్పించి ఆ కలకు అర్థం వివరించమని ఆజ్ఞాపించాడు రాజు.

మొదటి జ్యోతిష్కుడు, "తమరు జీవించి ఉండగానే తమ కుమారులు, మనుమలూ మృతిచెందుతారు; అదీ దాని అర్థం" అన్నాడు.

రెండవ జ్యోతిష్కుడు "తమకు తమ కుమారులకన్న మనుమలకన్నా కూడా ఆయుర్దాయం అధికం" అన్నాడు.

రాజు మంత్రిని పిలిచి, రెండవ జ్యోతిష్కుని సన్మానించమని, మొదటివానిని దండించమని ఆజ్ఞాపించాడు.

—తటవర్తి ప్రసాదరావు (హైద్రాబాదు.)

* * *

ఎవరు గాడిద?

ఒకానొక పెద్దమనిషి హోటల్‌లో భోజనాలగదితలుపులు తెరిచి తిరిగి జేరవేయకుండా లోపలికి వెళ్ళాడు. తలుపులు భడీమని చప్పుడు చేస్తూ మూసుకున్నాయి. ఆ చప్పుడు విని భోజనం చేస్తున్న ఒకరికి కోపం వచ్చి "ఎవడో పల్లెటూరి మొద్దులా ఉన్నాడు-తలుపు మూయాలని కూడా తెలియదు" అని అరిచాడు. లోపలికివచ్చిన పెద్దమనిషి ఒక కుర్చీలో చతికిలబడి భోరున ఏడుపు లంకించుకున్నాడు.

కేకలువేసిన ఆయన అతని వద్దకు వచ్చి అనునయంగా "మీరింత నొచ్చుకుంటారనుకోలేదు; కోపంతో ఒళ్ళుపై తెలియక ఏదో అనేశాను; మన్నించండి" అన్నాడు.

ఆపెద్దమనిషి కళ్లు తుడుచుకుంటూ ఇలా అన్నాడు: "అబ్బే మీరన్నమాటలకు నేనేమీ బాధపడడం లేదండి. నేను నిజంగా పల్లెటూరివాడినే. ఈమధ్యనే పట్నం వచ్చాను. గాడిద ఓండ్రిస్తే మాత్రం నాకు మాఊరు మాఇల్లుఅన్నీ జ్ఞాపకంవచ్చి ఏడుపువస్తూ ఉంటుంది!"

—జి. తులసీదాస్ (విశాఖపట్టణం)

హాస్యకథలు


ఆదేగతి

ఒకరాష్ట్రప్రభుత్వ ముఖ్యమంత్రి ఒకప్పుడు పిచ్చాసుపత్రి తనిఖీచేస్తున్నాడు. ఒక పిచ్చివాడు "ఎవరు నువ్వు" అని ఆయనను గద్దించాడు. ఆయన కంగారుపడి "నేను ఈ రాష్ట్రం ముఖ్యమంత్రిని" అని గట్టిగా నేనమాధానం చెప్పాడు.

వెంటనే ఆపిచ్చివాడు "ష్, అరవకు. లేకపోతే నీకూ నాకు పట్టిన గతే పట్టుతుంది. జాగ్రత్త" అని ఆయనను హెచ్చరించాడు.

—'సారథి' (తిరుపతి)

Printed and Published for NageswaraRao Estates (Private) Ltd,. by S. Radha Krishna at The Andhra Patrika Press 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad



ఆధారాలు

అడ్డం

1. స్త్రీరాణికి పల్లకి—ఒత్తు అక్షరం లేకుండా.
3. ఆకారములో మంట పుట్టించే గుణం ఉందని ఒప్పుకోవాలి.
5. వస్తువు, వరస్సుకు మధ్యలో ఒకటి లేనిది.
7. ఏ కలియుగంలోనో రాజు ఉండి ఉంటాడు.
9. అదియా ! తన ప్రయత్న మనుకొనుచున్నాడు.
10. గిరీశం 'అప్ప' గుణం, పేరూ కలవాడు!
11. ఆ నర సమూహంలో ఒకటే నాలుక.
12. తలుపుతో ఉండేది కడప వంటిది.
14. ఇతిహాసం వంటిదే !
16. గడ్డి—.
18. కుబేరుని పట్టణానికి కొమ్ము తిరిగితే కోపం రాదూ !
20. అక్కసుగుణాలు కంద్దైనా కోపం మాత్రం ఉన్నది.
21. నా కా కఠినమయిన మాటలోనే ఆశ్రయం దొరుకుతుంది.
22. వెల గల రాయి.
23. ఇనుకలిన్నె ఏ విధంగా వ్రాయండి కాని వ్యాక్రమాన్ని మాత్రం మరిచిపోకూడదు.
25. అరణిపది నరస్సులో కొంచెం పేరు మారితే త్రోవ ఏర్పడుతుంది.
29. ఇహము కానిదా ?
* 30. ఇంకా 'లాభము' ప్రమాదం జరగితే అంటారా ?


ఆధారాల పోటీ

గళ్ళ నుడికట్టు—43 లో 2 నిలువు మాటకు, 30 అడ్డం మాటకు మేము ఇచ్చిన ఆధారాల కన్న ఉత్తమమైనవి పంపే వారికి రు. 5 లు బహుమతి ఇస్తాము. ఆధారాలు మాకు చేరవలసిన ఆఖరి తేది మార్చి 18, 1961.


నిలువు

1. వాల్గన భాగం.
* 2. కింపురుషుల వంటివేనా ?
3. నెల్లూరు జిల్లాలో ఒక వూరు ర్యష్టణ.
4. కవ్వములో కూడా గట్టి వలె మ్రోగాలి !
5. కొనగ—నసగకుండా వెలకాలి మరి.
6. మాట త్రిప్పినా ముక్క అయి తీరుతుంది.
7. ఆ తరువాత పుట్టేది !
8. గ్రామోద్యోగి.
13. దగ్గరలో వరుసం చేర్చండి. పిశాచం ప్రత్యక్ష మవుతుంది !
15. తారాజువ్వలు, భూపతులను దాచాయి.
16. హరిద్ర.
17. 21 అడ్డంలో కష్టం !
18. బయట ముక్క ముక్కగా ఉన్న పండు, అలా వస్తే మాత్రం పనికిరాదు !
19. కటకరథంలో కొన్ని విధమవుతాయి— అర్థం కాకపోతే 8 నిలువు చివర మార్చి చూడండి.
24. ప్రాసినది.
26. విజ్ఞానము, వ్రాత !
27. కడవలో—రాయి.
28. నీరు పారేది.


42-వ గళ్ళనుడికట్టుకు జవాబులు



40-వ గళ్ళనుడికట్టుకు జవాబులు



బహుమతి పొందిన కార్టూన్



చిత్రకారుడు—కమలా ఆర్. మోహనరావు (కాకినాడ)

ఎవరుగాడిద?

ఒకానొక పెద్ద మనిషి హోటల్‌లో భోజనాలగదితలుపులు తెరిచి తిరిగి జేరవేయకుండా లోపలికి వెళ్ళాడు. తలుపులు భడీమని చప్పుడు చేస్తూ మూసుకున్నాయి. ఆ చప్పుడు విని భోజనం చేస్తున్న ఒకరికి కోపం వచ్చి "ఎవడో పల్లెటూరి మొద్దులా ఉన్నాడు-తలుపు మూయాలని కూడా తెలియదు" అని అరిచాడు. లోపలికివచ్చిన పెద్దమనిషి ఒక కుర్చీలో చతికిలబడి భోరున ఏడుపు లంకించుకున్నాడు.

కేకలువేసిన ఆయన అతని వద్దకు వచ్చి అనునయంగా

పొట్టికథలు

"మీరింత నొచ్చుకుంటారనుకోలేదు; కోపంతో ఒళ్ళుపై తెలియక ఏదో అనేశాను; మన్నించండి" అన్నాడు.

ఆపెద్దమనిషి కళ్లు తుడుచుకుంటూ ఇలా అన్నాడు: "అబ్బే మీరన్నమాటలకు నేనేమీ బాధపడడం లేదండి. నేను నిజంగా పల్లెటూరివాడినే. ఈమధ్యనే పట్నం వచ్చాను. గాడిద ఓండ్రిస్తే మాత్రం నాకు మాఊరు మాఇల్లుఅన్నీ జ్ఞాపకంవచ్చి ఏడుపువస్తూ ఉంటుంది!"

—జి. తులసీదాస్ (విశాఖపట్టణం)

చెప్పేపద్ధతి ముఖ్యం

ఒక రాజుగారికి తన పళ్లు అన్నీ ఊడిపోయినట్లు కల వచ్చినది. ఇద్దరు జ్యోతిష్కులను రప్పించి ఆ కలకు అర్థం వివరించమని ఆజ్ఞాపించాడు రాజు.

మొదటి జ్యోతిష్కుడు, "తమరు జీవించి ఉండగానే తమ కుమారులు, మనుమలూ మృతిచెందుతారు; అదీ దాని అర్థం" అన్నాడు.

రెండవ జ్యోతిష్కుడు "తమకు తమ కుమారులకన్న మనుమలకన్నా కూడా ఆయుర్దాయం అధికం" అన్నాడు.

రాజు మంత్రిని పిలిచి, రెండవ జ్యోతిష్కుని సన్మానించమని, మొదటి వానిని దండించమని ఆజ్ఞాపించాడు.

—తటవర్తి ప్రసాదరావు (హైద్రాబాదు.)

* * *

అదేగతి

ఒకరాష్ట్రప్రభుత్వ ముఖ్యమంత్రి ఒకప్పుడు పిచ్చాసుపత్రి తనిఖీచేస్తున్నాడు. ఒక పిచ్చివాడు "ఎవరు నువ్వు" అని ఆయనను గద్దించాడు. ఆయన కంగారుపడి "నేను ఈ రాష్ట్రం ముఖ్యమంత్రిని" అని గట్టిగానే సమాధానం చెప్పాడు.

వెంటనే ఆపిచ్చివాడు "ష్, అరవకు. లేకపోతే నీకూ నాకు పట్టిన గతే పట్టుతుంది. జాగ్రత్త" అని ఆయనను హెచ్చరించాడు.

—'సారథి' (తిరుపతి)





ఈ పాప ఎవరో?

నాటి ఏడాది పాప ఎలిజబెత్ రాకుమారి: నేటి బ్రిటిష్ రాణి రెండవ ఎలిజబెత్

Regd. No. M 4479 ANDHRA-SACHITRA VĀRA PĀTRIKA

స్టాండర్డ్ మోటార్స్ వారు సానపనులన్నిటికి కార్బొరండమ్ యూనివర్సల్ అబ్రేసివులను ఉపయోగిస్తారు





"రాపిడి లేకుండా చాలాకాలం మన్నడానికి మోటారు కారులో తిరిగే విడిభాగాలన్నిటినీఅతి సున్నితంగా ఖచ్చితంగా సానబట్టి పై మెరుగు ఇవ్వాలి. ఇట్టి తిరిగే విడిభాగాలకు కావలసినంత ఖచ్చితాన్ని కల్గించి మంచి పై మెరుగులతో తయారుచేయడానికి కార్బొరండమ్ యూనివర్సల్ సానరాళ్లు సహాయ పడతాయి. అంతేగాక కార్బొరండమ్ యూనివర్సల్ వారి అబ్రేసివుల నికారసైన విశిష్ఠత ఉత్తమ రకపు సానపనికి పూచీనిస్తాయి."

—స్టాండర్డ్ మోటార్ ప్రొడక్ట్స్ ఆఫ్
ఇండియా లిమిటెడ్,
మద్రాసు

పోత ఇనుము కార్ఖానాలకూ, వెల్డుచేసిన చోట్లను సాఫీ చేయుటకూ అనువైన కార్బోఫ్లెక్స్ రీయిన్ ఫోర్స్‌డ్ డిప్రెస్డ్ సెంటర్ చక్రాలను మే మిప్పుడు తయారుచేయుచున్నాము.

ఏ పరిశ్రమలోనైనా సరే ఎటువంటి సానపనులకైనా సరే ...
మీకు విశ్వాసనీయమైన సానరాళ్లను తయారుచేయువారు

కార్బొరండమ్ యూనివర్సల్ లిమిటెడ్

హెడ్ ఆఫీసు: 52/53, జహంగీరు స్ట్రీటు, మద్రాసు - 1. టెలిఫోను 2941 (4లైనులు)
కార్ఖానా: తిరువత్తియూరు

డిస్ట్రిబ్యూటర్లు: మెసర్స్ విలియం జాక్స్ & కం. లి., మద్రాసు – 1 మరియు హైదరాబాద్ ఆఫీసు: 2, స్టేషన్ రోడ్.
ప్రత్యేకమైనవాటికి మాత్రము; మెసర్స్ హెచ్ యన్. కాక్స్ & కం. ప్రైవేట్ లి., 24, రాంపార్ట్ రో, బొంబాయి.

CZ-8901